




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



వామపక్షాలు ఒక్కటవ్వాలి

బిజెపి రాష్ట్రాల్లో గిరిజనులకు రక్షణ ఏదీ?

37 విమానాశ్రయాలలో ఇమ్మిగ్రేషన్ కేంద్రాల నియామకం 05



సంపుటి 08, సంచిక: 274 | గురువారం | 4-09-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## సిబిఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు?

ప్రజాపక్షం/హైదరాబాద్

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించే ఆలోచనలో ప్రభుత్వం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు న్యాయ నిపుణుల అభిప్రాయలు తీసుకునే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారని తెలిసింది.ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారుల దర్యాప్తుపై తనకు నమ్మకం లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును సిబిఐకి అప్పగించాలని బండి సంజయ్‌తో పాటు బిఆర్‌ఎస్ నేతలు మాజీ ఐపిఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలుమార్లు డిమాండ్ చేశారు. వీటన్నిటి పరిణాలను నేపథ్యంలో కేసును సిబిఐకి అప్పగించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కాళేశ్వరం కుంభకోణంపై విచారణ జరపాలంటూ తెలంగాణ ప్రభుత్వం సిబిఐకి లేఖ రాసిన విషయం తెలిసిందే. త్వరలో ఫోన్ ట్యాపింగ్‌పై కూడా సిబిఐకి లేఖ రాసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది.

# ఇందిరమ్మ ఇళ్లులేని ఊరేలేదు





- ఏటా ప్రభుత్వం రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేస్తోంది
- పేదల సొంతింటి కల నెరవేరుతోంది
- రూ.లక్ష కోట్లు దోచుకున్న కెసిఆర్ పేదలను విస్మరించారు
- బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పండుగ వాతావరణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/చంద్రుగొండ

'ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. ఇందిరమ్మ గృహ ప్రవేశాలతో పేదల ఆత్మగౌరవ పండుగ జరిగింది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లులేని ఊరేలేదని, ప్రతీ ఏటా ప్రభుత్వం రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేస్తోందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తే కొత్తగూడెం నియోజకవర్గానికి మాత్రం అదనంగా మరో వెయ్యి ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే తీసుకున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన ఈ జిల్లా చాలా చైతన్యవంతమైందని, అందుకే ఈ జిల్లాలోనే అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల పరిధిలోని బెండాలపాడు గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పండుగ వాతావరణంలో జరగగా ఈ సందర్భంగా సిఎం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి గిరిజనుల ఇందిరమ్మ ఇళ్ల రిబ్బన్ కత్తిరించి గ్రహంలోనికి ప్రవేశించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంఎల్‌ఎ జారే ఆదినారాయణ తదితరులతో పాటు నేలపై కూర్చుని ఓ ఇంట్లోని బాలునికి మిఠాయి తినిపించిన ఆయన అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం దామరచర్లలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తరువాయి 2లో



# బిఆర్‌ఎస్ చెత్తపార్టీ

- ఆ నాయకుల వెనుక నేనెందుకుంటా
- కెసిఆర్ దోచుకున్న సొమ్ములో వాటా కోసం కుటుంబ సభ్యులు గొడవ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్

'బిఆర్‌ఎస్ చెత్త పార్టీ. ఆ పార్టీ నేతలు చెత్తగాళ్లని గుర్తించి తెలంగాణ ప్రజలు ఛీ కొట్టినా ఇంకా బుద్ధి రాలేదు. అలాంటి నేతల వెనుక నేనున్నానని అంటున్నారు. ఈ చెత్తగాళ్ళ వెనుక నేనెందుకు ఉంటాను' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణలో కెసిఆర్ దోచుకున్న సొమ్ములో వాటా కోసం కుటుంబ సభ్యులు గొడవ పడుతున్నారని, వీరందరూ కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారని విమర్శించారు. దోచుకున్న సొమ్ములో వాటాలు కుదరక రోడ్డుపై పడ్డారని, తరువాయి 2లో



## పిఎం ధన్-ధాన్య కృషి యోజనలో ఆ 6 జిల్లాలు చేర్చండి

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ప్రధాన మంత్రి ధన్–ధాన్యకృషి యోజన(పిఎండిడికెవై)లో జాబితాలో రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను చేర్చాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్ల వార్షిక వ్యయంతో, 6ఏళ్ల పాటు అమలు చేయబోతున్న ప్రధాన్ మంత్రి ధన్‌ధాన్య కృషి యోజనలో 36 కేంద్ర పథకాల సమన్వయంతో పాటు రాష్ట్ర పథకాలతో అనుసంధానం అవుతూ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని వినియోగించుకోవడం ద్వారా తక్కువ పనితీరు చూపుతున్న జిల్లాలకు విస్తృతంగా లాభం చేకూరుస్తుందని ప్రశంసించారు. ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, నీటిపారుదల, నిల్వ, విలువవృద్ధి వంటి అంశాల్లో ఇది ఒక చారిత్రాత్మక పథకమని మంత్రి పేర్కొన్నారు.

**ఆయిల్ పామ్ రైతుల రక్షణ – దిగుమతి సుంకం పునరుద్ధరణ**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్ పామ్ ( ఎన్ఎంఇఓపి) అమలు క్రమంలో తరువాయి 2లో

## ఉత్తర భారత వరద ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

పంజాబ్‌కు ప్రత్యేక వరద ప్యాకేజీ ఇవ్వాలి : సిపిఐ, సిపిఐ (ఎంఎల్) డిమాండ్



**న్యూఢిల్లీ:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, వరదలతో జమ్మూకశ్మీర్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలు ముంపునకు గురయ్యాయి. దీంతో ఉత్తరాది పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ, సిపిఐ(ఎంఎల్) బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశాయి. నాలుగు దశాబ్దాల్లో చూడని విధంగా పంజాబ్ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే ఆ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాయి. సమగ్ర వరద సహాయ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలో 40కుపైగా మరణాలు సంభవించాయని, 1400 గ్రామాలు నీట మునిగాయని, 1.5 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, పశువులు చనిపోయాయని, ఇళ్లు ధ్వంసమయ్యాయని, కీలక మౌలిక వసతులు దెబ్బ తిని లక్షలాది మంది ఇబ్బంది పడుతున్నారని తరువాయి 12లో



## కాళేశ్వరం అతిపెద్ద స్కాం

ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కవిత కూడా ఒప్పుకున్నారు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రజాపక్షం/కరీంనగర్

ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టాక బుధవారం మొదటి సారి కరీంనగర్‌కు వచ్చిన రామచంద్ర రావుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కరీంనగర్ లో నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షకార్యదర్శుల సమావేశంలో బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావుతో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కెసిఆర్ కూతురు కవిత కూడా అంగీకరించిందన్నారు. కాళేశ్వరం తరువాయి 2లో

## కెసిఆర్ విడిచిన బాణం కవిత

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్



కవిత కెసిఆర్ విడిచిన బాణం అనే సందేహం కలుగుతుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవిత కొన్ని కఠోర సత్యాలు అబద్ధాలు మాట్లాడారని అన్నారు. ప్రజలని మభ్యపెట్టేందుకు కెసిఆర్ కుటుంబంలో కొత్త నాటకం ప్రారంభమైందన్నారు. కవిత రాజీనామా చేయడం శుభ పరిణామం గా భావిస్తాం అని తెలిపారు. కవిత భాగస్వామ్యం లేకుండా అవినీతి జరిగిందా అని ఎద్దేవా చేశారు. కవిత రాజీనామా ఐదేళ్ల ముందు చేసుంటే ప్రజలు తరువాయి 2లో

## హరీశ్‌రావు, సంతోష్‌తో నాన్నా.. జాగ్రత్త



మాజీ సిఎం కెసిఆర్‌కు కల్వకుంట్ల కవిత హెచ్చరిక

బిఆర్‌ఎస్‌లో కొందరు నాపై కక్షగట్టారంటూ ఆవేదన

ఆరడుగుల బుల్లెట్ గాయపరిచిందని

మీడియా సమావేశంలో హరీశ్‌రావుపై ఆరోపణలు

బిఆర్‌ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

ప్రజాపక్షం/హైదరాబాద్

"మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపి సంతోష్‌రావులతో జాగ్రత్త నాన్నా... నీ బిడ్డగా చెబుతున్నాను" అంటూ తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర రావుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బిఆర్‌ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె స్పందించారు. పార్టీ లోని కొందరు తనపై కక్ష గట్టారని, పార్టీ కోసం తను చేసిన సేవలను నాయకత్వం పునరాలోంచించాలని, తను మాట్లాడుతున్నది పార్టీకి వ్యతిరేకంగా కాదన్నారు. 'సామాజిక తెలంగాణ కోసం కట్టుబడి ఉన్నా.. అది తప్పా..? నేను ఏం తప్పుగా మాట్లాడాను.. సామాజిక తెలంగాణ అంటే బిఆర్‌ఎస్ వ్యతిరేకం ఎలా అవుతుంది..' అని కవిత ప్రశ్నించారు. నా ప్రాణం పోయినా కెసిఆర్‌కు అన్యాయం జరగనివ్వను అంటూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నో జన్మల పుణ్యముంటే కెసిఆర్‌కు కూతురిగా పుట్టానని, ఆయనను, పార్టీని నేనెందుకు ఇబ్బంది పెట్టాలనుకుంటానని కవిత ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా లేకున్నా, తాను ఒకేలా ఉన్నానని, అధికారంలో ఉన్నా తరువాయి 2లో

## తక్షణమే ప్రత్యేక ప్యాకేజీ

కేంద్రానికి రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరదలు పోటెత్తడం, కొండచరియలు విరిగిపడడంతో విధ్వంసం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని పంజాబ్, జమ్ము కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని వెంటనే ప్రకటించాలని డిమాడ్ చేశారు. సహాయ, పునరావాస కార్యకలాపాలను వేగవంతం చేయాలని కోరారు. వరదలు పంజాబ్‌లో భారీ విధ్వంసం సృష్టించాయని, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందన్నారు. ఇటువంటి క్లిష్ట సమయాల్లో ప్రధాని శ్రద్ధ వహించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ తక్షణ సహాయం చాలా అవసరమన్నారు. వేలాది కుటుంబాలు తమ ఇళ్ళు, ప్రాణాలను, ప్రియమైన వారిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయని తరువాయి 2లో

శ్లాబుల మార్పులవల్ల వచ్చే నష్టపరిహారం

# కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిందే

ప్రతిపక్షపాలిత రాష్ట్రాల మంత్రుల తీర్మానం



**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో సంస్కరణలు తీసుకువచ్చిన తర్వాత రాష్ట్రాలకు కలిగే ఆదాయనష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం చెల్లించాలని ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు కోరాయి. చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడితే జిఎస్‌టి కౌన్సిల్ రెండు రోజుల కీలక సమావేశాల ఎజెండా ఆమోదించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశాయి. జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశాల ప్రారంభం కావడానికి ముందుగా బుధవారం ఉదయం తరువాయి 12లో

## అధిక టారిఫ్‌లతో భారత్ మమ్మల్ని చంపుతోంది

- ప్రపంచంలో మనుషులకంటే సుంకాలే నయం!
- ట్రంప్ విమర్శలదాడి



**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** అధిక టారిఫ్‌లు వసూలు చేయడం ద్వారా అమెరికాను భారత్ చంపుకు తింటోందని, తాము మాత్రం ఇప్పటివరకూ తెలివి తక్కువవాళ్ళలాగా ఉండిపోయి వారి నుంచి ఎక్కువ సుంకాలు వసూలు చేయలేదని డోనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. వాణిజ్యం, సుంకాలపై భారత్‌కు ఇటీవల ట్రంప్ పాలనా యంత్రాంగంతో ఉద్రిక్తతలు పెరిగాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వెళ్ళగానే ట్రంప్ సహా వివిధ స్థాయిలో మంత్రులు, ఉన్నతాధికారులు ఈ విషయంలో భారత్‌పై ఆరోపణలు ఉద్ధృతం చేశారు. తాజాగా తరువాయి 12లో



అధునాతన ఆయుధాలతో చైనా పరేడ్ 02



ఉత్తరాదిపై వరుణుడి కన్నెర్ర! 05







(సిపిఐ ప్రధాన కార్యదర్శులు – 6వ పేజీలో)



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌లో బాంబుదాడులు
### మూడుచోట్ల 25 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో బుధవారం మూడుచోట్ల బాంబుదాడులు జరిగాయి. ఈ దాడుల్లో మొత్తం 25 మంది మరణించారు. నైరుతీపాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రం క్వెట్టా నగరంలో బలూచిస్థాన్ నేషనల్ రాజకీయపార్టీ చేస్తున్న ర్యాలీపై ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. ఈ దాడిలో 14 మంది మరణించారు. స్టేడియం సమీపంలో ఉన్న ఒక పార్కింగ్ ప్రదేశం వద్ద జరిగిన ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు.అదేవిధంగా ఇరాన్‌తో ఉన్న సరిహద్దులవద్ద బలూచిస్థాన్‌లో జరిగిన మరో బాంబుదాడిలో ఐదురుగురు సైనికులు మరణించారు. గడచిన 11 సంవత్సరాలుగా చైనా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుద్వారా అన్ని ప్రయోజనాలు బయటవారికే సమకూరుతున్నాయని బలూచిస్థాన్ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

## కెసిఆర్ విడిచిన బాణం కవిత
(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించేవారని అన్నారు. వాటాల పంపకాల్లో తేడాల వల్లనే కవిత కొట్లాట ప్రారంభమైందన్నారు. సంతోష్ రావు, హరీష్ రావు వెనక ఉండాల్సిన ఖర్మ మాకేంటి? అని ప్రశ్నించారు. దోచుకొని దాచుకొని నీతి వ్యాఖ్యలు కవిత మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సిఎం రేవంత్ పై అభాండాలు వేయడం సబబు కాదన్నారు.

**బంగారం కొన్నారు–వి.హన్మంత్‌రావు:** కాళేశ్వరం ప్రాజెక్టు సొమ్ముతో బంగారం కొన్నారని కవిత అంటున్నారని మాజీ ఎంపి వి.హన్మంత్‌రావు అన్నారు. బంగారం ఎక్కడ ఉందో కవిత చెప్పితే, దానిపై కూడా సిబిఐ విచారణ చేయమని సిఎం రేవంత్ రెడ్డిని అడుగుతా అని అన్నారు. వాళ్ళ కుటుంబ పంచాయితీకి సిఎం రేవంత్ రెడ్డికి ఏంటి సంబంధం అని ప్రశ్నించారు.

## ప్రత్యేక ప్యాకేజీ (మొదటి పేజీ తరువాయి)

బుధవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ రాష్ట్రాలకు, ముఖ్యంగా రైతులకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని వెంటనే ప్రకటించాలని రాహుల్‌గాంధీ మోదీకి విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ కోసం తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ ఆయన ఒక వీడియో ప్రకటనను కూడా విడుదల చేశారు. 'ప్రజలు తమ కుటుంబాలను కాపాడుకోవడానికి కష్టపడటం బాధాకరం. మోదీ జీ, ప్రజలను రక్షించడం ప్రభుత్వ బాధ్యత. ఈ ప్రజల రక్షణ కోసం వెంటనే ప్రత్యేక సహాయ ప్యాకేజీని సిద్ధం చేయండి' అని గాంధీ తన వీడియో సందేశంలో అన్నారు. గత కొన్ని వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఉత్తర భారతదేశంలో దుఃఖాన్ని నింపాయి. వరుస మేఘా విస్పోటనాలు, వరదలతో అతలాకుతలం అయ్యాయి. ఉప్పొంగే నదులు పలు ప్రాంతాలను ముంచెత్తాయి. రైలు, రోడ్డు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పాఠశాలలను మూసివేశారు. 1988 తర్వాత అత్యంత దారుణమైన వరదలతో పోరాడుతున్న పంజాబ్‌లో, సట్లెజ్, బియాస్, రావి నదులు, కాలానుగుణ వాగులు వాటి ఎగువన భారీ వర్షాల కారణంగా ఉప్పొంగిపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. పన్నెండు జిల్లాలు వరదల బారిన పడ్డాయి. ఇప్పటికే 29 మంది ప్రాణాలను కోల్పోయారు. 2.56 లక్షలకు పైగా ప్రజలను ప్రభావితం చేశాయి. హిమాలయ రాష్ట్రాలలో ఉత్తరాఖండ్ మంగళవారం మరోసారి అతలాకుతలమైంది. వివిధ ప్రాంతాలు భారీ వర్షాలతో జలమయమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడంతో మంగళవారం ఇద్దరు మహిళలు మరణించారు. 1,000 కి పైగా రోడ్లు మూసుకుపోయాయి. కాంగ్రా, మండి, సిర్మౌర్, కిన్నౌర్ జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక చేస్తూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

సిమ్లాలో, కోచింగ్ సెంటర్లు, నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌లతో సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను మూసివేయాలని ఆదేశించారు. రాష్ట్ర రాజధానిలో గత కొన్ని రోజులుగా నిరంతర వర్షాలు కురుస్తున్నాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడే అవకాశం ఎక్కువగా ఉంది.

## కాళేశ్వరం అతిపెద్ద స్కాం
(మొదటి పేజీ తరువాయి)

విచారణలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతుందన్నారు. అసెంబ్లీలో సిబిఐ విచారణ చేయాలని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హైకోర్టులో మాత్రం సరైన వాదనలు విన్పించకుండా బిఆర్‌ఎస్‌కు రిలీఫ్ వచ్చేలా చేశారన్నారు. బిఆర్‌ఎస్ చేసిన స్కాంల విచారణలో జాప్యం చేస్తూ దోషులు తప్పించుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై నివేదిక వచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశంతో పాటు ఫోన్ ట్యాపింగ్, ఈఫార్ములా, గొర్రెల స్కాం కేసులను సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీ పేరెత్తితే గ్రామాల్లో జనం అసహ్యించుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆ పార్టీతో కుమ్మక్కై వత్తాసు పలుకుతున్నారని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిపిస్తానని అందుకు బాధ్యత నాదేనని అన్నారు.

**బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అన్నదమ్ముల్లాంటివి: ఎన్ రామచంద్ర రావు**

బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు అన్నదమ్ముల్లాంటివని, అవినీతికి కవల పిల్లలని సమావేశంలో మాట్లాడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు అన్నారు. బిఆర్ ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆ పార్టీకి చెందిన కుటుంబ సభ్యులే, ఎమ్మెల్సీలే బయట పెడుతున్నారని, అవినీతి సొమ్మును పంచుకోవడంలో విభేదాలు తలెత్తడంతో ఈ విషయాలు చెబుతున్నారని అన్నారు. గత పదకొండేళ్లలో మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని అన్నారు. తెలంగాణాలో అవినీతి రహిత,అభివృద్ధితో కూడిన ప్రభుత్వం రావాలని, సాధించుకున్న తెలంగాణాలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కేవలం బిజెపి ఒక్కటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొంరయ్య, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు డి. శంకర్, సునీల్ రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, సిరిసిల్ల అధ్యక్షుడు గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లులేని ఊరేలేదు
(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలంలో గత ఏడాది మార్చి 11న ప్రారంభించామని, ఇప్పుడు ఆ పథకం కింద నిర్మించిన ఇళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున గృహప్రవేశాలు నిర్వహించామని చెప్పారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, అందుకే అధికారంలోనికి వచ్చిన అనతి కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు సిఎం తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ పేదలను విస్మరించి ఆ పార్టీ పెద్ద కెసిఆర్ లక్ష కోట్ల ఆస్తులను పోగేశాడని, ఇప్పుడు దోచుకున్న ఆస్తులను పంచుకునేందుకు రచ్చకెక్కుతూ తమపై బురద జల్లుతున్నారన్నారు. పదేళ్లపాటు ప్రజలకు మాయమాటలు చెప్పి కాలం వెల్లదీశారని, రేషన్ కార్డులు, పేదల ఇళ్లు ఇవ్వలేదని, కెసిఆర్ దత్తతు తీసుకున్న గ్రామంలోనే ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది మాటలు ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు, ప్రజలకు మేలు చేసేందుకు ఎందాకైనా పోతామని చెప్పారు. గత పాలకులు బర్లు, గొర్లు ఇచ్చి ఎక్కడి వారిని అక్కడే ఉంచిందని, కానీ తలరాతాలు మార్చేది చదువొక్కటే అని, తెలంగాణ బిడ్డలు చదువుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోబోతోందని, డాక్టరు, ఇంజనీర్లు, కలెక్టర్లుగా ఎదిగి ప్రపంచ దేశాల్లో తెలంగాణ బిడ్డలు మెరవాలని అన్నారు. ఇందుకోసం ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అన్ని రకాల హంగులతో ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం ప్రకటించారు.

**జిల్లాలో సమస్యలు పరిష్కరించండి : కూనంనేని**

జిల్లాలో పలు సమస్యలు, ప్రజా అవసరాలు ఉన్నాయని, వాటిని తీర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. గిరిజనుల పోడు భూములకు పట్టాలివ్వాలని, సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు నీరందించాలని, పాల్వంచ కేంద్రంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్, విమానాశ్రయం వంటివి ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు మేలు జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టిలో ఆలోచిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం గృహనిర్మాణ, రెవెన్యూ, సమచారా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీహరి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపి పోరిక బలరామ్ నాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, డా. తెల్లం వెంకట్రావు, రామ్ దాస్ నాయక్, మట్టా రాగమయి, వివిధ సంస్థలు చైర్మన్‌లు మువ్వా విజయ్ బాబు, పసుపులేటి వీరబాబు, హౌసింగ్ ఎండి గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఏఎస్‌పి విక్రాంతి సింగ్ కుమార్, డిఎస్‌పి రెహమాన్‌తో పాటు కాంగ్రెస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ ఫాసిజంపై విజయం 80వ వార్షికోత్సవం
# అధునాతన ఆయుధాలతో చైనా పరేడ్
### జలాంతర్గ డ్రోన్లతో సైన్యం కవాతు
### పుతిన్,కిమ్ సహా 26 దేశాల నాయకులు హాజరు



**బీజింగ్ :** ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్న చైనాదేశం మొట్టమొదటిసారి తన మహా యుద్ధపాటవ సామర్థ్యాన్ని, అత్యాధునిక ఆయుధాలను ప్రపంచం ఎదుట ప్రదర్శించింది. 21 శతాబ్దంలో రోబోలు సహా అత్యాధునిక యుద్ధరీతి ఆయుధాల అతిపెద్ద సైనిక ప్రదర్శనగా ఇది చరిత్రలో నిలిచింది. జపాన్ ఫాసిజంపై యుద్ధ విజయం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బీజింగ్‌లో బుధవారం ఉదయం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన వేడుకలలో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణం చేయగల డిఎఫ్–5సి వ్యూహాత్మక అణుక్షిపణులను మొదటిసారి ఈ సైనిక పరేడ్‌లో చైనా పీపుల్స్ ఆర్మీ ప్రదర్శించింది. ఈ క్షిపణి దాదాపు 20,000 కి.మీ పైగా దూరం ప్రయాణం చేయగలదు. లేజర్ వెపన్స్, ఖండాంతర అణుక్షిపణులు, 15 వేల కి.మీ దూరం ప్రయాణించగల క్షిపణులు, 60 అడుగులు పొడవుగల ఎజెఎక్స్–002 మానవరహిత జలాంర్గత డ్రోన్లు, సిజె–11 స్టీల్త్ డ్రోన్ మానవరహిత యుద్ధ విమానాలు, ఎల్‌వై–1 లేజర్ వెపన్స్, హెచ్‌జెడ్–155 ఎనిమిది చక్రాల క్షిపణి ట్రక్కులు, వైజె–15 క్షిపణులు, వైజె–17 వైజె–19, వైజె–20 హైపర్ సోనిక్ క్షిపణులు, జులాంగ్–3 జలాంతర్గాములు, డాంగ్‌ఫెంగ్–61, డాంగ్‌ఫెంగ్–31 భూతలంమీద నుండి ప్రయోగించే ఖండాంతర క్షిపణులు, యుద్ధసామాగ్రిని యుద్ధ కేంద్రాలకు తరలించగల రోబో యంత్రాలు, అత్యాధునిక యుద్ధ విమానాలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రదర్శించింది. అత్యంత శక్తిమంతమైన జె–35 యుద్ధ విమానాలు, కెజె–600 ఎర్లీవార్లింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను మొదటిసారి ఈ పరేడ్‌లో ప్రదర్శించారు.

తొలుత ఆగస్టు 31,సెప్టెంబరు ఒకటో తేదీలలో షాంఘై సహకార సంస్థ 25 వ వార్షికోత్సవ వేడుకల్లో ఆసియా అగ్రదేశాల నాయకులను ఒక్కచోట చేర్చి తన దౌత్యసామర్థ్యాన్ని ప్రదర్శించిన జిన్‌పింగ్, దాని కొనసాగింపుగా ఈ వార్షికోత్సవ వేడుకలలో అమెరికాను మించినస్థాయిలో తమకున్న అపారమైన సైనికసామర్థ్యాన్ని ప్రదర్శించి డోనాల్డ్ ట్రంప్‌కు పరోక్షంగా ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించారు. మహోన్నతమైన తమ దేశం ఎవరి బెదిరింపులకు భయపడేదిలేదని మరోసారి ఈ రూపేణా స్పష్టం చేసింది. బిబిసి వార్తా సంస్థ ఇవే వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రచారం చేసింది. ఈ వేడుకలలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సతీమణి పెంగ్ లియువాన్, కిమ్ జోంగ్ కుమార్తె ప్రముఖంగా కనిపించారు.

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైనికవందనం స్వీకరించి మిత్రదేశాల నాయకులతో కలిసి పరేడ్‌ను వీక్షించారు. ఈ వేడుకలకు రెండు పశ్చిందేశాలకు చెందిన నాయకులు మాత్రమే హాజరయ్యారు. ఈ వేడుకలకు ముందుగానే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా సర్వాధినేత కిమ్ జోంగ్ ఉన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్ లతో కలిసి జిన్‌పింగ్ బాహాటంగా పక్కపక్కనే వేదిఇక పంచుకుని నిలబడి ఐక్యత ప్రదర్శించి పశ్చిమదేశాలను ఆత్మరక్షణలో పడేశారు. ఈ వార్షికోత్సవాలు వీక్షించడానికి 50,000 మంది పైగా ప్రజలు తరలివచ్చారు. భారతదేశం తరపున చైనాలో దౌత్యవేత్త ప్రదీప్‌కుమార్ రావత్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌తోపాటు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో, మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి సహా 26 దేశాల నాయకులు, ఆ దేశాలకు చెందిన కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ సహా జపాన్,దక్షిణకొరియా దేశాధినేతలు, వారి ప్రతినిధులు ఈ 80వ వార్షికోత్సవ వేడుకలకు దూరంగా ఉన్నారు. ఈ వేడుకలకు ప్రపంచ నాయకులు దూరంగా ఉండాలని జపాన్ చేసిన విజ్ఞప్తిపట్ల చైనా ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

తన–మన అనే భేదం లేకుండా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాదాపు అన్ని దేశాలపై ఇష్టానుసారంగా వాణిజ్య సుంకాల భారాలు విధిస్తూ, తిరిగి అమెరికా సామ్రాజ్యవాదాధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కయ్యానికి కాలుదువ్వుతున్నప్పటికీ, వాణిజ్యంలో పరస్పర ప్రయోజనాలు ఉండాలని, దేశాలకు పరస్పర సమాన గౌరవ మర్యాదలు ఉండాలని, ఆధిపత్య ధోరణి ప్రదర్శించకూడదని అమెరికా ప్రతినిధులతో జరిగిన చర్చల్లో ఇప్పటివరకూ చైనా ప్రభుత్వ ప్రతినిధులు అనేకసార్లు చెలెబుతూ వచ్చారు. ప్రపంచదేశాలకు భిన్నంగా లొంగిపోకుండా అమెరికాపై ప్రతీకార సుంకాలను చైనా విధించింది. ట్రంప్ సుంకాలకారణంగా బ్రెజిల్,భారత్‌దేశాలే ప్రధానంగా నష్టపోయాయి.

**సమానత్వం పాటిస్తేనే దేశాలమధ్య సామరస్యం : జిన్‌పింగ్ పిలుపు**

ఈ 80వ వార్షికోత్సవం విదేశీ దురాక్రమణలపై చైనా తొలి సంపూర్ణ విజయమని, ఈ వేడుకలు ఆధునిక ప్రపంచంలో అందుకు ఒక చిహ్నమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన ప్రసంగంలో చెప్పారు. ప్రపంచశాంతి సాధనకోసం చైనా సైనికులు గొప్ప త్యాగాలు చేశారని నివాళులు అర్పించారు. జపాన్ దురాక్రమణను కమ్యూనిస్టుపార్టీ పాలకులు తిప్పికొట్టారన్నారు. దేశాలమధ్య సమానత్వం, సమాన గౌరవం పాటించినప్పుడే సామరస్య వెల్లివిరుస్తుందని జిన్‌పింగ్ హితబోధ చేశారు. పరస్పర మద్దతు, ఉమ్మడి భద్రత ఉన్నప్పుడే రక్షణ ఉంటుందని, అప్పుడే యుద్ధాల వెనుక ఉన్న మూలకారణాలను పెకలించడం సాధ్యపరుతుందన్నారు. ఇలాంటి చర్యలద్వారానే చారిత్రక విషాదాలు మళ్ళీమళ్ళీ రాకుండా నివారించగలమన్నారు. ఈనాడు మానవ సమాజం శాంతిఇ,యుద్ధం మధ్య నలిగిపోతోందని, చర్చలా–యుద్ధమా? అనే విషయాన్ని తేల్చుకోలేకపోతోందన్నారు. చైనా ప్రజలు చాలా నిక్కచ్చిగా చరిత్రలో మానవ ప్రగతివైపే నిలబడ్డారని, ఇప్పటికీ చైనా ప్రజలు అదే వైఖరి కొనసాగిస్తున్నారన్నారు. శాంతిమార్గంలో మానవాళి భవితవ్యంకోసం కలిసి పనిచేయడానికి చైనా కట్టుబడి ఉందని చెప్పారు.

**పశ్చిమ దేశాల్లో ఆందోళన**

చైనా ఆయుధపాటవ ప్రదర్శన నిపుణులకు ఆశ్చర్యం కలిగించింది. పశ్చిమ దేశాలకు తీవ్ర ఆందోళన కలిగించింది. ఆ దేశాలను ఆలోచనలో పడేసింది. లేజర్ వెపన్స్, షూట్‌డౌన్ క్షిపణులు, వేల కిలోమీటర్లుప్రయాణించగల క్షిపణులు, మానవ రహిత జలాంతర్గాములు పెంటగాన్ రక్షణవర్గాలను లోతైన విశ్లేషణలో ముంచెత్తుతున్నాయి. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అత్యాధునిక ఆయుధ పాటవం కొన్ని విషయాలలో అమెరికాను కూడా దాటేసి వారి అంచనాలను మించిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా తర్వాత ప్రపంచంలో ఈ ఏడాది రక్షణరంగంపై భారీమొత్తంలో నిధులు ఖర్చు చేసింది. ఈ ఏడాది చైనా రక్షణరంగంకోసం 250 బిలియన్ డాలర్లు ఖర్చుచేసింది.

## ఆ 6 జిల్లాలు చేర్చండి (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ చేసిన కృషిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి జెపినడ్డాకు వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 1.06 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశంలోనే అత్యధిక విస్తీర్ణం తెలంగాణదేనని తెలిపారు. దాదాపు 72 వేల మంది రైతులు ఈ పంటపై ఆధారపడుతున్నారని, ఇటీవల క్రూడ్ పామ్ ఆయిల్ (సిపిఓ) పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి కి తగ్గించడం రైతులకు తీవ్ర సమస్యగా మారిందనితెలిపారు. ఆయిల్ పామ్ గెలల టన్నుకు కనీస మద్దతు ధర రూ.25000 వచ్చేలా 2018లో ఉన్నట్లుగా 44శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై విధిస్తున్న 12 శాతం జిఎస్‌టిని పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై 12 శాతం జిఎస్‌టి విధించడం రైతులపై తీవ్రమైన ఆర్థిక భారంగా మారిందన్నారు. ముఖ్యం గా చిన్న, సన్న రైతులు ఆధునిక పరికరాలను కొనుగోలుకు గాను ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు12 శాతం జిఎస్‌టిని మినయించేలా చొరవ చూపించాలని మంత్రి గారు లేఖ ద్వారా కోరారు.

**ఎరువుల సబ్సిడీ పెంపుపై విజ్ఞప్తి**

యూరియా తరహాలోనే ఫాస్ఫేటిక్ , పొటాషియం (పిఅండ్ కె) ఎరువులపై సబ్సిడీని పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పెంపు అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఫోషక ఆధారితసబ్సిడి (ఎన్‌బిఎస్) విధానం వల్ల యూరియాపై ఎక్కువ సబ్సిడీ ఉన్నందున, రైతులు దానిని విస్తృతంగా వినియోగిస్తున్నారని, ఫలితంగా భూమిలో నత్రజని అధికమై, ఫాస్పరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాల వినియోగం తగ్గిపోతుందని ఆయన వివరించారు. దీనివల్ల నేలలో పోషక సమతుల్యత దెబ్బతింటోందని, పంట దిగుబడులు కూడా దీర్ఘకాలంలో పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, 4:2:1 నత్రజని, ఫాస్పరస్, పొటాషియం సిఫార్సు నిష్పత్తి పూర్తిగా నశించి 201819లో 6.6:2.6:1కి పడిపోయిందని, ఇది రైతులకు , దేశ ఆహార భద్రతకు ప్రమాదకరమని గుర్తు చేశారు. తక్కువ ధరలో యూరియా లభించగా, అంతర్జాతీయ ధరల ప్రభావంతో ఫాస్పరస్, పొటాషియం ఎరువులు ఖరీదుగా మారుతున్నాయని తెలిపారు.

పాస్పరస్ , పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరి రఘునందన్ రావు , రెసిడెంట్ కమిషన్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రానికి వరద బెడద
### 2,500 గ్రామాలు నీట మునక
### 3.65 లక్షలమంది ప్రజలు సహా లక్షలాది పశువుల తరలింపు



**ఇస్లామాబాద్:** సట్లెజ్ నదిపై నిర్మించిన డ్యామ్ నుండి వరద నీటిని భారీగా దిగువకు విడుదల చేస్తున్నట్లు హెచ్చరిక చేసిన తర్వాత పంజాబ్ ప్రాంతానికి తీవ్రమైన వరద ప్రమాదం ముందుకు వచ్చింది. నదులన్నీ ప్రమాదస్థాయిని దాటి రికార్డు స్థాయిలో ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆ దేశంలోని పంజాబ్ రాష్ట్రానికి వరదనీరు కారణంగా అతిపెద్ద ప్రమాదం వాటిల్లింది. అనేక రోజులుగా పంజాబ్ రాష్ట్రాన్ని తీవ్ర వర్షప్రభావం వెంటాడుతోంది. ఒక్క పంజాబ్ రాష్ట్రంలోనే వరదలకారణంగా లక్షలమంది నిరాశ్రలయ్యారని ప్రభుత్వ అధికారులు చెప్పినట్లు అల్‌జజీరా పేర్కొంది. దాదాపు 2,500 గ్రామాలు మోకాలుదాటిన నీట మునిగాయి. అనేక ఇళ్ళు దెబ్బతిన్నాయి. ప్రధానంగా 30 లక్షలమంది ప్రజలు నివసించే ముల్తాన్ నగరానికి పెద్ద ప్రమాదం వాటిల్లింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది.

## బిఆర్ఎస్ చెత్తపార్టీ (మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి చెత్త నాయకుల వెనుక తానున్నానని అంటున్నారని, హరీష్‌రావు, సంతోష్‌రావు వెంట ఎందుకు ఉంటానని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎప్పుడూ తెలంగాణ ప్రజల వెంటే ఉంటారన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా ముసాపేట మండలం వేముల గ్రామ పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎస్‌జిడి కార్నింగ్ ఫార్మా స్యూటికల్ గ్లాస్ ట్యూబింగ్ జాయింట్ వెంచర్ ఫర్నేస్ లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడని కెసిఆర్‌ను పాలమూరు నుంచి పార్లమెంట్‌కు పంపిస్తే ఇక్కడి ప్రాంతానికి ఆయన చేసింది శూన్యమని విమర్శించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ పాలమూరులోని నెట్టేం పాడు, భీమా, పాలమూరు, రంగారెడ్డి, నారాయణ పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. కెసిఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ నాశనమయ్యాయని విమర్శించారు. కెసిఆర్ చేసిన పాపం ఊరికే పోదని తొందరలోనే బిఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

**పాలమూరు అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలి**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో విద్య, వైద్య రంగాలతో పాటు సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం ఇస్తూ వలసల పాలమూరు జిల్లాను అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో మహబూబ్‌నగర్ జిల్లా నూతన పరిశ్రమలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలకు మహబూబ్‌నగర్ జిల్లా వేదిక కాబోతుందన్నారు.

ఒకప్పుడు పాలమూరు జిల్లా వలసలకు మారుపేరని, నాటి పాలకులు పేదరికం, వలసలు, సమస్యలను చూపించడానికి ప్రపంచ నాయకులను పాలమూరు జిల్లాను చూపించడానికి తీసుకువచ్చేదన్నారు. భవిష్యత్తులో మన అభివృద్ధిని, పరిశ్రమలను యూనివర్సిటీలను, సాగునీటి ప్రాజెక్టు లను చూపించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా జిల్లాను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన పాలమూరు రంగారెడ్డి, జురాల, నెట్టెంపాడు వంటి ఏ ప్రాజెక్టులు సంపూర్ణంగా పూర్తి కాలేదు. పాలమూరు జిల్లా నుంచి ఇంజనీర్లు, డాక్టర్లే కాదు, ఐఎఎస్‌లు ఐపిఎస్‌లుగా ఎదిగి రాష్ట్రానికే కాదు దేశానికి సేవలందించేలా ఎదగాలనీ తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు అందించి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఉదండా పూర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని మేం ప్రయత్నిస్తుంటే. ప్రతిపక్షాలు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారనీ దుయ్యబట్టారు. ఏ ప్రాజెక్టులు కట్టాలన్నా, పరిశ్రమలు నెకొల్పాలన్నా భూమి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేవర కద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు బిడ్డ అయిన ఎ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంవత్సరానికి 20 వేల కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి నెరవేరుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, షాద్ నాగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, ఎస్. జి.డి టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ సర్జిత్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## నాన్నా.. జాగ్రత్త (మొదటి పేజీ తరువాయి)

తనను ప్రతిపక్ష ఎంపిలాగానే చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరడుగుల బుల్లెట్టే (హరీశ్‌రావు) తనను గాయ పరిచిందని, వీళ్లే ఇతర రాష్ట్రాలకు వెళ్తారు.. కుట్రలు చేస్తారని ఆమె ఆరోపించారు. వీరి వల్లే విజయశాంతి, మైనంపల్లి, ఈటల సహా ఎంతో మంది పార్టీని వీడారని, ఉప ఎన్నికల్లో ఈటలను హరీశ్‌రావే దగ్గరుండి గెలిపించారని,ఈ విషయాలను కెటిఆర్ గుర్తించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయ్యారని అన్నారు. వాళ్ళిద్దరూ ఒకే విమానంలో ప్రయాణించారని, సిఎం రేవంత్ రెడ్డి కాళ్లు హరీశ్‌రావు పట్టుకున్నాకే ఈ కుట్రలు మొదలయ్యాయని ఆరోపించారు. సంతోష్ రావు, హరీశ్ రావు గ్యాంగ్ లతో బిఆర్‌ఎస్ కు ఇబ్బంది ఉందని కవిత వెల్లడించారు. తనపై అక్రమ కేసులు పెట్టి తీహార్ జైల్లో ఐదున్నర నెలలు పెట్టారని, బయటకు రాగానే, పది నెలల వ్యవధిలో 42 నియోజక వర్గాల్లో పర్యటించి. రాష్ట్రంలో ఏ మూల సమస్య ఉన్నా స్పందించానని తెలిపారు.

**రేపు కెటిఆర్‌కు కూడా తప్పదు : కవిత**

తనపై పార్టీలో కుట్రలు జరుగుతుంటే కార్యనిర్వహక అధ్యక్షులుగా కెటిఆర్ ఏం చేశారంటూ కవిత ప్రశ్నించారు. ఒక చెల్లిని, మహిళా ఎంఎల్‌సిని తనపై కుట్రలు జరుగుతున్నాయంటూ గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పానని గుర్తు చేశారు. కార్యనిర్వహక అధ్యక్షులుగా కెటిఆర్ ఏం జరిగిందని తనకు కనీసం ఫోన్ కూడా చేయరా అన్నా అని ప్రశ్నించారు. తను మీడియా సమావేశం పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా అని అన్నారు. పైగా మహిళా నేతలు తనపై ప్రెస్ మీట్ పెట్టారని, తాను కోరుకున్నది కూడా అదేనని కవిత వెల్లడించారు. కొందరు తమ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నారని, అందుకే తనను పార్టీ నుంచి బయట గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పార్టీని హస్తగతం చేసుకోవాలని కుట్రలు చేస్తున్నారని, రేపు కెటిఆర్‌కు ఇదే జరుగబోనుందన్నారు.

**హరీశ్ రావు, సంతోష్‌రావులే టార్గెట్‌గా విమర్శలు..**

కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కెసిఆర్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని, మరీ హరీశ్ రావుపై ఎందుకు మాట్లాడడం లేదని కవిత ప్రశ్నించారు. కెసిఆర్‌పై సిబిఐ విచారణ వచ్చిందంటే.. అందుకు కారణం హరీశ్ రావు, సంతోష్ రావేనని ఆరోపించారు. మొదటి నుంచి కూడా కెసిఆర్‌తో హరీశ్‌రావు లేడని, ఆయన టిడిపి నుంచి బయటకు వచ్చే సమయంలో కూడా.. ఎందుకు ఈ నిర్ణయం అంటూ హరీశ్ రావు ప్రశ్నించారన్నారు. హరీశ్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. డబుల్ షూటర్.. కెసిఆర్‌కు హరీశ్ రావు కట్టప్ప లాంటి వారన్నారు.

**ఎంఎల్‌సికి, బిఆర్‌ఎస్‌కు కవిత రాజీనామా**

తన శాసనమండలి సభ్యత్వానికి, బిఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇందుకు సంబంధించిన రెండు లేఖలను ఆమె బుధవారం తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చూపించారు. అనంతరం తన రాజీనామా పత్రాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన ఓఎస్‌డికి జాగృతి నేతలు అందజేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌కు ఫోన్ చేసి కవిత విజ్ఞప్తి చేవారు.

ఆమె నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2020 ఉప ఎన్నిక సందర్భంగా తొలిసారిగా మండలి నుంచి ఎన్నుకోబడగా, తిరిగి 2022లో ఆమె ఎన్నికయ్యారు. ఆమె పదవీ కాలం మరో మూడు సంవత్సరాలు ఉండగానే రాజీనామా సమర్పించారు.

బిఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇద్దరు జిఎస్‌టి అధికారుల అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిల్లు క్లియర్ చేసేందుకు బాధితుడి నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా సిబిఐ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రిటైర్డ్ జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ ఎస్.ఎం.విజయ్‌కుమార్‌కు పే పారిటీకి సంబంధించిన బిల్లులు రూ.14.45 లక్షలు రావాల్సి ఉంది. ఈ మేరకు విజయ్‌కుమార్ జిఎస్‌టి కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ డి.ప్రకాష్‌రావుతో పాటు సీనియర్ అసిస్టెంట్ అధికారి సుదర్శన్‌లను కలిశాడు. బిల్లు క్లియర్ చేసేందుకు ఆ ఇద్దరు అధికారులు విజయ్‌కుమార్‌ను రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.25 లక్షలు తీసుకునేందుకు అంగీకరించారు. ఈ మేరకు విజయ్‌కుమార్ సిబిఐ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ క్రమంలోనే బుధవారం విజయ్‌కుమార్ నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటున్న ప్రకాష్‌రావుతో పాటు సుదర్శన్‌లను సిబిఐ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిబిఐ ఎసిబి డిఐజి కె.శివసుబ్రమణి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మిడ్ డే మీల్స్ మెనూ అమలు వివరాలివ్వండి

### రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే ఆహార నాణ్యతాప్రమాణాల అమలు గురించి వివరించాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆహార మెనూ వివరాలు, వాటి అమలు తీరుపై కౌంటర్ వేయాలంది. జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారం ఉండటం లేదని, సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నారంటూ అఖిల్ శ్రీగురుతేజ పిల్ వేశారు. దీనిని చీఫ్ జస్టిస్ పీకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ విచారించింది. ఒక పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా వందకుపైగా బాలికలు ఆస్పత్రిపాలయ్యారని చెప్పారు. పాఠశాల స్థాయిలో ఉన్న కమిటీల పర్యవేక్షణలో తనిఖీలు, ఆహార పరిశీలన చేశాక ఫొటోలు తీసి అధికార వెబ్‌లో పోస్టు చేయాలనే నిబంధనలను కాగితాలకే పరిమితం అయ్యాయని చెప్పారు. వాస్తవానికి నిబంధనలు అమలు కావడం లేదన్నారు. విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.


**ఫారం - 7**

(చట్టం-30/2013 లోని సెక్షన్ 19(1) లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం)

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవిన్యూ (భూసేకరణ) శాఖ**

కలెక్టర్/సంయుక్త కలెక్టర్/ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ)/ ప్రత్యేక ఉప కలెక్టర్(భూసేకరణ)

**రూఢీ ప్రకటన**

**గెజిట్ నెం. 65/2025/ . తేది: 30.08.2025**

**జిల్లా కలెక్టర్ యదాద్రి భువనగిరి ఫైల్ నెం.G/2502/2025 తేది: 22.08.2025**

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యదాద్రి భువనగిరి ఫైల్ నెం. A/12/2025, తేది: 20.08.2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రాఘవపూర్ గ్రామములో విస్తీర్ణం **ఎ.14.16 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమై యున్నదని నిర్ణయించినారు.

కావున యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్ మండలం రాఘవపూర్ గ్రామములో విస్తీర్ణం **ఎ.14.16 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం (డిక్లరేషన్) జారీచేయనైనది.

**జిల్లా: యదాద్రి భువనగిరి మండలం: బీబీనగర్ గ్రామం: రాఘవపూర్**

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|
| 42 ఖుష్కీ / పట్టా 0.18 | కంభం మధవీలత రెడ్డి భర్త శశిధర్ రెడ్డి | కంభం మధవీలత రెడ్డి భర్త శశిధర్ | 0.18 | తాటి చెట్టు (01), శీతాఫలం (13), రేగు చెట్లు (02), నెమలి నార (06), శిష్యు చెట్లు (07), |
| | కంభం నరేంద్రనాథ్ రెడ్డి తండ్రి కె.వి. నారాయణరెడ్డి | కంభం నరేంద్రనాథ్ రెడ్డి తండ్రి కె.వి నారాయణరెడ్డి | | |
| | పి. సత్యనారాయణ రెడ్డి తండ్రి సోమశేఖర్ రెడ్డి | పి. సత్యనారాయణ రెడ్డి తండ్రి సోమశేఖర్ రెడ్డి | | |
| | అవదుల రాఘవనంద రాజు తండ్రి రామలింగం | అవదుల రాఘవనంద రాజు తండ్రి రామలింగం | | |
| | చిలుకూరి మంజుల భర్త మధుసూదన్ రెడ్డి | చిలుకూరి మంజుల భర్త మధుసూదన్ రెడ్డి | | |
| | గడిల సాయి ప్రణయ్ రెడ్డి తండ్రి ప్రభాకర్ రెడ్డి | గడిల సాయి ప్రణయ్ రెడ్డి తండ్రి ప్రభాకర్ రెడ్డి | | |
| | కంభం సునీత రెడ్డి భర్త కె.వి.నారాయణ రెడ్డి | కంభం సునీత రెడ్డి భర్త కె.వి.నారాయణ రెడ్డి | | |
| | మంతెన జయలక్ష్మి భర్త రాజశేకర్ | మంతెన జయలక్ష్మి భర్త రాజశేకర్ | | |
| | గాలికుంట బస్వా రెడ్డి తండ్రి గాలికుంట | గాలికుంట బస్వా రెడ్డి తండ్రి గాలికుంట | | |
| 43 ఖుష్కీ / పట్టా 0.05 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.05 | నెమలి నార చెట్లు (04), శిష్యు (02) |
| 44 ఖుష్కీ / పట్టా 0.12 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.12 | వేప (13), నెమలి నార (01), శీతాఫలం (01), రేగు చెట్లు (19), సుబాబు (01) టేకు చెట్లు (02) |
| 49 ఖుష్కీ / పట్టా 0.05 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.05 | |
| | బిట్ల వీరారెడ్డి తండ్రి సీతారాం రెడ్డి | బిట్ల వీరారెడ్డి తండ్రి సీతారాం రెడ్డి | | |
| | మంద్ర రాఘవులు తండ్రి నర్సయ్య | మంద్ర రాఘవులు తండ్రి నర్సయ్య | | |
| | మంద్ర వెంకటలక్ష్మి తండ్రి రాఘవులు | మంద్ర వెంకటలక్ష్మి తండ్రి రాఘవులు | | |
| 51 ఖుష్కీ / పట్టా 0.08 | పల్ల రంగారెడ్డి తండ్రి లక్ష్మి నరసింహారెడ్డి | పల్ల రంగారెడ్డి తండ్రి లక్ష్మి నరసింహారెడ్డి | 0.08 | రేగు చెట్లు (03) |
| | పల్ల జనార్దన్ రెడ్డి తండ్రి లక్ష్మి నరసింహారెడ్డి | పల్ల జనార్దన్ రెడ్డి తండ్రి లక్ష్మి నరసింహారెడ్డి | | |
| | పల్ల బాల్ రెడ్డి తండ్రి రంగా రెడ్డి | పల్ల బాల్ రెడ్డి తండ్రి రంగా రెడ్డి | | |
| | ఇటికల వాణి భర్త నాగిరెడ్డి | ఇటికల వాణి భర్త నాగిరెడ్డి | | |
| | కొత్త కాపు సుజాత భర్త శ్రీనివాస్ రెడ్డి | కొత్త కాపు సుజాత భర్త శ్రీనివాస్ రెడ్డి | | |
| 52 ఖుష్కీ / పట్టా 0.18 | ఎ. రంగరాజు తండ్రి భీమరాజు | ఎ. రంగరాజు తండ్రి భీమరాజు | 0.18 | నల్లంగి (23), శీతాఫలం (01), రేగు చెట్లు (12), టేకు చెట్లు (680), ఉడుగు చెట్లు (04) |
| | యం.సత్యనారాయణ రాజు తండ్రి పెద్ద బంగారు | యం.సత్యనారాయణ రాజు తండ్రి పెద్ద బంగారు | | |
| 54 ఖుష్కీ / పట్టా 0.08 | బుయ్య రాజలింగం తండ్రి రామయ్య | బుయ్య రాజలింగం తండ్రి రామయ్య | 0.08 | దిల్సినమ్ (01), వేప (04), |
| | యస్. గణేష్ రావు తండ్రి అంజయ్య | యస్. గణేష్ రావు తండ్రి అంజయ్య | | |
| | యస్. అర్చన భర్త గణేష్ రావు | యస్. అర్చన భర్త గణేష్ రావు | | |
| | టి.కె. విజయ భాస్కర్ తండ్రి దేవేంద్రం | టి.కె. విజయ భాస్కర్ తండ్రి దేవేంద్రం | | |
| | సాంబ ప్రేమానంద్ తండ్రి సదానంద్ | సాంబ ప్రేమానంద్ తండ్రి సదానంద్ | | |
| | పి.ఆర్ రోడ్డు | పి.ఆర్ రోడ్డు | | |
| 55 ఖుష్కీ / పట్టా 0.0550 | పల్ల జనార్దన్ రెడ్డి తండ్రి లక్ష్మి నర్సింహా రెడ్డి | పల్ల జనార్దన్ రెడ్డి తండ్రి లక్ష్మి నర్సింహా రెడ్డి | 0.0550 | పెద్ద మావి (01), తాటి చెట్టు (01) |
| 56 ఖుష్కీ / పట్టా 0.17 | సాయి అగ్రి ఫామ్స్ | సాయి అగ్రి ఫామ్స్ | 0.17 | తాటో చెట్టు (01) |
| | పల్ల బాల్ రెడ్డి తండ్రి లక్ష్మి నర్సింహా రెడ్డి | పల్ల బాల్ రెడ్డి తండ్రి లక్ష్మి నర్సింహా రెడ్డి | | |
| 64 ఖుష్కీ / పట్టా 0.38 | నోముల బాల్ రెడ్డి తండ్రి సత్తి రెడ్డి | ఎస్టేట్ ఎల్లో స్టోన్ ఎడ్యుకేషన్ సొసైటీ పివిటి లిమిటెడ్ | 0.38 | మోదుగ చెట్లు (02), టేకు చెట్లు (356), దిల్సినమ్(01) |
| | నోముల బలరాం రెడ్డి తండ్రి సత్తి రెడ్డి | | | |
| 65 ఖుష్కీ / పట్టా 0.03 | మాగ్జిమ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ (జి. మధుసూదన్ రెడ్డి) | ఎస్టేట్ ఎల్లో స్టోన్ ఎడ్యుకేషన్ సొసైటీ పి.వి టి లిమిటెడ్ | 0.03 | కడీలు (26), ఐరన్ గెట్(01) కాంపౌండ్ వాల్ (102 మీ.), మామిడి (01) |
| 523 ఖుష్కీ / పట్టా 0.08 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.08 | |
| 524 ఖుష్కీ / పట్టా 0.28 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.28 | కడీలు (35), ఫెన్సింగ్ వైర్ (01), తాటి చెట్లు (04), శీతాఫలం (10) రేగు (05) |
| | రోహిణి మినరల్స్ పివిటి లిమిటెడ్ (ఎ.తిరుపతి రెడ్డి) | కె.జె.ఎల్ హౌసింగ్ రీసర్చ్ పివిటి లిమిటెడ్ | | |
| | చాకలి భూమయ్య తండ్రి రామయ్య | | | |
| | మడేలు పుల్లయ్య తండ్రి పెంటయ్య | | | |
| 525 ఖుష్కీ / లావుని పట్టా 0.10 | పాములపర్తి పురుషోత్తం తండ్రి రాజయ్య | పాములపర్తి పురుషోత్తం తండ్రి రాజయ్య | 0.10 | |
| | పాములపర్తి కృష్ణ తండ్రి రాజయ్య | పాములపర్తి కృష్ణ తండ్రి రాజయ్య | | |
| | పీవీ శారద భర్త రమణ రావు | పీవీ శారద భర్త రమణ రావు | | |
| | జంగ సూర్య ప్రకాష్ తండ్రి ఎల్లయ్య | జంగ సూర్య ప్రకాష్ తండ్రి ఎల్లయ్య | | |
| | జే వై శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య | జే వై శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య | | |
| | జంగా వేణుగోపాల్ తండ్రి ఎల్లయ్య | జంగా వేణుగోపాల్ తండ్రి ఎల్లయ్య | | |
| 526 ఖుష్కీ / పట్టా 0.09 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.09 | |
| 527 ప్రభుత్వ భూమి 0.02 | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి | 0.02 | శీతాఫలం చెట్లు (11) |
| 528 ఖుష్కీ / పట్టా 0.32 | తెల్జూరి మల్లేష్ తండ్రి అచ్చయ్య | తెల్జూరి మల్లేష్ తండ్రి అచ్చయ్య | 0.32 | శీతాఫలం చెట్లు (03) తాటి చెట్టు (01) |
| | తెల్జూరి బిక్షపతి తండ్రి అచ్చయ్య | తెల్జూరి బిక్షపతి తండ్రి అచ్చయ్య | | |
| | తెల్జూరి ఆంజనేయులు తండ్రి అచ్చయ్య | తెల్జూరి ఆంజనేయులు తండ్రి అచ్చయ్య | | |
| | తెల్జూరి మల్లేష్ తండ్రి వీరయ్య | తెల్జూరి మల్లేష్ తండ్రి వీరయ్య | | |
| | తెల్జూరి కిషన్ తండ్రి భద్రయ్య | తెల్జూరి కిషన్ తండ్రి భద్రయ్య | | |
| | తెల్జూరి వీర మల్లయ్య తండ్రి ఎల్లయ్య | తెల్జూరి వీర మల్లయ్య తండ్రి ఎల్లయ్య | | |
| | తెల్జూరి ధర్మయ్య తండ్రి వీరయ్య | తెల్జూరి ధర్మయ్య తండ్రి వీరయ్య | | |
| | తెల్జూరి శ్రీను తండ్రి రాములు | తెల్జూరి శ్రీను తండ్రి రాములు | | |
| | గజ్జి సుభద్ర భర్త ఆంజనేయులు | గజ్జి సుభద్ర భర్త ఆంజనేయులు | | |
| | కొమ్ము మంజుల భర్త లింగస్వామి | కొమ్ము మంజుల భర్త లింగస్వామి | | |
| | కొమ్ము లావణ్య భర్త మల్లేశం | కొమ్ము లావణ్య భర్త మల్లేశం | | |
| | చీమల జ్యోతి భర్త మల్లేశం | చీమల జ్యోతి భర్త మల్లేశం | | |
| | కొత్తపల్లి నాగచందర్ తండ్రి సత్యనారాయణ | కొత్తపల్లి నాగచందర్ తండ్రి సత్యనారాయణ | | |
| 538 ఖుష్కీ / లావుని పట్టా 2.24 | గొలనుకొండ రమేష్ తండ్రి లక్ష్మయ్య | గొలనుకొండ రమేష్ తండ్రి లక్ష్మయ్య | 2.24 | తాటి చెట్టు (01) |
| | మేకల ఆగయ్య తండ్రి శంకరయ్య | మేకల ఆగయ్య తండ్రి శంకరయ్య | | |
| | మేకల కిష్టయ్య తండ్రి శంకరయ్య | మేకల కిష్టయ్య తండ్రి శంకరయ్య | | |
| | బెజవాడ యాదయ్య తండ్రి రాములు | బెజవాడ యాదయ్య తండ్రి రాములు | | |
| | బెజవాడ కిష్టయ్య తండ్రి రాములు | బెజవాడ కిష్టయ్య తండ్రి రాములు | | |
| | బెజవాడ బాలామణి భర్త సుధాకర్ | బెజవాడ బాలామణి భర్త సుధాకర్ | | |
| | ఖాజా మొహినుద్దీన్ | ఖాజా మొహినుద్దీన్ | | |
| | షేక్ జహంగీర్ పాషా తండ్రి షేక్ మహబూబ్ అలీ | షేక్ జహంగీర్ పాషా తండ్రి షేక్ మహబూబ్ అలీ | | |
| | షేక్ మగ్బుల్ పాషా తండ్రి షేక్ మహబూబ్ అలీ | షేక్ మహబూబ్ అలీ | | |
| | షేక్ మునీర్ పాషా తండ్రి షేక్ మహబూబ్ అలీ | షేక్ మునీర్ పాషా తండ్రి షేక్ మహబూబ్ అలీ | | |
| | గౌసియా బేగం భర్త షేక్ మహబూబ్ అలీ | గౌసియా బేగం భర్త షేక్ మహబూబ్ అలీ | | |
| | మేకల లక్ష్మ మ్మ భర్త బాలయ్య | మేకల లక్ష్మ మ్మ భర్త బాలయ్య | | |
| | గుంటిమీది అశోక్ తండ్రి సత్తయ్య | గుంటిమీది అశోక్ తండ్రి సత్తయ్య | | |
| | గుంటిమీది మహేందర్ తండ్రి సత్తయ్య | గుంటిమీది మహేందర్ తండ్రి సత్తయ్య | | |
| | గుంటిమీది నర్సింగ్ రావు తండ్రి సత్తయ్య | గుంటిమీది నర్సింగ్ రావు తండ్రి సత్తయ్య | | |
| | గుంటిమీది సంతోష్ తండ్రి సత్తయ్య | గుంటిమీది సంతోష్ తండ్రి సత్తయ్య | | |
| | గుంటిమీది సహదేవ్ తండ్రి సత్తయ్య | గుంటిమీది సహదేవ్ తండ్రి సత్తయ్య | | |
| | అంబటి బుచ్చయ్య తండ్రి ముత్తయ్య | అంబటి బుచ్చయ్య తండ్రి ముత్తయ్య | | |
| | అంబటి యాదమ్మ భర్త బుచ్చయ్య | అంబటి యాదమ్మ భర్త బుచ్చయ్య | | |
| | అంబటి శ్రీనివాస్ తండ్రి బుచ్చయ్య | అంబటి శ్రీనివాస్ తండ్రి బుచ్చయ్య | | |
| | జంగ సంతోష్ తండ్రి ప్రభాకర్ | జంగ సంతోష్ తండ్రి ప్రభాకర్ | | |
| | చిత్రాల బస్వయ్య తండ్రి స్వామి | చిత్రాల బస్వయ్య తండ్రి స్వామి | | |
| | లింగాల బాలకిషన్ తండ్రి సాంబయ్య | లింగాల బాలకిషన్ తండ్రి సాంబయ్య | | |
| | లింగాల లక్ష్మి నారాయణ తండ్రి సాంబయ్య | లింగాల లక్ష్మి నారాయణ తండ్రి సాంబయ్య | | |
| | రక్తాని రామయ్య తండ్రి పెంటయ్య | రక్తాని రామయ్య తండ్రి పెంటయ్య | | |
| | చిత్రాల బస్వయ్య తండ్రి ఆగయ్య | చిత్రాల బస్వయ్య తండ్రి ఆగయ్య | | |
| | చిత్రాల యాదగిరి తండ్రి ఆగయ్య | చిత్రాల యాదగిరి తండ్రి ఆగయ్య | | |
| | చిత్రాల యాదగిరి తండ్రి నర్సింహా | చిత్రాల యాదగిరి తండ్రి నర్సింహా | | |
| | చిత్రాల మల్లేష్ తండ్రి నర్సింహా | చిత్రాల మల్లేష్ తండ్రి నర్సింహా | | |
| | చిత్రాల బస్వలింగం తండ్రి నర్సింహా | చిత్రాల బస్వలింగం తండ్రి నర్సింహా | | |
| | కాపర్తి రమేష్ | కాపర్తి రమేష్ | | |
| | లింగాల దయానంద్ తండ్రి అంజయ్య | లింగాల దయానంద్ తండ్రి అంజయ్య | | |
| | బిజిలి శ్రవణ్ కుమార్ తండ్రి యాదగిరి | బిజిలి శ్రవణ్ కుమార్ తండ్రి యాదగిరి | | |
| | లింగాల లక్ష్మి నారాయణ తండ్రి అంజయ్య | లింగాల లక్ష్మి నారాయణ తండ్రి అంజయ్య | | |
| | ఎలిగే స్వప్న భర్త శ్రీను | ఎలిగే స్వప్న భర్త శ్రీను | | |
| | గొలనుకొండ నర్సింహా తండ్రి లక్ష్మయ్య | గొలనుకొండ నర్సింహా తండ్రి లక్ష్మయ్య | | |
| | అంబటి బస్వాయ్య తండ్రి బాలయ్య | అంబటి బస్వాయ్య తండ్రి బాలయ్య | | |
| | కొమ్ము రామయ్య తండ్రి గోపయ్య | కొమ్ము రామయ్య తండ్రి గోపయ్య | | |
| | గుంటిమీది చంద్రయ్య తండ్రి నర్సయ్య | గుంటిమీది చంద్రయ్య తండ్రి నర్సయ్య | | |
| | మేకల బాలయ్య తండ్రి శంకరయ్య | మేకల బాలయ్య తండ్రి శంకరయ్య | | |
| | బెజవాడ యాదమ్మ భర్త రాములు | బెజవాడ యాదమ్మ భర్త రాములు | | |
| 538 ఖుష్కీ / పట్టా | పులిపలుపుల సుధాకర్ తండ్రి రామాచారి | పులిపలుపుల సుధాకర్ తండ్రి రామాచారి | | రేగు చెట్లు (01), శీతాఫలము చెట్లు (13), కొబ్బరి చెట్లు (15), మామిడి (05), ఫెన్సింగ్ పోల్స్ (140), ఐరన్ గేట్లు (02) |
| | మట్ట ఆంజనేయులు తండ్రి సత్తయ్య | మట్ట ఆంజనేయులు తండ్రి సత్తయ్య | | ఫెన్సింగ్ పోల్స్ (155), ఐరన్ గెట్ (01), వైర్ మేష్ (01) |
| 540 ఖుష్కీ / పట్టా 1.18 | అల్వ బసవ రెడ్డి తండ్రి వీరారెడ్డి | అల్వ బసవ రెడ్డి తండ్రి వీరారెడ్డి | 1.18 | వేప (01), మోదుగ (04), శిష్యు (03), నెమలి నార (01). నల్లంగి (01), శీతాఫలం (12) |
| | అల్వ యాదమ్మ భర్త రామిరెడ్డి | అల్వ యాదమ్మ భర్త రామిరెడ్డి | | |
| | అల్వ శ్రీకాంత్ రెడ్డి తండ్రి రాం రెడ్డి | అల్వ శ్రీకాంత్ రెడ్డి తండ్రి రాం రెడ్డి | | |
| | అల్వ లింగా రెడ్డి తండ్రి రాంరెడ్డి | అల్వ లింగా రెడ్డి తండ్రి రాంరెడ్డి | | |
| | అల్వ బల్వంత రెడ్డి తండ్రి రాం రెడ్డి | అల్వ బల్వంత రెడ్డి తండ్రి రాం రెడ్డి | | |
| | అల్వ కిష్టారెడ్డి తండ్రి వీరారెడ్డి | అల్వ కిష్టారెడ్డి తండ్రి వీరారెడ్డి | | |
| | అల్వ అంజిరెడ్డి తండ్రి వీరారెడ్డి | అల్వ అంజిరెడ్డి తండ్రి వీరారెడ్డి | | |
| 541 ఖుష్కీ / పట్టా 0.32 | తెల్జూరి బిక్షపతి తండ్రి అచ్చయ్య | తెల్జూరి బిక్షపతి తండ్రి అచ్చయ్య | 0.32 | |
| | తెల్జూరి ఆంజనేయులు తండ్రి అచ్చయ్య | తెల్జూరి ఆంజనేయులు తండ్రి అచ్చయ్య | | |
| 542 ఖుష్కీ / పట్టా 1.15 | ఎం కావ్య తండ్రి నరేంద్రనాథ్ రెడ్డి | ఎం కావ్య తండ్రి నరేంద్రనాథ్ రెడ్డి | 1.15 | బోర్ వెల్ (01), ఫెన్సింగ్ కడీలు (11), శీతాఫలము (04) |
| | చిర్రబోయిన నీలా భర్త కృష్ణ యాదవ్ | చిర్రబోయిన నీలా భర్త కృష్ణ యాదవ్ | | |
| | ఎం వి నరేంద్రనాథ్ రెడ్డి తండ్రి చంద్రశేఖర్ | హౌస్ సైట్స్ | | |
| | చిర్రబోయిన నీల భర్త కృష్ణ యాదవ్ | | | |
| | మురళీమోహన్ రెడ్డి భర్త రాంరెడ్డి | | | |
| | పొట్లేళ్ళ శ్యామ్ కుమార్ తండ్రి సత్యనారాయణ | | | |
| | కసిరెడ్డి రమాదేవి తండ్రి నరసింహ రెడ్డి | తెల్జూరి అచ్చయ్య తండ్రి ధర్మయ్య | | |
| 545 ఖుష్కీ / పట్టా 0.32 | బి. మురళీ మోహన్ రెడ్డి తండ్రి రాంరెడ్డి | హౌస్ సైట్స్ | 0.32 | మోదుగ చెట్లు (03) |
| | యం. వి. నరేంద్రనాథ్ రెడ్డి తండ్రి చంద్రశేకర్ రెడ్డి | హౌస్ సైట్స్ | | |
| 546 ఖుష్కీ / పట్టా 0.13 | ఎం కావ్య తండ్రి నరేంద్రనాథ్ రెడ్డి | ఎం కావ్య తండ్రి నరేంద్రనాథ్ రెడ్డి | 0.13 | |
| 548 ఖుష్కీ / పట్టా 0.34 | ఎం కీర్తి భర్త శశిధర్ రెడ్డి | హౌస్ సైట్స్ | 0.34 | పాలకుడి చెట్టు (01), మోదుగ (05), శీతాఫలం (07), తాటి(01) |
| 588 ఖుష్కీ / పట్టా 0.1950 | నోముల రాంరెడ్డి తండ్రి ఎల్లారెడ్డి | నోముల రాంరెడ్డి తండ్రి ఎల్లారెడ్డి | 0.1950 | తాటి చెట్లు (09), ఈత చెట్లు (01) |
| | పోరెడ్డి రామ్ సుభాష్ రెడ్డి తండ్రి సుధాకర్‌రెడ్డి | పోరెడ్డి రామ్ సుభాష్ రెడ్డి తండ్రి సుధాకర్ రెడ్డి | | |
| 589 ఖుష్కీ / పట్టా 0.02 | గోల్డెన్ ఫారెస్ట్ | గోల్డెన్ ఫారెస్ట్ | 0.02 | శీతాఫలం చెట్లు (09) రేగు చెట్లు (05) తాటి చెట్లు (01), నెమలి వార (04), రావి చెట్టు (01), మర్రి చెట్టు (01) |
| | మంతెన జయలక్ష్మి భర్త రాజశేఖర్ | మంతెన జయలక్ష్మి భర్త రాజశేఖర్ | | |
| | కే సత్యనారాయణ రాజు తండ్రి రాజామ్ రాజు | కే సత్యనారాయణ రాజు తండ్రి రాజామ్ రాజు | | |
| | అవదుల రాఘవందన రాజు తండ్రి రామలింగం | అవదులు రాఘవందన రాజు తండ్రి రామలింగం | | |
| | రోహిణి మినరల్స్ పివిటి లిమిటెడ్ | రోహిణి మినరల్స్ పివిటి లిమిటెడ్ | | |
| | అంకం భవాని భర్త కృష్ణస్వామి | అంకం భవాని భర్త కృష్ణస్వామి | | |
| | | మొత్తం : | 14.16 | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యాదాద్రి భువనగిరి జిల్లా నందు కార్యాలయపు పనివేళనందు చూసుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా | సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి | సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO NO. 560/LA/PP/Advt/Pub/2025-26


# 'ఎఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తెలంగాణ

### జాగర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 'ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా మార్చడమే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ ప్రొక్యూర్‌మెంట్, సప్లయర్ కొలాబరేషన్ సంస్థ జాగర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)ను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'ఒక్క టెక్నాలజీనే కాకుండా అన్ని రంగాలకు చెందిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందిం. ఈ జాబితాలో జాగర్ కూడా చేరడంతో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుంది. కొత్తగా ప్రారంభమైన ఈ జీసీసీ ద్వారా కొత్తగా 180 మందికి ఉపాధి లభిస్తుంది.




రాబోయే రోజుల్లో ఆ సంఖ్య 500కు చేరుతుంది' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'జాగర్ ఏఐ ప్లాట్ ఫాం, ఏఐ ఆధారిత ప్రొక్యూర్‌మెంట్ పరిష్కారాల అభివృద్ధికి ఈ జీసీసీ ఒక వ్యూహాత్మక కేంద్రంగా పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తయారీ, విద్య, ఎఫ్ఎంసీజీ, రిటైల్ తదితర రంగాలకు సాఫ్ట్‌వేర్, క్లౌడ్ ఆపరేషన్ సేవలను అందిస్తుంది' అని తెలిపారు. 'జీసీసీల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలం. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గతేడాదిలో 70 జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 100 జీసీసీలను కొత్తగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని చెప్పారు. 'ఏఐ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేకంగా ఏఐ సిటీని అభివృద్ధి చేయనున్నాం. ప్రపంచానికి ఏఐ నిపుణులను అందించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నాం' అని చెప్పారు. కార్యక్రమంలో జాగర్ సీఈఓ ఆంద్రూ రోస్కో, చీఫ్ డిజిటల్ & ఏఐ ఆఫీసర్ – డెవలప్‌మెంట్ గోపీనాథ్ పోలవరపు, చీఫ్ కస్టమర్ ఆఫీసర్ ట్రాయ్ మేయర్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కుటుంబంలో విభేదాలు ఓ పెద్ద డ్రామా

### పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దోచుకున్న సొమ్మును పంచుకోవడంలో వచ్చిన విభేదాల కారణంగానే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను సస్పెండ్ చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కెసిఆర్ తన సొంత కుటుంబ సమస్యలను కూడా పరిష్కరించుకోలేని బలహీనమైన పరిస్థితుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. సచివాలయంలో మీడియాతో మంత్రి చిట్ చాట్ చేశారు. కవిత ఎపిసోడ్ అంతా ఒక పెద్ద రాజకీయ కుటుంబ డ్రామాగా ఆమే అభివర్ణించారు. గతంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని కవిత విమర్శించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోని బిఆర్‌ఎస్, హరీశ్‌రావు, సంతోష్‌రావులపై ఆరోపణలు చేయగానే సస్పెండ్ చేసిందని ఆమె గుర్తు చేశారు. కెసిఆర్ కుటుంబంపై అవినీతి మచ్చ పడగానే కవితను సస్పెండ్ చేశారన్నారు. రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో హరీశ్ రావు పనిచేస్తున్నారని కవిత మాట్లాడటం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని మంత్రి సీతక్క విమర్శించారు. 2018 ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని ఓడగొట్టడానికి హరీశ్ రావు కొడంగల్‌లో వందల కోట్లు ఖర్చు చేశారని ఆమె గుర్తు చేశారు. నిజంగా రేవంత్ రెడ్డి హరీశ్‌ను కాపాడాలనుకుంటే, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎందుకు విచారణకు ఆదేశిస్తారని కవితను మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిలో హరీష్ రావుది పెద్ద చేయి అని, అందుకే ఆ ప్రాజెక్టుపై సిబిఐ విచారణకు అప్పగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని కవితే అంగీకరించారన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన వేల కోట్ల అవినీతి బయటపడటంతో కెసిఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు మొదలయ్యాయని మంత్రి సీతక్క అన్నారు. అవినీతి, అక్రమ సంపాదన పంపిణీలో వచ్చిన తేడాల కారణంగానే కుటుంబ సభ్యులు గొడవ పడుతున్నారని ఆమె ఆరోపించారు.

#### కెటిఆర్ ప్రోద్బలం లేకుండా కవిత సస్పెన్షన్ సాధ్యమా ?

కెటిఆర్ ప్రోత్సాహం లేకుండా కవితను సస్పెండ చేయడం అసాధ్యమని సీతక్క అభిప్రాయం వ్యక్తం చేశారు. మొదట కెటిఆర్‌ను టార్గెట్ చేసిన కవిత, ఇప్పుడు హరీశ్ రావు, సంతోష్ రావులను లక్ష్యంగా చేసుకున్నారని ఆమె చెప్పారు. కవిత సస్పెన్షన్ బిఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారమైనప్పటికీ, ఆమెను సస్పెండ్ చేసి సంబరాలు చేసుకోవడం, పార్టీ కార్యాలయానికి నిప్పు పెట్టడం విడ్డూరమన్నారు.



#### కవిత దిష్టిబొమ్మ దహనం దురదృష్టకరం

కెసిఆర్ కుటుంబ సభ్యులను ఎవరూ నమ్మరని సీతక్క అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఖతం చేయడానికి ప్రయత్నించి, కాంగ్రెస్ నేతలను చేర్చుకున్నారని ఆమె ఆరోపించారు. పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేస్తే చేశారు కానీ, ఆమె దిష్టిబొమ్మను దగ్ధం చేయడం దురదృష్టకరమని సీతక్క అన్నారు.

# కృత్రిమ మేధలో (ఎఐ) జర్నలిస్టుల నైపుణ్యాల పెంపే లక్ష్యం

### తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ఏజెంటిక్ ఎఐ యుగంలో ఉన్నాం,
ఎఐ పరిజ్ఞానం తప్పనిసరి కానీ,
ఎఐ వల్ల అనేక ప్రమాదాలూ ఉన్నాయ్

ఎఐ సాంకేతికతపై లోతైన నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి






**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిజం రంగంలో కూడా కృత్రిమ మేధ (ఎఐ)ని విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో ఎఐలో జర్నలిస్టుల నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ మేధలో (ఎఐ), టూల్స్, టెక్నిక్స్ వర్క్ షాప్‌ను బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం రంగంలో ఎఐని విస్తృతంగా వినియోగిస్తుండడంతో న్యూస్ రూమ్‌లు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఎఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఎఐని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకుని రిపోర్టింగ్‌లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చని తెలిపారు. ఎఐ సాంకేతికతపై లోతైన నైపుణ్యం ఉన్న అంతర్జాతీయ శిక్షకులు ఉడుముల సుధాకర్ రెడ్డిని ఎఐ పట్ల జర్నలిస్టులకు అవగాహన పెంచేందుకు అహ్వానించినట్లు తెలిపారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఎఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఎఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థిలాగా ఉండాలని, తాను ఇప్పటికీ నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఎఐ శిక్షణలో భాగంగా ఎఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఎఐ పద్ధతులు, నియమనిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. ఆటోమేషన్‌లో భాగంగా ఎఐ ఏజెంట్స్ వస్తున్నాయని, దీని ద్వారా రానున్నకాలంలో వివిధ రకాల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన తెలియజేశారు. చాట్ జిపిటి, పెర్‌ప్లెక్సిసిటీ, నోట్‌బుక్ ఎల్ ఎం, గూగుల్, జెమిని ఎఐ, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్‌ను పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. ఎఐ నైతిక నియమాలు తదితర అంశాలకు లోబడి జర్నలిస్టులు బాధ్యతాయుతంగా కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు రూ.50 వేలు అందించాలి



### రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంట పొలాల పరిశీలన

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టం అందించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఉపాధ్యక్షులు కంజర భూమన్న కోరారు. బుధవారం నవీపేట్ మండలంలో కోస్లీ, మిట్టాపూర్, ఫకీరాబాద్ గ్రామాలలో గోదావరి నది పరివాహాక ప్రాంత రైతుల పంట పొలాలను అకాల వరదల కారణంగా 5 వేల ఎకరాలపై నష్టపోయిన రైతులను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమన్న, రాష్ట్ర కోశాధికారి నరేంద్రప్రసాద్‌లతో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడికే రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు రామదాసుల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమన్నలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగస్టు మాసంలో అకాల వర్షాలతో వాగులు, నదులు పొంగిపొర్లాయని జిల్లాలో అకాల వర్షాల కారణంగా అనేక గ్రామాలలో పంట పొలాలు నీటమునిగాయని, జిల్లా రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వరదలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను పంట నష్టాన్ని పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రధానంగా కోస్లీ, మిట్టాపూర్, తాడ్‌బిలోలి, బోర్గాం, నీలా, కందకుర్తి, యాంచ, నందిగాం, బోధన్ మండలంలోని కండుగావ్, బికినీల్లి, హున్సా, మంత్రన్న గ్రామాల్లో గోదావరి పరివాహాక ప్రాంత రైతులు నదీ ప్రవాహంతో 5 ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. ఈ ప్రాంతంలో కౌలు రైతులు ఎక్కువగా ఉండటం జరిగిందన్నారు. రైతు పెట్టుబడులు ఎకరానికి 30 వేలపై పెట్టిన వారు నోటికి వచ్చిన పంట వరదల పాలైనందున ప్రభుత్వం వెంటనే గ్రామస్థాయిలో అధికారులతో సర్వే నిర్వహించి ప్రతి ఎకరానికి 50 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కోస్లీ గ్రామంలో అలీసాగర్ లిఫ్ట్ వద్ద వంతెన నిర్మించాలన్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు సాయగౌడ్, హుస్సేన్, కోస్లీ గ్రామ రైతులు పాల్గొన్నారు.


**కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

మున్సిపల్ కమిషనర్, కొంపల్లి మున్సిపాలిటీ, ఎంజిఎఫ్ ఫండ్ 2025-26 కింద కింది అభివృద్ధి పనుల కోసం టెండర్ నోటీసు నెం.261/E1/KMC/2025, తేదీ:03.09.2025 ద్వారా ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ కింద టెండర్‌ను ఆహ్వానించడమైనది. పనుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1. మొత్తం పనుల సంఖ్య : (7) పనుల సంఖ్య.
2. పనుల మొత్తం విలువ : 32.85 లక్షలు
3. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ : 03.09.2025న మ.3.30గం.లకు
4. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ముగింపు తేదీ : 10.09.2025న మ.3.00గం.లకు
5. బిడ్ ప్రారంభ తేదీ : 10.09.2025న మ.3.30గం.లకు
6. కార్యాలయ చిరునామా : మున్సిపల్ కమిషనర్,

సంప్రదించవలసిన కార్యాలయం : కొంపల్లి మున్సిపాలిటీ.
సెల్ నంబర్: 9491388409/9963641985/7997994234.

సం/- కమిషనర్ కొంపల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7549-PP/CL/ADVT/1/2025-26, Date: 03-09-2025

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
hmda Growing Global
**4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.**

పబ్లిక్ నోటీసు
ప్రణాళిక విభాగం

ఫైల్ నెం. 000676/HMDA/00122/DWBP/SKP1/2025-ADD.

M/S సుపాధ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి కొల్లూరి బ్రహ్మయ్య మరియు ఇతరులు గతంలో సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెల గ్రామం లో సర్వే నెంబర్లు 122, 123, 148, 150 నుండి 162, 165 నుండి 169, 177 నుండి 183, 186 నుండి 188 వరకు గేటెడ్ కమ్యూనిటీ విల్లాల ప్రాజెక్ట్ కింద గృహనిర్మాణంతో కూడిన డ్రాఫ్ట్ లేఅవుట్ ఆమోదం కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు. 173787.21 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను ఫైల్ నెంబర్ TS/005071/SKP/Plg/HMDA/2022 ద్వారా తేదీ 04.01.2023న ఆమోదించబడింది.

M/S సుపాధ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి కొల్లూరి బ్రహ్మయ్య మరియు ఇతరులు తేదీ 06.02.2025 న సమర్పించిన దరఖాస్తు ద్వారా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెల గ్రామం వద్ద సర్వే నెంబర్లు 117/P, 119/P, 120, 122, 123, 148, 149/P నుండి 169/P, 177 నుంచి 183, 186 నుండి 196/Pలలో 244545.08 చదరపు మీటర్ల పొడిగింపు (గ్రౌండ్ +2 అప్పర్ ఫ్లోర్లు, 1 సెల్లార్+ 1 గ్రౌండ్+2 అప్పర్ ఫ్లోర్లు, 2సెల్లార్స్ +1 గ్రౌండ్+ 3 అప్పర్ ఫ్లోర్లు క్లబ్ హౌస్‌తో గేటెడ్ కమ్యూనిటీ కింద గృహనిర్మాణానికి (కాంపౌండ్ వాల్‌తో) సవరించబడిన డ్రాఫ్ట్ లేఅవుట్ ఆమోదం కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు.

అందువల్ల, వెలిమెల గ్రామంలో ఉన్న సర్వే నెంబర్లు117/P, 119/P, 120, 122, 123, 148, 149/P, నుండి 162, 165 నుండి 169/P, 177నుంచి 183, 186 నుండి 196/P వరకు ఉన్నటువంటి రివైజ్డ్ డ్రాఫ్ట్ లేఅవుట్ యొక్క ప్లాట్ యజమానులు /కొనుగోలుదారులు/ అగ్రిమెంట్ హోల్డర్లు ఈ నోటీస్ ప్రచురించిన తేదీ నుండి 15 రోజులలోపు వారి నుంచి ఎలాంటి అభ్యంతరాలు /సూచనలు ఉన్నా ఈ కార్యాలయానికి లిఖితపూర్వక ంగా దాఖలుచేయవచ్చు. పైన పేర్కొన్న వ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరాలు/ సూచనలు వారి నుంచి అందని పక్షంలో సవరించిన డ్రాఫ్ట్ లేఅవుట్ ఆమోదం కోసం దరఖాస్తును అభ్యర్థించండి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం వెలిమెల గ్రామం వద్ద ఉన్న సర్వే నెంబర్లు 117/P, 119/P, 120, 122, 123, 148, 149/P నుండి 162, 165 నుండి 169/P, 177 నుంచి 183, 186 నుండి 196/P లలో 244545.08 చదరపు మీటర్ల పొడిగింపు రివైజ్డ్ డ్రాఫ్ట్ లేఅవుట్ దరఖాస్తు ఆమోదం ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్ల ఆధారంగా పరిగణించబడుతుంది.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA.

DIPR R.O. No. : 7609-PP/CL/ADVT/1/2025-26, Date: 03-09-2025

## డిజిటల్ యాప్ ద్వారా పంటకోత ప్రయోగాలు

రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి** : కలెక్టరేట్ సమావేశం మందిరంలో బుధవారం రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పంటకోత ప్రయోగాల డిజిటల్ ఆప్ పైన శిక్షణ తరగతులను ఎంపిఎస్ఓ, ఏఈఓలకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎంపిఎస్ఓ, ఏఈఓలు వారికి కేటాయించిన గ్రామాలలో ఎటువంటి పొరపాటు లేకుండా పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సేకరించిన వివరాలను సమయానికి డిజిసిఈఎస్ యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పంటకోత ప్రయోగములు నిర్వహిస్తున్నప్పుడు ప్రాథమిక కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సూచనలు తెలియచేసారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రమణ మాట్లడుతూ సేకరించిన వివరాలను సమయానికి డిజిసిఈఎస్ యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ రమణ, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట రమణ, నీలిమ, యంపిఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సమస్యల పరిష్కారం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్తో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులందరిని ఒక దగ్గరికి తీసుకొచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టిజిసిఎంఎఫ్సి) ద్వారా క్రిస్టియన్ మైనార్టీ నిరుద్యోగ యువతకు కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202526 సంవత్సరమునకు గాను అర్హత గల క్రిస్టియన్ మైనార్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఇంటర్ విద్యార్హతతోపాటు క్రిస్టియన్ మైనార్టీ బిసిసి సర్టిఫికెట్ లేదా బాప్టిజం సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. అభ్యర్థి వయసు 18 నుండి 45 సంవత్సరాల లోపు ఉన్నవారు, పట్టణ ప్రాంతం వారికి ఆదాయం రూ.2లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షల ఆదాయము కలిగి ఉండి ఆధాయ ధృవీకరణ పత్రం మీసేవా ద్వారా జారీ చేసింది ఉండాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నుండి ఏదైన వృత్తి విద్యలో శిక్షణ పొందిన వారు అనర్హులని స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీ లోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి వారి కార్యాలయంలో లేదా విన్సోల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, సూర్యాపేట (భూమిరెడ్డి హాస్పటల్) పక్కన దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9492611057, 9666499929లను సంప్రదించాలన్నారు

## శాంతించిన కృష్ణమ్మ...


సాగర్ ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేత



**ప్రజాపక్షం/నందికొండ:** దాదాపు నెల రోజులకు పైగా తన ఉగ్రరూపాన్ని చూపిన కృష్ణమ్మ బుధవారం శాంతించింది ఇన్నిరోజులుగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 3 లక్షలకు పైగా కొనసాగి నఇన్ ఫ్లో నెమ్మదిగా తగ్గి 50 వేలకు చేరుకోవడంతో బుధవారం నాగార్జునసాగర్ జలాశయం గేట్లను పూర్తిగా మూసివేశారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు 585.20 అడుగులుగా ఉండటంతో వస్తున్న 50 వేల క్యూసెక్కు ల ఇన్ ఫ్లో రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట మట్టానికి చేరుకునేందుకు సరిపోనుండటంతో రిజర్వాయర్ గేట్లను పూర్తిగా మూసివేశారు.
సాగర్ రిజర్వాయర్ సమాచారం: నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు బుధవారం సాయంత్రానికి 586.10అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 300.8385 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 10000 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 5654 క్యూసెక్కులు, ఎస్ఎల్బిసి,ఏఎంఆర్పి ద్వారా 2400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33657 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ కు 52011 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లోగా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

## ఆలేరు బీరప్ప గుడి వద్ద మిగిలిన స్థలాలు పేదలకు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఆలేరు బీరప్ప గుడి దగ్గర మిగిలిన స్థలాలు పేదలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఉప తాసిల్దార్ ప్రదీప్కు వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలు అవుతున్నా పేదల బతుకులు మారడంలేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పేదవానికి తిండి, గూడు, గుడ్డ ఉండాలన్నారు. అర్హులైన పేదలు చాలీచాలని బతుకులు బతుకుతూ అప్పుడప్పుడు ప్రభుత్వాలు అనేక ఆశలు చెప్పి ప్రజలను మోసం చేసి ఇవ్వలేదని చెప్పారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి ఇందిరమ్మ రాజ్యం వస్తే ఇంటింటికి మేనిఫెస్టో అని చెప్పి ఇప్పటికీ పేదలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కనకయ్య, రవి, ప్రవీణ్, సరళ, భవాని, ఆంజనేయులు, నీలమ్మ, శ్రీదేవి, యాదమ్మ, భాగ్యలక్ష్మి, సంధ్య అరుణ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగం మృతి సిపిఐకి తీరనిలోటు

**ప్రజాపక్షం/చివ్వెంల** : ఖమ్మంపాటి రామలింగం మరణించడం సిపిఐ మండల పార్టీకి తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో ఖమ్మంపాటి రామలింగం సంతాప సభ సందర్భంగా ఆయన ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుండి సిపిఐలో ఉంటూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులుగా, పార్టీ గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి ఆయన కృషి మరువలేనిదన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు కెవిఎల్ మాట్లాడుతూ రామలింగం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఈ ప్రాంతంలో ఉద్యమాలు చేసిన ఘనత వారి కుటుంబానికి ఉన్నదని ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన సంతాప సభలో బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ నాయుడు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, అనంతుల మల్లేశ్వరి, ఖమ్మంపాటి అంతయ్య, ఖమ్మంపాటి రాము, జి రాజారామ్, చిలక రాజు శ్రీను, ఎండి పాషా, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.



# మా భూముల్లో రోడ్డు వద్దే వద్దు

ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల డిమాండ్ : తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన..



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. త్రిపుల్ ఆర్ రోడ్ పేరుతో ఉన్న భూములను కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మార్గాన్ని, కేంద్ర ప్రభుత్వం అలాట్మెంట్ మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రహదారులు వేసేందుకు అనేక మార్గాలు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా పేద రైతుల భూముల నుంచి రోడ్లు వేయడం అసహనం కలిగిస్తుందని పేర్కొన్నారు. 2013 చట్టం ప్రకారం రైతు భూమి కోల్పోతే మూడు రెట్లు నష్టపరిహారం అందించే చట్టాలున్న వాటిని పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని అన్నారు. లింగం వారి గూడెం, పుట్టపాక, సాయి గోని బావి, ఎర్రగుంట, దేవి రెడ్డి బంగ్లా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థాన్ నారాయణపురం తహసిల్దార్ కే.శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు పల్లె శేఖర్ రెడ్డి, బూరుగు కృష్ణారెడ్డి, చిలువేరు అంజయ్య, దోనూరు నర్సిరెడ్డి, యాదిరెడ్డి, మాటూరి బాలరాజు, దొంతగాని పెద్దలు, భీమనపల్లి గాలయ్య, పుష్ప రెడ్డి, మహేందర్ రెడ్డి, బద్దుల వెంకటయ్య, సుధాకర్, పెంటయ్య, పద్మ, మహేందర్ రెడ్డి, రాములు, భాస్కర్, నరసింహ, సత్యనారాయణ, నాగార్జున, మల్లయ్య, భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులకు ప్రాధాన్యత

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

దరఖాస్తులను పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి** : భూ భారతి రెవిన్యూ సదస్సులో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని తహాసీల్దార్ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు.



### అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా రెవెన్యూ సేవలు ప్రజల చెంతకు వెళ్ళేలా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్డిఓలు, తహశీల్దార్లతో వెబెక్స్ ద్వారా భూభారతి, ప్రజావాణి అర్జీలు, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, మీసేవ సర్టిఫికెట్ల పెండింగ్పై సమావేశం నిర్వహించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై రెవెన్యూ డివిజనల్ వారీగా సమీక్షిస్తూ చాలా రోజులుగా పరిష్కారం కానీ భూ సమస్యలకై భూభారతి చట్టం రూపొందించటం జరిగిందని, ఒకవేళ తిరస్కరణకు గురైన అర్జీలకు సరైన కారణాలతో వివరించాలని సూచించారు. ఆర్ఎస్ఆర్ అదనపు నమోదులు ఉన్న సర్వే నంబర్లను గ్రామాల వారీగా గుర్తించి, రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయి పర్యటన చేసి భూమిలేని రైతులకు నోటీసులు జారీ చేసి తొలగించాలని అదేవిధంగా ఎవరికైతే ఆన్లైన్లో నమోదు కావాలో వారి పేర్లు నమోదు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి ప్రజావాణి, జిల్లా ప్రజావాణిలలో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అన్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతం నుండి జిల్లా కేంద్రానికి వచ్చి వారి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశతో వచ్చి అర్జీలను సమర్పిస్తున్నారని అట్టి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెవెన్యూ అధికారులు రైతులకు సహాయపడే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసిన లబ్ధిదారులకి ఆ రోజే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఒకవేళ తహశీల్దార్ అందుబాటులో లేకపోతే డిప్యూటి తహశీల్దార్కు ఇంచార్జి ఇవ్వాలని, తహశీల్దార్ కార్యాలయంలో రోజువారి రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక రిజిష్టర్ నిర్వహించాలని, ఆయన గానీ, ఆర్డిఓలు గాని తనిఖీలు చేసినప్పుడు అట్టి రిజిస్టర్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. పేదవాని సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని వాటి నిర్మాణం కొరకు ఇసుక ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది కాబట్టి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎంపిడిఓలను సమన్వయం చేసుకుంటూ, పంచాయితీ కార్యదర్శుల ద్వారా గ్రామాల వారీగా సమాచారం తీసుకొని ప్రతి ఇంటికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



## పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ వెంకటేష్

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** పట్టణంలోని జెడ్పిహెచ్ పాఠశాలను తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారుకొండ వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల లోని 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు భవిష్యత్ జీవితంలో విజయం సాధించడానికి విద్యార్థి జీవితాన్ని ఎలా పునాదిగా ఉపయోగించుకోవాలో తెలియజేస్తూ వారు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ప్రసంగించారు. దీనిని అందరూ అనుసరించాలని చెప్పారు. అనంతరం మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు ఇవ్వబడుతున్న స్వచ్ఛ విద్యాలయ్ హరిత విద్యాలయ్ ఓరియంటేషన్ హాల్ ను సందర్శించి ప్రధానోపాధ్యాయులతో ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీచర్స్ కోసం ఇప్పటికే చాలా చేసిందని,బదిలీలు,పదోన్నతులు,నూతన టీచర్స్ రిక్రూట్మెంట్ ద్వారా టీచర్లను ప్రభుత్వం సంతృప్తి పరిచిందని, ఇక టీచర్స్ బాగా పనిచేసి ప్రభుత్వ బడులకు వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా మరింత అంకిత భావంతో పనిచేయాలని ఆయన కోరారు. తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా 4 తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు ప్రస్తుత నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రాబోవు కాలంలో నియోజకవర్గానికి 10 పాఠశాలలో ఏర్పాటు చేస్తామని చెప్పి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను భవిష్యత్తులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పిస్తామని వారు తెలియజేశారు. వారి వెంట జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి,మండల విద్యాధికారి నరసింహ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. రాములు ఉన్నారు.

## ఆదర్శప్రాయుడు సురవరం సుధాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** విద్యార్థి దశ నుండి ఉద్యమాలకు అంకితమై విద్యార్థి,యువజన సమస్యల పరిష్కారం కోసం, సమ సమాజ స్థాపన కోసం అలుపెరుగని పోరాటం చేసిన సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప ఆదర్శప్రాయుడు అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి, నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ బుధవారం నిర్వహించారు.ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా జిల్లాలో సాగు,త్రాగునీరు కోసం, ఫ్లోరైడ్ పరిష్కారం కోసం కార్మికులు, రైతుల హక్కుల కోసం పార్లమెంట్ లోపల, బయట అనేక ఉద్యమాలు నిర్మించారని అన్నారు. చనిపోయిన తర్వాత తన బాడీని వైద్య విద్యార్థుల కోసం ఇచ్చి గొప్ప ఆదర్శప్రాయుడుగా నిలబడ్డారని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ. గణేష్, శివ, ప్రవీణ్, అనిల్,అఖిల, పూజ, స్నేహ, నయోమి ఉన్నారు.



# రైతు ఆత్మహత్య బాధితులకు రూ.25లక్షల పరిహారం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం డిమాండ్

**ప్రజాపక్షం/మునుగోడు:** రైతులు ఏ కారణం చేతనైనా ఆత్మహత్యకు పాల్పడితే కేంద్ర ప్రభుత్వం 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం దేశవ్యాపిత పిలుపులో భాగంగా బుధవారం మునుగోడు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రై సంఘం ఆధ్వర్యంలో మునుగోడు తహసీల్దార్కు రైతు సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు తదనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం మాట్లాడుతూ పత్తిపై 11 దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పత్తి కి కనీసం మద్దతు ధర (ఎమ్. ఎస్. పి) క్వింటాలుకు 10075 పెంచాలని డిమాండ్ చేశారు.పత్తిని ఉత్పత్తి చేస్తున్న ఈ గొప్ప దేశం యొక్క సంపద సృష్టికి దోహదపడే రైతులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తూ అనేక చట్టాలను తీసుకొచ్చి రైతులను క్రమబద్ధంగా మోసం చేయడం పట్ల తీవ్రంగా రైతాంగానికి ఆగ్రహాన్ని తెప్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 19 న పత్తిపై11 దిగుమతి సుంకాన్ని తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది దీని ఫలితంగా



దేశ రైతుల ఖర్చులతో పత్తిని దిగుమతి చేసుకోవడానికి 0 సుంకం విధించబడుతుంది. ఈ విధాన తిరుగమనం కేంద్ర ప్రభుత్వ దొల్లతనం అని వారన్నారు. రాబోవు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అన్ని సంఘాల కూడగట్టుకుని రైతులకు అన్ని విధాలుగా అండదండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్షులు బండ మీది యాదయ్య, మండల కార్యవర్గ సభ్యులు బిలాలు,ఏఐటీయూసీ మండల అధ్యక్షులు దుబ్బ వెంకన్న,కురుమర్తి ముత్తయ్య,రాంబాబు, సత్తి రెడ్డి,నర్సిరెడ్డి తదితరు పాల్గొన్నారు.



## రోడ్డు వెడల్పు చేయాలని ధర్నా

**ప్రజాపక్షం/యాదాద్రి** : రాజపేట మండలం చెల్లూరు గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కట్ట పోచమ్మ చెరువు కట్ట పైన రోడ్డు వెడల్పు చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుల లింగం మాట్లాడుతూ పొట్టి మరి నుండి చల్లూరుకు పోయే కట్ట పోచమ్మ చెరువు దగ్గర రోడ్డు 12 ఫీట్లు ఉండడం వలన పక్కనే చెరువు ఉండడం వలన ఈ దారిలో ఒక బస్సు వస్తే ఎదురుగా వచ్చే వాహనాలకు దారి లేక పక్కకుపోయే క్రమంలో చెరువులో పడి ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని అన్నారు. ఈ రోడ్డు వెడల్పు లేక ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు రోడ్డు వెడల్పు చేస్తానని ఓట్లు వేయించుకున్న నాయకులకు ఈ రోడ్డు కనబడతలేదా అని నిలదీశారు. పొట్టిమరి నుండి వీరారెడ్డిపల్లి చౌరస్తా వరకు డబల్ రోడ్డు చేసి బస్సు నడపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు మూల పోచయ్య మాట్లాడుతూ గజ్వేల్ నుండి బేగంపేట మీదుగా రాజపేట వరకు బస్సును పునరుద్ధించాలని అట్లాగే జగదేపూర్ నుండి వీరారెడ్డి పల్లి మీదుగా చల్లూరు ఆలేరు వరకు బస్సు నడపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కోట మల్లేశం, ఏఐటీయూసీ నాయకులు వీరయ్య, రాములు, సిహెచ్ రామకృష్ణ, బి.మహేందర్, బాలయ్య, మధుమధు, స్వామి పాల్గొన్నారు.

# ఓట్ చోరీ హటావో - ప్రజాస్వామ్యం బచావో

ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో ఎన్ఎస్యూఐ పోస్టు కార్డు కార్యక్రమం


**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎన్ఎస్యుఐ తలపెట్టిన ఓట్ చోరీ హటావో ప్రజాస్వామ్యం బచావో పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా బుధవారం దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్రపతికి పోస్టు కార్డు రాశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ జాతీయ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ సహకారంతో ఓటు చోరి విధానాలు అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఒకే వ్యక్తికి అనేక చోట్ల ఓట్లు ఉండడం వంటి తీవ్రమైన లోపాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే నిరూపించినప్పటికి, అధికార యంత్రాంగం దానిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు అనే రాజ్యాంగ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్దేనని, వెంటనే ఈ తప్పిదాలను సరిదిద్దాలని, ఓటు చోరి విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్రపతికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యం బతికి ఉండాలంటే ఓటు హక్కు ప్రధానమైన హక్కు అని భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకటయ్యగౌడ్, పట్టణ అధ్యక్షులు యూనుస్, వెంకటేశ్వర్లు, సైదులు, సాధిక్, రాంసింగ్, ప్రభు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





## మూడు నెలల నుంచి అందని జీతాలు

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** బాధ్యతతో విధులు నిర్వహిస్తున్న సకాలంలో వేతనాలు రాక కుటుంబాలు గడపడం కష్టంగా మారిందని అవుట్ సోర్స్ ఉద్యోగస్తులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఉండవెల్లి మండల పరిధిలోని అలంపూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఔట్సోర్స్ ఉద్యోగస్తులు జీతాలు రాక మూడు నెలలు అవుతున్న ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అధికారులకు జీతాలు వస్తున్న ఔట్సోర్స్ వాళ్లకు తక్కువ జీతాలే ఇస్తున్న అవి కూడా రాకపోవడంతో కుటుంబాలను పోషించడం బయట అప్పులు తీర్చడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బంది కూడా రెండు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ లో కూడా జీతాలు లేక వాచర్లకు కూడా పనిచేసిన డబ్బులు రావడం లేదని వారు పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్నస్థాయి ఉద్యోగస్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నత అధికారులు స్పందించి వెంటనే జీతాలు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో 20 మంది నక్సలైట్లు లొంగుబాటు

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో బుధవారం 20మంది నక్సలైట్లు లొంగిపోయారని, వారిలో 11మంది రూ.33 లక్షల సమిష్టి బహుమతిని కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు. 20మంది నక్సలైట్లలో తొమ్మిది మంది మహిళలు, వీరిలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) బెటాలియన్ నంబర్ 1 హార్డ్‌కోర్ కేడర్ ఉందని ఒక అధికారి తెలిపారు. 'బోలు' మావోయిస్టు భావజాలం, అమాయక గిరిజనులపై కేడర్లు చేసిన దురాగతాలు, నిషేధిత సంస్థలో పెరుగుతున్న అంతర్గత విభేదాల పట్ల నిరాశ చెందారని పేర్కొంటూ వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సిఆర్‌పిఎఫ్ అధికారుల ముందు లొంగిపోయారని పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. నిషేధిత మావోయిస్టు సంస్థతో సంబంధం ఉన్న వారందరూ హింసను విరమించుకోవాలని, వారికి భద్రత, గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలని చవాన్ విజ్ఞప్తి చేశారు. వారికి పునరావాస పథకం కింద విద్య, ఉపాధి, స్వావలంబన జీవితం, సౌకర్యాలు అందించబడతాయని ఆయన అన్నారు.

# ఉత్తరాదిని వణికిస్తున్న వర్షాలు, వరదలు



### డ్యామ్ కూలి ముగ్గురు, కొండచరియలు విరిగి ఆరుగురు దుర్మరణం
### ఉప్పొంగుతున్న నదులు
### అనేక ప్రాంతాలు జలమయం





**న్యూఢిల్లీ:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో అకస్మాత్తుగా కొండ చరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందారు. చత్తీస్‌గఢ్ లోనూ ఆకస్మిక వరదలు కారణంగా నలుగురు మరణించగా, ముగ్గురు గల్లంతయ్యారు. ఇక జమ్మూకశ్మీర్‌లోనూ భారీవర్షాల కారణంగా నదులు పొంగిపొర్లుతున్నాయి. నీటి మట్టాలు పెరగడం వల్ల అనేక ఇళ్లు నీట మునిగాయి. ఢిల్లీలోని యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో సమీపంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు వరద బాధిత రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుండపోత వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్ మండి జిల్లా సుందర్‌నగర్ పట్టణంలో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రెండు ఇళ్లు పూర్తిగా నేలమట్టమవగా...ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న భారత సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న ఒక మహిళ, ఓ బాలికను రక్షించి ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స పొందుతూ మరణించారు. శిథిలాల కింద ఇంకా కొంతమంది ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సమీపంలోని 15 ఇళ్లను ఖాళీ చేయించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు ఉన్నారు. వీరిని 35 ఏళ్ల గురుప్రీత్ సింగ్, అతని భార్య భారతి (30), వారి మూడేళ్ల కుమార్తె కిరాత్, శాంతి దేవి (70), సురేందర్ కౌర్ (56)గా గుర్తించారు. ఆరవ బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి. సంఘటన జరిగిన సమయంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నాడు. తన వాహనంతో పాటు కొండచరియలు విరిగి పడటంతో శిథిలాల్లో చిక్కుకున్న మరోవ్యక్తి రాహిల్ ఇంకా కనిపించకుండా పోయాడు. అతని ఆచూకీకి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

అలాగే కులు జిల్లాలో అఖారా బజార్ లోపలి నివాస ప్రాంతంలో అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడి ఒక ఇల్లు దెబ్బతింది. ఇద్దరు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. మండి, కాంగ్రా, సిర్మౌర్, కిన్నౌర్, ఉనా, బిలాస్‌పూర్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మరోవైపు చత్తీస్‌గఢ్ రాష్ట్రం బలరాంపూర్‌లో డ్యామ్ కూలిపోవడంతో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో నలుగురు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు గల్లంతయ్యారు. 1980లో నిర్మించిన ఈ ఆనకట్ట మంగళవారం రాత్రి కూలిపోవడం వల్ల వరద నీరు సమీపంలోని ఇళ్లు, పంటల పొలాల్లోకి ప్రవేశించాయి. మిగిలిన వారి కోసం సహాయ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

జమ్మూకశ్మీర్‌లోనూ భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదుల నీటి మట్టం కూడా గణనీయంగా పెరిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పలుజిల్లాలకు వదరలు ముంచెత్తాయి. ఈ వర్షాలు కారణంగా కొండ చరియలు, క్లౌడ్ బరస్ట్ సంభవించే ఆవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటిలో నుంచి ఎవరు బయటకు రావొద్దని సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలకు సెలవు ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితులపై సమీక్షించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా ఓ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేరారు. తక్షణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశించారు. అధికారుల సలహాలను పాటిస్తూ సురక్షితంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

### సురక్షిత ప్రాంతాలకు ప్రజలు

ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం కూడా యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నది నీటి మట్టం పెరుగుతోంది. సమీపంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సెప్టెంబర్ 7వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

### విమాన సర్వీసులు నిలిపివేత

ఈ ప్రతికూల వాతావరణాల కారణంగా లేహ్‌కు వెళ్లే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు దిల్లీ విమానాశ్రయం పేర్కొంది. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత విమానాలు తిరిగి ప్రారంభయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపింది. మరోవైపు పంజాబ్‌లో కూడా సెప్టెంబర్ 7 వరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు.

### పంజాబ్‌లో వరద మరింత తీవ్రం

ప్రకతి ప్రకోపం కారణంగా పంజాబ్ మొత్తం ప్రభావితమైంది. వరదలు 30 మంది ప్రాణాలను బలిగొనగా, 3.50 లక్షలకు పైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని భాక్రా ఆనకట్ట పరివాహక ప్రాంతంలో భారీ వర్షం కారణంగా భాక్రా ఆనకట్ట నుంచి భారీ పరిమాణంలో విడుదల చేస్తున్నందున పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లా యంత్రాంగం బుధవారం సట్లెజ్ నది సమీపంలో నివసించే స్థానికులను అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఉదయం భాక్రా ఆనకట్ట గరిష్ట సామర్థ్యం 1,680 అడుగులు కాగా, నీటి మట్టం 1,677.84 అడుగులు. ఆనకట్టలో నీటి ప్రవాహం 86,822 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 65,042 క్యూసెక్కులు. అలాగే హిమాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల దష్ట్యా, ఆనకట్ట, నంగల్ ప్రాంతంలోని గ్రామాల నుండి నీటి విడుదలను 65,000క్యూసెక్కుల నుండి 75,000 క్యూసెక్కులకు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రాజ్‌పురా సబ్‌డివిజన్‌లోని ఘగ్గర్ నది పరివాహక ప్రాంతాలలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పటియాలా జిల్లా యంత్రాంగం కూడా ఘగ్గర్ నదికి సమీపంలోని గ్రామాల నివాసితులకు హెచ్చరిక జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వాటి పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాల తర్వాత ఉప్పొంగిన సట్లెజ్, బియాస్, రావి నదులు, కాలానుగుణ వాగుల కారణంగా పంజాబ్ భారీ వరదలను ఎదుర్కొంటోంది.

### వరద బాధిత ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ : రాహుల్ డిమాండ్

ఇదిలా ఉండగా వరద బాధిత జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. అలాగే సహాయక కార్యకలాపాలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'పంజాబ్‌లో వరదలు భారీ విధ్వంసం సష్టించాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ పరిస్థితి కూడా చాలా ఆందోళనకరంగా ఉంది. ఇటువంటి క్లిష్ట సమయాల్లో, ప్రభుత్వం చురుకైన సహాయం చాలా అవసరం. వేలాది కుటుంబాలు తమ ఇళ్లు, ప్రాణాలు కోల్పోయారు. ప్రియమైన వారిని కాపాడుకోవడానికి కష్టపడుతున్నాయి' అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# వామపక్షాలు ఒక్కటవ్వాలి

### బిజెపి విధానాలతో తిరోగమనంలో రాష్ట్రాలు
### హిందుత్వ అజెండా లౌకిక సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
### సిపిఐ కార్యదర్శి నారాయణ



**కుంభకోణం/పుదుచ్చేరి:** దేశ ప్రయోజనాల కోసం వామపక్షాలన్నీ ఒక్కటవ్వాలని సిపిఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. బిజెపి విధానాల కారణంగా దేశంలో అమానవీయ పరిస్థితులు నెలకొంటున్నాయని, సామాజిక అన్యాయం కొనసాగుతోందని విమర్శించారు. దీనిని ప్రతిఘటించడానికే కాకుండా దేశ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం లౌకికవాదాన్ని బలపర్చుకోవడం కోసం అభిప్రాయ భేదాలను పక్కనపెట్టి చేయి చేయి కలపాలని వాపమక్ష పార్టీలకు నారాయణ పిలుపునిచ్చారు. త్వరలో చండీగఢ్‌లో జరగబోయే సిపిఐ జాతీయ మహాసభల్లో వామపక్ష ఐక్యతపై తీర్మానిస్తామన్నారు. సిపిఐ 24వ తమిళ నాడు రాష్ట్ర మహాసభల ప్రారంభ సభలో నారాయణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ తిరోగమన విధానాలతో దేశానికి, ప్రజల ప్రయోజనాలకు నష్టం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసేలా... ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచేలా, రాష్ట్రాల హక్కులను హరించేలా బిజెపి పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని బలహీనపర్చడం కోసం, ఏకఛత్రాధిపత్యం కోసం బిజెపిరాజకీయంగా కుట్రలు చేస్తోందని నారాయణ విమర్శించారు. తమిళనాడు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు యత్నిస్తోందని, ప్రజాస్వామిక వ్యవస్థలను బలహీనపరుస్తోందన్నారు. బిజెపి అనుసరించే విభజన విధానాలను తిప్పికొట్టాలని ప్రజాస్వామిక శక్తులకు, తమిళ ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి హిందుత్వ అజెండా, మతతత్వ ధోరణి భారత లౌకిక వ్యవస్థకు, సమాఖ్య నిర్మాణానికి ప్రమాదకరమని నారాయణ హెచ్చరించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. ఈ ప్రమాదకర ధోరణులను బలమైన ప్రతిఘటనలు, ప్రజల ఐక్యతతోనే అణచివేయగలమని నొక్కిచెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం, నీతి అయోగ్, సిబిఐ వంటి సంస్థలను తనకు ఏజెంట్లుగా బిజెపి మార్చుకుంటోందని నారాయణ విమర్శించాచారు. కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. బిజెపి విధానాలను వ్యతిరేకించే తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలిపారు. ఈ రాష్ట్రాలు జీఎస్టీలో రూ.3 లెక్కన కేంద్రానికి అందిస్తుంటే, అందులో సగం వాటానే తిరిగి పొందగలుగుతున్నాయని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు 60పైసలు సమకూర్చి రూ.3 పొందుతున్నాయని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి... పుదుచ్చేరిలో కాంగ్రెస్, బిజెపి కూటమి అధికారంలో ఉన్నప్పటికీ దీనిని డబుల్ ఇంజిన్ సర్కారు అనలేమన్నారు. రాష్ట్ర హోదా వంటి డిమాండ్ల దృష్ట్యా పుదుచ్చేరి ప్రభుత్వం సగం ఇంజిన్ పని చేస్తోందని నారాయణ వ్యాఖ్యానించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సిపిఐ సీనియర్ నాయకులు, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు మహాసభలకు హాజరయ్యారు. ప్రజా వ్యతిరేక బిజెపివిధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

### దేశవ్యాప్తంగా 37విమానాశ్రయాలలో ...
# ఇమ్మిగ్రేషన్ కేంద్రాల నియామకం

### హోంమంత్రిత్వ శాఖ 'గెజిట్ నోటిఫికేషన్' జారీ
### అంతర్జాతీయ ప్రయాణికుల ప్రవేశం, నిష్క్రమణపై కేంద్రం నిశితదృష్టి

**శ్రీనగర్ :** దేశవిదేశాల ప్రయాణికుల రాకపోకలపై కేంద్ర ప్రభుత్వం నిశిత దృష్టి సారించనుంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికుల ప్రవేశం, నిష్క్రమణ కోసం 37 విమానాశ్రయాలు, 34 ఓడరేవులు, 37అంతర్జాతీయ ల్యాండ్ క్రాసింగ్ పాయింట్ల వద్ద ఇమ్మిగ్రేషన్ కేంద్రాలను హోం వ్యవహారాల మంత్రిత్వ (ఎంహెచ్ఎ) శాఖ నియమించింది. భారతదేశంపాకిస్థాన్, భారతదేశంబంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి ఉన్నటువంటి 6 రైల్వే స్టేషన్లను కూడా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ ప్రయాణికుల ప్రవేశం, నిష్క్రమణ కోసం ఇమ్మిగ్రేషన్ కేంద్రాలు నియమించబడ్డట్లు వెల్లడించింది. సెప్టెంబరు 1న 'ది ఇమ్మిగ్రేషన్, ఫారినర్స్ లర్డర్2025' నోటిఫై చేయబడిన తర్వాత హోం మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఈ ప్రకటన చేసింది. అహ్మదాబాద్, లక్నో, అమృత్‌సర్, వారణాసి, బగ్‌డోగ్రా, బెంగళూరు, భువనేశ్వర్, రాజా భోజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, భోపాల్, కాలికట్(కేరళ), చండీగఢ్, చెన్నై, కొచ్చిన్, కోయంబత్తూరు, డబోలిమ్ (గోవా), ఢిల్లీ, గయ (బిహార్), గువహతి, హైదరాబాద్, ఇండోర్ (మధ్యప్రదేశ్),జైపూర్, కోల్‌కతా విమానాశ్రయాలలో ఇమ్మిగ్రేషన్ కేంద్రాలు నియమించబడ్డాయి. ఇతర విమానాశ్రయాలు కన్నూర్ (కేరళ), మధురై (తమిళనాడు) మంగళూరు, ముంబయి, మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, మోపా (గోవా), నాగ్‌పూర్, పాట్నా, పోర్ట్ బ్లయిర్, పుణే, శ్రీనగర్, సూరత్, ట్రిచి (తమిళనాడు), తిరువనంతపురం, తిరుపతి, విశాఖపట్టణం, విజయవాడ(ఆంధ్రప్రదేశ్)వద్ద ఇమ్మిగ్రేషన్ కేంద్రాలు గుర్తించబడ్డాయి. ఓడరేవులు అలంగ్ (గుజరాత్), అగటి మరియు మినికోయ్ ఐలాండ్ (లక్షద్వీప్), బెడి బందర్ (జామ్‌నగర్, గుజరాత్), భావ్‌నగర్ (గుజరాత్), కాలికట్ (కేరళ), చెన్నై, కొచిన్, కడలూరు (చెన్నై), ధమ్రా (ఒడిశా), కాకినాడ (ఆంధ్రప్రదేశ్), కోల్‌కతా, కాండ్లా (గుజరాత్), కృష్ణపట్నం(ఆంధ్రప్రదేశ్) ఉన్నాయి. కాగా ఇతర ఓడరేవులు కట్టుపల్లి (తమిళనాడు), కరీంగంజ్ (అస్సోం), కామరాజర్ (తమిళనాడు), కొల్లం (కేరళ), మాండ్వీ (గుజరాత్), మోర్మగోవా హార్బర్ (గోవా), ముంద్రా (గుజరాత్), ముంబయ్, న్యూ మంగళూరు, నాగపట్టిణం(తమిళనాడు), న్హవ షేవ (మహారాష్ట్ర), పారాదీప్ (ఒడిశా), పోర్‌బందర్ (పోర్ట్ బ్లయిర్, సిల్ఘాట్ ( అసోం), ట్యుటికోరన్ (తమిళనాడు), విశాఖపట్నం, వల్లర్‌పాదం, విజింఘం (రెండూ కేరళ రాష్ట్రం) ధుబ్రి, పండు (ఈ రెండూ అసోం రాష్ట్రం) వద్ద ఈ కేంద్రాలు నియమించినట్లు గెజిట్ నోటిఫికేషన్ తెలిపింది. ల్యాండ్ పోర్టులు అట్టారీ రోడ్, డేరాబాబా నానక్ (రెండూ పంజాబ్), బన్‌బసా (ఉత్తర్‌ఖాండ్), చంగ్రబంధ, ఘోజదంగ, హరిదాస్‌పూర్, హిలి, జైగాం,లాల్‌గొలఘా, మహదిపూర్, ఫుల్బరీ, రాధికాపూర్, రాణిగంజ్, గెడె (అన్నీ పశ్చిమబెంగాల్), దాలు, దవకి (రెండూ మేఘాలయ), దర్రంగా, కరీంగంజ్, మన్‌కచర్, సుతార్‌కండి (అన్నీ అసోం) వద్ద ఏర్పాటయ్యాయి. ఇతర ల్యాండ్ పోర్టులు అగర్తలా, ధలైతఘాట్, కోవల్, మురిఘాట్, రాగ్నా, ఖైలాషహర్, సాబ్రూమ్, శ్రీమంతాపూర్,(అన్నీ త్రిపుర), గౌరీ ఫాంటా, రుపైదిహ, సోనౌలి ( అన్నీ ఉత్తర్‌ప్రదేశ్), జోగ్‌బని, రాక్సౌల్ (రెండూ బిహార్), మోరెహ్ (మణిపూర్), సాబ్‌రూం (దక్షిణ త్రిపుర), కావ్రపుయిచ్చుహ, జొరిన్‌పుయి, జోఖావ్‌తార్ (అన్నీ మిజోరాం) వద్ద ఇమ్మిగ్రేషన్ పోస్టులను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తించింది..రైల్వే పోర్టులు మునాబావ్ (రాజస్థాన్), అట్టారీ (పంజాబ్), గెడె రైల్ మరియు రోడ్ చెక్‌పోస్ట్, పెట్రపోల్/ చిత్‌పూర్, హరిదాస్‌పూర్, న్యూ జల్‌పాయ్‌గురి రైల్వే స్టేషన్ (అన్నీ పశ్చిమబెంగాల్)వద్ద ఇమ్మిగ్రేషన్ కేంద్రాలు గుర్తించబడ్డాయి.

## బిజెపి రాష్ట్రాల్లో గిరిజనులకు రక్షణ ఏదీ?

### సిపిఐ సూటి ప్రశ్న...
### చత్తీస్‌గఢ్‌లో గిరిజన బాలికలపై దాడికి ఖండన



**న్యూఢిల్లీ:** బిజెపి పాలిత రాష్ట్రాల్లో గిరిజనులకు, మైనారిటీలకు భద్రత కరవు అయిందని సిపిఐ విమర్శించింది. మత దాడులను తీవ్రంగా ఖండించింది. ఇటీవల ఇద్దరు నన్స్‌తో కలిసి వెళుతున్న ముగ్గురు గిరిజన బాలికలపై జరిగిన దాడి వ్యవహారంలో తక్షణమే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలని బుధవారం ఒక ప్రకటనలో సిపిఐ డిమాండ్ చేసింది. చత్తీస్‌గఢ్‌లో గురువారం భారీ ధర్నా, నారాయణ్‌పూర్ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చింది. బాలికలపై దాడి చేసిన నిందితులపై ఎఫ్‌ఐఆర్ నమోదు, న్యాయానికి రక్షణ కోసం డి మాండ్ చేస్తూ గవర్నర్ రమణ్ డేకాకు వినతిపత్రం అందజేయనుంది. నిరసనలో సిపిఐ ఎంపి పి.సంతోశ్ కుమార్ పాల్గొంటారని ప్రకటన పేర్కొంది. ఈఆందోళన ఆదివాసీలు, స్వాతంత్ర్యం, న్యాయం కోసం జరిగే పోరాటమని వెల్లడించింది. సంతోశ్‌కుమార్ స్పం దిస్తూ నన్స్, గిరిజన బాలికపై దాడికి పాల్పడిన వారి పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడానికి నిరసనగా ఈ ఆందోళన కార్యక్రమాన్ని సిపిఐ చేపడుతోందన్నారు. చత్తీస్‌గఢ్‌లో మైనారిటీలు, గిరిజనులపై మత హింస ఆగడం లేదని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ గూండాలపై ఇప్పటివరకు ఒక్క ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోగా, బాధితుల ను బెదిరింపులకు, అవమానాలకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. వారి బాధను అర్థం చేసుకోవడం మానేది మతం గురించి చత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు ప్రశ్నించడం ఆక్షేపణీయమని సంతోశ్ కుమార్ అన్నారు. సంఘ్ పరివార్ సంఘాలతో అనుబంధం, యంత్రాంగంలో మత వివక్ష పాతుకోవడాని కి ఈపరిస్థితి అద్దం పట్టిందని ఎంపి వ్యాఖ్యానించారు. మత మార్పిడి కోసం బాలికలను తీసుకెళుతున్నట్లు సంఘ్ పరివార్ సంఘాలు ఆరోపించడంతో ఇద్దరు నన్స్ అరెస్టుకు గురయ్యారని గుర్తుచేశారు. అలాంటిదేమీ లేదని బాలికలు చెప్పినా వినకుండా వారిని నిర్బంధించారు. తర్వాత విడుదల చేశారని సంతోశ్ కుమార్ తెలిపారు. ఆర్ఎస్ఎస్, బిజెపి, విహెచ్‌పి, బజరంగ్‌దళ్ ఐక్యంగా చత్తీస్‌గఢ్‌ను విద్వేషానికి ప్రయోగశాలగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేయడానికి సిపిఐ కట్టుబడి ఉందన్నారు. ప్రజలతో కలిసి పోరాడటం ద్వారా ఇలాంటి ప్రతి ఒక్క చర్యను ప్రతిఘటించేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. బెదిరింపులకు తలొగ్గబోమన్న స్పష్టమైన సందేశాన్ని సిపిఐ ఇస్తోందని సంతోశ్‌కుమార్ అన్నారు. మతం పేరితో వేధిస్తే సహించం. గూండాయిజాన్ని కొనసాగనివ్వం. న్యాయం, సమానత్వం, గిరిజనుల హక్కులు, గౌర వం, లౌకికవాదం పరిరక్షణ కోసం రాజీలేని పోరాటా లు కొనసాగిస్తామని సిపిఐ ఉద్ఘాటిస్తోందని సంతోశ్ కుమార్ వెల్లడించారు.

# మరాఠాలకు రిజర్వేషన్లు

### మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత జరంగే వెల్లడి



**ఛత్రపతి సంభాజీనగర్ :** మరత్వాడా, పశ్చిమ మరత్వాడాలోని మరాఠా సామాజిక వర్గానికి ఇప్పుడు రిజర్వేషన్లు లభిస్తాయని మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత జరంగే పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయంపై ఒబిసి నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మహారాష్ట్ర మంత్రి, వెనుకబడిన తరగతుల (ఒబిసి)కు చెందిన ప్రముఖ నాయకుడు ఛగన్ భుజ్‌బాల్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరయ్యారు. తాము విజయం సాధించామని, ఈ ఘనత మరాఠా సామాజికవర్గానికి చెందుతుందని బుధవారం ఛత్రపతి సంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జరంగే తెలిపారు. మద్దతుదారులు ప్రశాంతంగా ఉండాలని, తన నిర్ణయంపై నమ్మకం ఉంచాలని విజ్ఞప్తి చేశారు. నిరాహార దీక్ష ముగించిన తర్వాత ముంబయి నుండి తిరిగి వచ్చిన 43 ఏళ్ల కార్యకర్త, డీహైడ్రేషన్, తక్కువ బ్లడ్ షుగర్ కారణంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సంరక్షణ పొందుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తమకు అనుకూలంగా ఒక్క వాక్యం కూడా రాయలేదని, 'జోకర్ తరహా' వ్యక్తులను ప్రజలు నమ్మకూడదన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు మరాఠా సమాజానికి ఏమీ చేయలేదని జరంగే అన్నారు. అయితే, ముంబయిలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగిందని పేర్కొంటూ... జరంగే ఐదు రోజుల ఆందోళనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లలో చేసిన ఆరోపణలపై మరాఠా కోటా ఉద్యమనేత నుండి బాంబే హైకోర్టు స్పందన కోరింది. జరంగే తన నిరాహార దీక్షను ముగించిన తర్వాత దక్షిణ ముంబయిలోని రోడ్లపై, ఆజాద్ మైదాన్‌లో మిగిలిపోయిన చెత్త కుప్పలు, ఆహార పదార్థాలు, మినరల్ వాటర్ బాటిళ్లను తొలగించడానికి పౌర సిబ్బంది రాత్రంతా పనిచేశారు. ఐదు రోజుల పాటు జరిగిన మరాఠా కోటా ఆందోళన సందర్భంగా ఆజాద్ మైదాన్, పరిసర ప్రాంతాల నుండి 125 మెట్రిక్ టన్నులకు పైగా చెత్తను తొలగించినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. మరాఠా సమాజ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఒక పరిష్కారాన్ని కనుగొన్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం తెలిపారు. జరంగే తన డిమాండ్లలో ఎక్కువ భాగాన్ని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత నిరసనను విరమించుకున్నారు. అందులో అర్హత కలిగిన మరాఠాలకు కున్బి కుల ధృవీకరణ పత్రాలను మంజూరు చేయడం ద్వారా వారికి బిసిల రిజర్వేషన్ ప్రయోజనాలకు అర్హులుగా చేస్తుంది. తమ సంఘం సభ్యులు చివరికి ఆందోళనను విరమించాలనే తన నిర్ణయాన్ని అర్థం చేసుకుంటారని జరంగే అన్నారు. మరాత్వాడ ప్రాంతంలోని ఏ మరాఠా కూడా కోటా నుండి నిష్క్రమించబోరన్నారు. మరాఠాలు తమ కున్బి వంశాన్ని స్థాపించడంలో సహాయపడటానికి గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, ఒబిసి కార్యకర్త లక్ష్మణ్ హాకే, మరాఠాలకు కున్బి కుల ధృవీకరణ పత్రాలు అందించాలనే డిమాండ్‌ను అంగీకరించే హక్కు ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇతర వెనుకబడిన తరగతులు వీధుల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఇతర వెనుకబడిన తరగతుల కోటా రద్దుకు సిద్ధంగా ఉంటే రాజకీయ నాయకులు వివరించాలని ఆయన అన్నారు.

## రూ.200కోట్లు స్వాహా.. ఎఎఐ అధికారి అరెస్ట్

**ముంబై:** ప్రభుత్వ రంగ సంస్థ నిధులను తారుమారు చేసిన కేసులో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) సీనియర్ మేనేజర్ రాహుల్ విజయ్‌ను అరెస్ట్ చేసినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. రూ.232 కోట్లకు పైగా ప్రభుత్వ రంగ సంస్థ నిధులను తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించారనే ఆరోపణలపై ఆయనపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. డెహ్రాడూన్ విమానాశ్రయంలో తన పోస్టింగ్ సమయంలో మూడు సంవత్సరాలలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పనిచేసే రాహుల్ విజయ్ ఈ అక్రమాలకు పాల్పడ్డారు. బూటకపు అకౌంటింగ్ ఎంట్రీల ద్వారా సంస్థ సొమ్ములు తన వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేశారని అధికారులు తెలిపారు. అధికారిక, ఎలక్ట్రానిక్ రికార్డులను తారుమారు చేయడం ద్వారా విజయ్ ఈ మోసానికి పాల్పడ్డారు. ఒక క్రమ పద్ధతిలో, ప్లాన్ ప్రకారం ఎఎఐ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. 'దర్యాప్తు సమయంలో, 201920 నుండి 2022–23 మధ్య కాలంలో, నిందితుడు డెహ్రాడూన్ విమానాశ్రయంలో విధులు నిర్వర్తిస్తుండగా ఈ మోసాలకు పాల్పడినట్లు తేల్చారు. నకిలీ, కల్పిత ఆస్తులను సష్టించడంతో పాటూ ఎంట్రీలకు సున్నాలను జోడించడం ద్వారా ఎలక్ట్రానిక్ రికార్డులను తారుమారు చేసినట్లు తేలింది' అని ఆమె చెప్పారు. బ్యాంకు లావాదేవీల ప్రాథమిక విశ్లేషణలో తేలిన విషయం ఏంటంటే.. విజయ్ అలా జమ చేసిన నిధులను ట్రేడింగ్ ఖాతాలకు బదిలీ చేశారని, తద్వారా ప్రజా ధనాన్ని స్వాహా చేశారని సిబిఐ కనుగొంది.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UC 1427 | Vallepu Ramesh | Mahindra 265 DI | 2017 |
| 2 | TS03UB 9298 | Suresh Podeti | Maruthi Szire Tour Diesel-P | 2017 |
| 3 | AP16TY 8555 | Rajesh Thothurla | Tata LPT 3118 Cummins FBT | 2011 |
| 4 | AP09CU 4698 | Karim Mohammed | Sunny XL D Diesel 5 Seater | 2013 |
| 5 | TS03UC 4321 | Raju Thoutam | Ape Pick UP Xtra LD SHRIRAM AUTOMALL INDIA LTD, MANCHERIAL | 2018 |

AUCTION DATE:06-09-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9666726222, 9573787776

# భారత్ విదేశాంగ విధానంలో మార్పు వస్తుందా?

భారత్ సాంప్రదాయక అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలిచ్చి 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' అంటూ అమెరికా వైపు పూర్తిగా మొగ్గిన ప్రధాని నరేంద్రమోదీ తాజాగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) అగ్రనాయక సమావేశంలో తీసుకున్న వైఖరులు భారత విదేశాంగ విధానంలో మార్పును సూచిస్తోందని కొందరు పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. చైనాను బూచిగా చూస్తూ (కమ్యూనిజం పట్ల ద్వేషంతో) అమెరికాతో మోదీ బ్రహ్మముడిని చూచి మురిసిపోతున్న బిజెపి నాయకులకు ఇప్పుడు నోరు పెగలటం లేదు. "హౌడీ మోదీ" అని అమెరికాలో, 'నమస్తే ట్రంప్' అని అహ్మదాబాద్‌లో పరస్పర భజనలో మునిగితేలిన వారు వాస్తవ ప్రపంచంలోకి రావటం కష్టమైనా తప్పనిసరి అవసరమైంది. అందుకు అధ్యక్షుడు ట్రంప్ మొండితనం, మూర్ఖత్వం కారణం.

20 సంవత్సరాలుగా దౌత్య కృషి ద్వారా భారత్‌ను అమెరికాకు సన్నిహితంగా తీసుకువస్తే ఆ శ్రమనంతా ట్రంప్ నేలపాలు చేశాడని అమెరికాలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారత్‌ను బెదిరించి లొంగదీసుకునేందుకై పాకిస్థాన్‌ను చేరదీయటం, భారత్‌పై 50శాతం దిగుమతి సుంకాలు విధించటం ట్రంప్ చేసిన పెద్ద తప్పు. భారతదేశ ఆత్మగౌరవాన్ని నిలపటమా లేక అమెరికాకు మోకరిల్లటమా అన్న సమస్య ఎదురైనప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ 'ప్రియమైన మిత్రుడు' ట్రంప్‌ను ధిక్కరించక తప్పలేదు. ఇంతలోనే అరుదెంచిన ఎస్‌సిఒ శిఖరాగ్ర సభకై చైనా వెళ్లటం, చైనా, రష్యాలతో మైత్రి, వాణిజ్య సంబంధాల పటిష్టతకు బాటలు వేయటం జరిగింది. 2002లో గాల్వాన్ ఘటనల నాటినుంచి చైనాతో చెదిరిన సంబంధాల సాధారణీకరణ, ప్రజల మధ్య సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చించి, అంగీకారాలకు రావటం గమనార్హమైన మార్పు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల్లో ఇరుదేశాల మధ్య చిరకాలంగా ఉన్న లోతైన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని నిర్ణయించారు. దీంతో రష్యా, ఇండియా, చైనా(ఆర్ఐసి) త్రికోణం పునరుద్ధరణకు బీజం పడింది. ముగ్గురు నేతలూ "బహుళపక్ష వ్యవస్థలు, సార్వభౌమత్వం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' గూర్చి మాట్లాడారు. ఈ మూడు పెద్ద దేశాల కూటమి 1990వ దశకంలో ఏర్పడినా అపోహలు, అపనమ్మకాలతో పనిచేయలేదు. ఎస్‌సిఒ సాధారణ కూటమి కాదు. ప్రపంచ జనాభాలో 40శాతం ఇందులో ఉన్నారు. ప్రపంచ జిడిపిలో నాల్గవవంతుకుపైన ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఇరాన్, సౌదీఅరేబియా కూడా చేరటంతో యూరోఆసియాపై దీని ప్రభావం ఉంటుంది. భద్రత విషయానికొస్తే చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్ లు అణ్వస్త్ర దేశాలు. ఒకవైపు బ్రిక్స్, మరోవైపు ఎస్‌సిఒ ప్రపంచ ఆర్థిక వ్యవస్థల గమనాన్ని మలుపు తిప్పగల సామర్థ్యం గలవి. ట్రంప్ చింత కూడా అదే. ఈ దేశాలు సొంత కరెన్సీల్లో వాణిజ్యం మొదలుపెడితే డాలర్ ఆధిపత్యం కుప్పకూలుతుంది.

**ప్రజాపక్షం**
**04-09-2025, గురువారం**

ఈ నేపథ్యంలో ఎస్‌సిఒ డిక్లరేషన్‌ను సూక్ష్మంగా చూదాం. "ప్రపంచం గాఢమైన చారిత్రక మార్పులకు గురవుతున్నది. అవి రాజకీయ, సామాజిక–ఆర్థిక, సాంఘిక సంబంధాల్లోని అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్నవి" అని ప్రారంభమైంది. గాజాలో కొనసాగుతున్న యుద్ధాన్ని, గాజా స్ట్రిప్‌ను ఆవహించిన వినాశకరమైన మానవ విషాదాన్ని పరిగణనలోకి తీసుకుం టూ, సభ్యదేశాలన్నీ అందుకు దారితీసిన పరిస్థితులను తీవ్రంగా ఖండించాయి.


పాలస్తీనా సమస్యకు సమగ్రమైన, న్యాయమైన పరిష్కారమే పశ్చిమాసియాలో శాంతి కి ఏకైక మార్గం అని డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఇరాన్ అణు వసతులపై ఇజ్రాయిల్, అమెరికా సైనిక దాడులను ఇతర సభ్యదేశాలతోపాటు భారత్ కూడా తీవ్రంగా ఖండించింది. ఇరాన్‌పై ఆంక్షల ఎత్తివేతను కోరుతున్న భద్రతామండలి తీర్మానం 2231 ప్రాముఖ్యతను పునరుద్ఘాటించింది.

ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, సుస్థిరత నిమిత్తం సమాజంలోని అన్ని జాతి–రాజకీయ గ్రూపుల ప్రాతినిధ్యంతో విశాల ప్రభుత్వం ఏర్పాటు అవసరాన్ని వక్కాణించింది. చైనా బెల్టు–రోడ్ చొరవను భారత్ మినహా ఇతర సభ్యులు బలపరిచారు. ఈ గ్రూపు సాధ్యమైనంత త్వరలో ఎస్‌సిఒ అభివృద్ధి బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని జిన్‌పింగ్ కోరారు.

జాత్యహంకారం, విదేశీయుల పట్ల ద్వేషం, వారిపట్ల అసహనం ప్రస్తుత రూపాలను విస్తరిస్తున్న నాజీయి జం, నయానాజీయిజం, ఇతర పద్ధతులను కొనియాడటాన్ని తిప్పికొట్టాలన్న ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానా న్ని డిక్లరేషన్ స్వాగతించింది.

అదలావుంచితే, ప్రధాని మోదీ పరిస్థితుల ఒత్తిడివల్ల చైనా, రష్యాలతో సంబంధాలపై తాజా వైఖరి తీసుకున్నారని, ట్రంప్ గనుక సుంకాలు తగ్గిస్తే విదేశాంగ విధానాన్ని మళ్లీ అటు మళ్లిస్తారని సందేహాలు వ్యక్తం చేసేవారు లేకపోలేదు.

అమెరికాతో స్నేహ–సహకారా న్ని తెగతెంపులు చేసుకోవాలని భారతీయులెవరూ కోరుకోరు. భారత్ పేద దేశాల వాణిగా వ్యవహరించాలని మాత్రమే కోరుకుంటారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవటం పాలకులపై ఉంటుంది.




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
**25వ కాంగ్రెస్**
**21-25 సెప్టెంబర్, 1925**
చండీఘడ్ (పంజాబ్)

## సిపిఐ ప్రధాన కార్యదర్శులు

### ఎస్.ఎస్.మిరాజ్‌కార్
**బొంబాయి కమ్యూనిస్టు మేయర్**



శాంతారాం శావ్‌లారాం మిరాజ్‌కర్ మహారాష్ట్రలో 1899 ఫిబ్రవరి 8న జన్మించారు. మెట్రిక్ చదువుకున్నారు. బొంబాయిలో ఫ్యాక్టరీ కార్మికునిగా పనిచేశారు. ఎఐటియుసి, డబ్ల్యుపిపిలో పనిచేశారు. క్రాంతి (మరాఠీ) పత్రిక ఎడిటర్‌గా పనిచేశారు. సైమన్ కమిషన్ బహిష్కరణ ఆందోళనకు నాయకత్వం వహించారు. మీరట్ కుట్రకేసులో అరెస్టు అయినారు, శిక్ష విధించబడింది. 1933లో మీరట్ ఖైదీల విడుదల తదుపరి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అధికారి అరెస్టు తదుపరి మిరాజ్‌కర్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 1934లో యంగ్ వర్కర్స్ లీగ్ ఏర్పాటు చేశారు. కొమింటర్న్ 7వ ప్రపంచ మహాసభలో పాల్గొనేందుకు మాస్కో వెళుతుండగా, సింగపూర్‌లో అరెస్టు చేశారు. 1940లో అరెస్టు చేసి దియోలీ క్యాంపులో నిర్బంధించారు. సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో ప్రముఖ నాయకుల్లో ఆయన ఒకరు. గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొన్నారు. 1958లో బొంబాయి మేయర్‌గా ఎన్నికైనారు. 1957 నుంచి 1973 వర కు ఎఐటియుసి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980 ఫిబ్రవరి 15న మృతి చెందారు.


### సోమనాధ్ లాహిరి
**రాజ్యాంగ రచన సభలో సిపిఐ సభ్యుడు**



మీరట్ కుట్ర కేసులో ఖైదీల విడుదల తదుపరి, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎస్ఎస్ మిరాజ్‌కార్ అరెస్టు తదుపరి సోమనాథ్ లాహిరి కొద్దికాలం సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1909 సెప్టెంబర్ 1న బెంగాల్‌లో జన్మించారు. 1946లో కార్మికుల నియోజకవర్గం నుంచి ఎన్నుకోబడి, రాజ్యాంగ రచన సభలో కమ్యూనిస్టు సభ్యునిగా ప్రసిద్ధి పొందారు. ప్రెసిడెన్సీ కాలేజి, కలకత్తా నుంచి బిఎస్‌సి(హానర్స్) ఉత్తీర్ణత సాధించారు. భూపేంద్ర నాథ్ దత్తా వంటి విప్లవకారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. మార్క్సిస్టు అయినారు. 1931లో కరాచీ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. ఎఐఎస్ఎఫ్‌లో, ట్రేడ్ యూనియన్‌లలో పనిచేశారు. 1930వ దశకంలో కమ్యూనిస్టుల 'కలకత్తా కమిటీ'లో భాగస్వామి అయినారు. 1936 లో ఎఐసిసి సభ్యునిగా ఎన్నికైనారు. 'స్వాధీనత' బెంగాలీ పత్రికకు సంపాదకునిగా పనిచేశారు. బిటిఆర్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలం లో సోమనాథ్ చటర్జీ పోలిట్ బ్యూరోలో ఉన్నారు. 1957లో తొలిసారి బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికైన సోమనాథ్ 1977 వరకు కొనసాగారు. 1967, 1969లో రాష్ట్ర మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. 1984 అక్టోబర్ 19న మరణించారు.

### కాన్పూర్ మహాసభ కన్వీనర్ సత్యభక్త

సత్యభక్త విప్లవకారుడు, కమ్యూనిస్టు, విప్లవ సాహిత్య ప్రచురణ కర్త. 1925లో కాన్పూర్‌లో జరిగిన తొలి కమ్యూనిస్టు (వ్యవస్థాపక) మహాసభ కన్వీనర్. అతడు వివాదాస్పదుడు కూడా. ఉత్తరోత్తరా ఉద్యమం నుండి వైదొలిగారు. అయితే చరిత్రలో అతని ప్రాముఖ్యత ఏ విధంగానూ తగ్గించదగింది కాదు. సిపిఐ వ్యవస్థాపనకు చొరవ తీసుకున్న ఖ్యాతి ఆయనకు దక్కుతుంది.



సత్యభక్త అసలు పేరు చకాన్ లాల్. 1897 ఏప్రిల్ 2న రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జన్మించారు. అతడు విప్లవ పత్రికలు చదువుతూ పెరిగారు. దళిత స్త్రీని వివాహమాడారు. గణేశ్ శంకర్ విద్యార్థి నడిపే 'ప్రతాప్' పత్రిక ప్రభావం కిందకు వచ్చారు. 1912లో పిన్న వయస్సులోనే రహస్య విప్లవోద్యమంలో చేరారు. 1916లో హరిద్వార్ కుంభమేళాలో భారత్ సేవక్ సమాజ్ వాలంటీరుగా పనిచేశారు. గాంధీజీని కలుసుకున్నారు. అహింసా సిద్ధాంతంతో పూర్తిగా ఏకీభవించలేదు. 1918–1920లో సబర్మతి ఆశ్రమంలో ఉన్న సత్యభక్త కాంగ్రెస్ బొంబాయి సభకు హాజరైనారు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. రాజస్థాన్ సేవా సంఘ్‌లో పనిచేస్తుండగా కమ్యూనిస్టు భావాలతో సంబంధం ఏర్పడింది. సాహిత్యం చదవసాగాడు. రష్యన్ విప్లవం ఆకర్షించింది.

కమ్యూనిస్టుల అఖిల భారత మహాసభను పిలవటం గూర్చి ఆలోచించారు. బొంబాయి కమ్యూనిస్టు గ్రూపు కూడా అటువంటి ఆలోచనలో ఉంది. సత్యభక్త 1924 జులై 12న హిందీ దినపత్రిక 'ఆజ్‌'లో 'ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ'ని ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రకటించారు. పార్టీలో చేరాల్సిందిగా ఉద్యోగులు, రైతులు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. 'భారతీయ సామ్యవాది దళ్' కార్యదర్శిగా ఆ లేఖపై సంతకం చేశారు. ఇంగ్లీషు పత్రిక 'ఇండియన్ వరల్డ్'లో కూడా ఆయన ప్రకటన ప్రచురితమైంది.

ఇండియన్ కమ్యూనిస్టుపార్టీ 'భవిష్యత్ కార్యక్రమం' శీర్షికతో (1925 జూన్ 18) సత్యభక్త విడుదల చేసిన కరపత్రంలో, 1925 చివర్లో కాన్పూర్‌లో కాంగ్రెస్ సభలు జరిగే సమయంలో భారత కమ్యూనిస్టుల మహాసభ జరుగుతుందని తొలిసారి ప్రస్తావించటం జరిగింది.

సత్యభక్త చొరవకు బొంబాయి, బెంగాల్ గ్రూపులనుండేగాక పంజాబ్, మద్రాసు గ్రూపులనుండి కూడా సానుకూల స్పందన వచ్చింది. కాన్పూర్ మహాసభలో సత్యభక్త 'ఇండియన్ కమ్యూనిస్టుపార్టీ' రద్దు చేయబడింది. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) లాంఛనంగా ఏర్పడింది. మహాసభలో ఏర్పాటైన కేంద్ర కార్యవర్గ కమిటీకి సత్యభక్త ఎన్నికైనారు. అయితే త్వరలోనే పార్టీ అంతర్జాతీయతపై విభేదాలలో ఆయన సిఇసి నుంచి రాజీనామా చేశారు. ఆ తర్వాత పార్టీ నుంచి వైదొలిగారు. సానుభూతిపరుడైన జాతీయవాదిగా కొనసాగారు. 1985 డిసెంబర్ 3న 90 ఏళ్ల వయస్సులో అనాథలాగా ఆశ్రమంలో మరణించారు.

# భాగవత్ బలహీనతను ఎత్తిచూపిన ప్రకటన

**అరుణ్ శ్రీవాస్తవ**






ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భాగవత్ మార్చినంత వేగంగా రంగులు మార్చడంలో ఊసరవెల్లి కూడా పోటీ పడలేదు. గతంలో కూడా ఆయన ఈ నైపుణ్యాన్ని నిస్సిగ్గుగా ప్రదర్శించారు. ఈ గుణం భాగవత్‌కు వారసత్వంగా లభించింది. అందులో అత్యంత అసాధారణమైన ఘటన – ఈ నెలలో 75 సంవత్సరాలు పూర్తయిన వెంటనే నరేంద్ర మోదీని ప్రధాని పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా తాను ఎన్నడూ సూచించలేదనే ప్రకటన తాజాగా చోటు చేసుకుంది. ఈ ఏడాది జూలైలో ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో, ఆగస్టు 27న 'వందేళ్ళ సంఘ్ ప్రయాణం – నూతన దృక్కోణాలు' అనే మూడు రోజుల ప్రసంగాల పరంపరంలో భాగంగా స్వయంగా తాను చేసిన ప్రకటలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు.

2025 జూలై 9న భాగవత్ మాట్లాడుతూ "నీకు 75 ఏళ్ళు నిండగానే, నీవు ఆగిపోవాలని అర్థం చేసుకోవాలి. నీ స్థానాన్ని ఇతరుల కోసం వదిలేయాలి" అని అన్నారు. కానీ, 2025 ఆగస్టు 28న మాత్రం భాగవత్ తన ప్రకటన నుంచి వెనక్కి మళ్ళారు. తాను రిటైర్ ఆవుతాననో లేదా మరొకరు రిటైర్ అవుతారనో తానెన్నడూ అనలేదని, సంఘ్‌లో తమకు ఇష్టం ఉన్నా లేకున్నా ఒక బాధ్యత అప్పజెబుతారని ఆయన అన్నారు. జూలై ప్రకటన నుంచి వెనక్కు తగ్గాల్సిన కారణం ఏమిటి. ఆయన ఎవరికి భయపడుతున్నారు? ఆయన వెనుదిరగడానికి స్పష్టమైన కారణం ఏమిటంటే ఆయనకు పూర్తిగా నైతిక నిబద్ధతత, మోదీకి వ్యతిరేకంగా నిలబడి, పోరాడే ధైర్యం లేకపోవడమేని అర్థమవుతుంది.

జూలై 9న ఆయన ఏమి అన్నారో తెలుసుకోవడం తప్పనిసరి –"75 ఏళ్ల నిబంధన" ఎంపిక చేసిన కొందరిని పక్కకు తప్పించేందుకు మాత్రమే అమలవుతుంది. కానీ, పై స్థాయిలో వారికి అమలు కాదు" అని అన్నారు. కానీ, ఆగస్టు 28న "ఎవరైనా మీకు 75 ఏళ్ళ సందర్భంగా శాలువా కప్పితే, వారు పదవీ విరమణ గురించి ఆలోచించాలని మోరోపంత్‌జీ(సీనియర్ సంఘ్ నాయకుడు మోరేశ్వర్ నికాంత్ పింగ్లే / మోరోపంత్) చమత్కారంగా చెప్పిన మాటలనే తాను ఉటంకించాన"ని ఆయన అన్నారు.

ఆ రోజున ఆయన ఏమన్నారంటే "నేను రిటైర్ అవుతానని లేదా వేరొకరు రిటైర్‌కావాలని కానీ నేను ఎన్నడూ అనలేదు. సంఘ్‌లో మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ఒక బాధ్యత అప్పజెబుతారు. నాకు 80 సంవత్సరాలు ఉన్నా, నన్ను వెళ్ళి 'శాఖ'ను నడపాలంటే నేను ఆ పని చేయాల్సిందే. సంఘ్ ఏ పని చేబితే మనం ఆ పని చేయాల్సిందే.. ఇది అందరి రిటైర్‌మెంట్ గురించి కాదు. సంఘ్ కోరినంత వరకు తాము రిటైర్ అవడానికైనా లేదా పని చేసేందుకైనా సిద్ధమే" అని భాగవత్ అన్నారు. ఇది ద్వంద్వ నాలుక ధోరణి కాదు, ఆయన పలాయన ధోరణిని ఇది సూచిస్తుంది.

కొంతమంది తమను 'దేవుడు పంపాడని' నమ్ముతారని, 'దేవుడు కావాలనిసైతం అనుకుంటారని' భాగవత్ జూలై 9న చెప్పిన మాటలను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఒకటి మాత్రం స్పష్టం. ఆయన జూలై 9న చేసిన ప్రకటన స్వచ్ఛందంగానే తప్ప ఎలాంటి ఒత్తిడి మధ్య కాదు. కానీ, భయంతో ఆ ప్రకటన నుంచి బలవంతంగా వెనక్కి తగ్గాల్సి వచ్చింది. జూలై 9న ఆయన మోదీని హెచ్చరించాలని కోరుకున్నాడు. కానీ తాజాగా పూర్తి విరుద్ధంగా మాట్లాడడం ద్వారా లక్ష్మణ రేఖ దాటవద్దని ఆయనకు చెప్పినట్లు స్పష్టమైన సందేశం వచ్చింది.

ఆయన అంత బలహీనమైన వ్యక్తి అని, బెదిరింపులకు ఎదురు నిలవలేడని, సవాళ్ళను తిప్పికొట్టలేడని, తన అధికారాన్ని బలపరుచుకోరని ఎవరూ ఊహించలేదు. ఆయన వెనక్కి తగ్గడానికి మరో కారణమేమిటంటే, మోదీ అందించే భౌతిక ప్రయోజనాలు, విలాసాలను వదులుకునే ఉద్దేశ్యం లేదు. "ఆర్‌ఎస్‌ఎస్ అడిగినంత కాలం నేను కొనసాగుతాను"అని ప్రేక్షకులకు స్పష్టమైన పదాలలో తెలియజేశారు.

తీసిపారేసినట్లుగా ఆయన వెనుదిరగడం ఆత్మహత్యా సదృశ్యమే. ఇది మరింత ప్రమాదకరమైన ప్రభావాలకు దారి తీసే పరిస్థితులు బహిరంగంగానే కనిపడుతున్నాయి. ఆయన తిరోగమనం కాషాయ వ్యవస్థ మరింత నిర్దయగా హిందూత్వ ఎజెండాను పునరుద్ధరిస్తుందనే బలమైన సందేశం ఇచ్చింది. ఈ ఎజెండా తన ప్రత్యక్ష పర్యవేక్షణలో అమలు జరగాలని భాగవత్ కోరుకుంటున్నారు.

దేశం, ప్రజలు మరింత తీవ్రమైన మతతత్వ అవాంతరాలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి. ఆయన జూలై ప్రసంగం మోదీ పని చేయాలనే హెచ్చరికతో కూడిన అర్థం కనిపిస్తుంది. భాగవత్ ప్రసంగాలను విశ్లేషిస్తే ఆయన ఎన్నడూ నిజం మాట్లాడడనేది స్పష్టం. ఆయన చెప్పేది ఒకటి, చేసేది అందుకు పూర్తిగా విరుద్ధమైనదని గతంలో నిరూపితమైంది.

ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్‌ను ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియను సరి చేయాలని, దళితులు, కార్మికులు, మైనారిటీల ఓట్లు పోకుండా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ)తో ఇండియా కూటమి, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా తలపడుతున్నాయి. తాజా పరిణామాలు, ఇసిఐ తిరస్కార ధోరణి చూస్తుంటే ప్రతిపక్షాల డిమాండ్ నెరవేరేలా లేదు. ఆర్‌ఎస్‌ఎస్ మిషన్‌ను సంపూర్ణం చేసేందుకు అన్ని రకాల త్యాగాలకు ఇసిఐ, సిఇసి జ్ఞానేశ్ కుమార్ సిద్ధంగా ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికలు, కుట్రలను బైటపెట్టడం నిజంగా కష్టమైన పనే. గతంలో ప్రకటించిన రిటైర్‌మెంట్ వైఖరిని భాగవత్ వదులుకున్న సమయాన్ని ప్రతి ఒక్కరూ పరిశీలనగా చూడాలి. ప్రతిపక్షాలు మరింత ఐక్యమవుతున్న సమయంలో, ఎస్ఐఆర్ అమలు ఆటంకాలు ఎదుర్కొంటున్న తరుణంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇది ప్రతిపక్షాల, ప్రజల దృష్టి మళ్ళించేందుకు ఉద్దేశించిన ఎత్తుగడ మాత్రమే. నెమ్మదిగా ఎస్ఐఆర్ జాతీయ అంశం స్వభావాన్ని సంతరించుకుంటున్నప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల మధ్య సంబంధాలు దెబ్బతినడం భాగవత్‌కు ఇష్టం లేదు.

మోదీ, భాగవత్‌లు ఇద్దరూ అకస్మాత్తుగా దేశం ఎదుర్కొంటున్న జనాభాపరమైన అసమతుల్యత గురించి భయపడడం గమనార్హం. మతమార్పిడి, అక్రమ వలసలు జనాభాపరమైన అసమతుల్యతకు ప్రధాన కారణాలని, మనం అక్రమ వలసదారులకు ఉద్యోగాలు ఇవ్వొద్దని, ముస్లింలు సహా మన స్వంత ప్రజలకే ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన అన్నారు. 'మన స్వంత ప్రజలకే మనం ఉద్యోగాలు ఇవ్వాలి' అనడం ద్వారా ఆయన రాజకీయ జిమ్మిక్కులు చేస్తున్నారు. ఆయన ప్రబోధాలకు క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఇప్పుడు ఉన్నంతగా నిరుద్యోగాన్ని ఎన్నడూ చూడలేదు.

ఒక పరిణామంపై తీవ్రంగా దృష్టి సారించాల్సి ఉంది. సంఘ్ ఎన్నడూ మతపరమైన కారణాలతో ఇతరత్రా ఎవరిపైనా దాడులు చేయడాన్ని విశ్వసించదని, ఇస్లాం ఉండరాదని హిందూ ఆలోచన ధోరణి ఉండబోదని గత గురువారం భాగవత్ ఉద్ఘాటించారు. విశ్వాస రాహిత్యం కారణంగానే హిందువులు అభద్రతతో ఉంటారని, ఏ హిందువూ ఇస్లాం ఉండొద్దని భావించబోడని, మనమంతా మొదట ఒకే దేశం.. అని, మతపరమైన వైఖరితో సహా ఎవరిపైనైనా దాడులకు ఆర్‌ఎస్‌ఎస్ విశ్వసించదని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో రోడ్లు, ప్రాంతాలకు "దురాక్రమణదారుల" పేర్లు పెట్టొద్దని చెప్పడం మాత్రం ఆయన మరిచిపోలేదు. వాటికి ముస్లింల పేర్లు పెట్టొద్దని తాను అనడం లేదని, దురాక్రమదారుల పేర్లు మాత్రం పెట్టొదని అంటున్నట్లు చెప్పారు. హిందూ రాజ్యం అనే ఊహ ఎవరికో వ్యతిరేకంగానో లేదా ఎవరో విడిచిపెట్టి వెళ్ళిపోవాలనో ఉద్దేశించి కాదనే కీలకమైన వ్యాఖ్య చేశారాయన.

తమ స్వయం సేవకులను సంఘ్ 'రిమోట్ కంట్రోల్'తో నియంత్రించదని ఆయన అన్నారు. సంఘ్, స్వయం సేవకుల మధ్య నిరంతర సమాచార వ్యవస్థ ఉంటుందన్నారు. వారు నెమ్మదిగా స్వతంత్రంగా మారిపోతారని, వారికి సంఘ్ అవసరం ఉండదని అంటూనే వాస్తవంలో పార్టీ అధ్యక్షున్ని ఎంపిక చేయడం, మోదీ శైలి పనితీరును పెద్ద అంశంగా చేశారు.

న్యూఢిల్లీలో భాగవత్ ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల కార్యక్రమంలో అందరి దృష్టి బిజెపి సంస్థాగత మార్పులు, నియామకాలపైనే నిలిచింది. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఉనికి సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది అనడంలో నిరాకరించేది ఏమీ లేదు. కాషాయ వ్యవస్థ కొనసాగేందుకు భాగవత్, మోదీలు తమ విభేదాలను కొంత కాలం పూడ్చిపెట్టడం అనివార్యమైంది. 'వందేళ్ళ ఆర్‌ఎస్‌ఎస్ ప్రయాణం – నూతన దృక్కోణం' అనే ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనకు భాగవత్ రూపకల్పన చేస్తూ, ఈ దిశగా అడుగు వేయడం విస్తృత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ శతాద్ధి ఉత్సవాలు దగ్గరపడుతున్న తరుణంలో స్వయం సమృద్ధి, సాంస్కృతిక విలువలు, పరిపాలన, భౌగోళిక 'ధార్మిక' వ్యవస్థలో భారత పాత్రను రూపొందించడంపై ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనను ఆయన వివరించారు. గత బుధవారం జరిగిన కార్యక్రమానికి 55 దేశాల దౌత్యవేతలు హాజరయ్యారు. అలాగే 30 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

తమ మధ్య సంబంధాలు మరింత క్షీణించడం కాషాయ పరివారానికి మంచిది కాదనే అవగాహన భాగవత్‌కు ఉంది. దురదృష్టవశాత్తు మోదీ ఈ దురవస్థను తనకు అనుకూలంగా మార్చుకొని భాగవత్‌ను మరింత అంచుకు నెట్టేశారు. ఆ ఒత్తిడితోనే భాగవత్ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మధ్య మంచి సమన్వయం ఉందని పేర్కొన్నారు. "కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. కానీ, మేము చర్చించి, ఒకరి అభిప్రాయానికి అనుకూలంగానో లేదా వ్యతిరేకంగానో ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయానికి వస్తాం. తరువాత నేను సమష్టి నిర్ణయాన్ని అనుసరిస్తాను. ఆ స్వభావం ఉన్నట్లయితే, కొట్లాటలు ఉండవు. అభిప్రాయ బేధాలు ఉంటాయే తప్ప మనస్సు నొప్పించేవి ఉండబోవు. మనమంతా ఒకే దిశగా ముందుకు సాగాలే తప్ప, ఇతర మార్గాలలో కాదు" అని భాగవత్ అన్నారు.

తమకు అనుకూలమైన అధ్యక్షుడి కోసం మోదీ, భాగవత్‌లిరువురు ఏడాదిగా ఘర్షణ పడుతున్నారనేది అందరికీ తెలిసిన వాస్తవమే. కానీ, భాగవత్ తన వైఖరిని మార్చుకోవడం ద్వారా, ఆయనను మోదీ తన మార్గంలోకి తెచ్చుకోవడంలో సఫలమయ్యారు. ఎందుకంటే, పదవను ముంచేయాలని ఇప్పుడు భాగవత్ ఏమాత్రం అనుకోవడం లేదు. కొన్ని మంచి మాటల ద్వారా ముస్లింలకు ఉపశమనం కల్పించేందుకు భాగవత్ ప్రయత్నించినప్పటికీ, భవిష్యత్తు పరిణామాలపై వారికి సందేహాలు ఉన్నాయి. వారికి ఆందోళన కలిగించే విషయమేమిటంటే, భవిష్యత్తులో ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి ఆందోళనలో పాలు పంచుకోదని చెప్పకపోవటం, కాశి, మథుర ఆందోళనలో పాల్గొనే విషయంలో వారి కార్యకర్తలకు సంపూర్ణ స్వేచ్ఛను ఇస్తున్నట్లుగా భాగవత్ ప్రకటించడం. "ఇది కేవలం మూడు ప్రదేశాలకు సంబంధించిన అంశం, దానిని చేపట్టండి.." అని అన్నారు. ముస్లింలు ఔదార్యాన్ని ప్రదర్శించి, తమ కార్యకర్తలకు, హిందూ దురభిమానులకు సహకరించాలని ఆయన కోరారు. వారణాసిలో జ్ఞానవాపి మసీదు, మథురలో ఈద్గాను హిందువులకు ఇవ్వాలనే డిమాండ్‌కు సంఘ్ మద్దతునిస్తున్నట్లు భాగవత్ సంకేతాలిచ్చారు.

**(ఐపిఎ సర్వీస్)**

# విద్యార్థుల గోసలు తీరేది ఎన్నడో?



**కసిరెడ్డి మణికంఠ రెడ్డి**
**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు**
**7569548477**

ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యార్థుల కష్టాలు, బాధలు తీరడం లేదు. ప్రభుత్వాలు విద్య ను ఒక బాధ్యతగా మానవ వనరుగా చూడటం మర్చిపోయింది. ఎన్నికల హామీలుగా విద్యారంగ పథకాలను ప్రకటించడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం ఆనవాయితీగా మారింది. హామీల అమలుపై ఊసెత్తకపోవడం, విస్మరించడం సామాన్యమైంది. విద్యను పూర్తిగా ప్రభుత్వరంగం నుండి తప్పించడానికి ప్రైవేట్‌పరం చేయడానికి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు పడే పాట్లు అంతా ఇంతా కాదు. మౌలిక వసతుల సమస్యల కృషికి వాటికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంపై పాలకుల కు ధ్యాస ఉండటం లేదు. కానీ ఏ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ఆ ప్రభుత్వ సిఎం, మంత్రుల, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు సుందరీకరణకు నిధులు ఇస్తారు త్వరితగతిన పనులు పూర్తి అవుతాయి. మరి పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఉండే హాస్టళ్లకు మౌలిక సదుపాయాల కల్పనపై, వాటి అభివృద్ధిపై దృష్టిపెట్టరు. వారి సమస్యలు తెలుసుకోరు ఎందుకు సమస్య లు పరిష్కారం కావు? అనేక పోరాటాలు చేసిన ఫలితంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి చార్జీలు పెంచలేదు? మధ్యాహ్న భోజనం వంటకి కూడా చాలా పాఠశాలలల్లో ప్రత్యేక గదులు లేని పరిస్థితి. గురుకులాలు,మోడల్ స్కూళ్లు, కెజిబివిలల్లో నిత్యం విద్యార్థులకు నిత్యం ఫుడ్ పాయిజనింగ్ జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు అస్వస్థత కు, అనారోగ్యానికి గురవుతున్నారు. దానికి గల కారణం తాగునీరు కలుషితం, నాసిరకం ఆహార వస్తువుల వినియోగం వల్ల జరుగుతున్నాయి.

దీంతో గురుకులాల విద్యార్థులు, వారి తల్లితండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థుల అన్నం సరిగా పెట్టండి అంటూ రోడ్డెక్కుతు ఉద్యమాలు చేస్తున్న పరిస్థితి తెలంగాణలో ఉంది. ప్రజాప్రతినిధులు గురుకులాల సందర్శన లేదు. ఫుడ్ పాయిజన్‌లకుగల కారణాలు తెలుసుకోవడం లేదు. యూనివర్సిటీలకు పూర్తిస్థాయి విసిలను నియామకం చేసిన ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తేనే విద్య ప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రతిపక్షంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి గారు నేడు అధికారం వచ్చాక విద్యాశాఖ తన వద్దే ఉన్న ప్రైవేట్ వారి ఫీజుల దోపిడీపై మాట్లాడటం లేదు. చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామని ప్రకటించారు. అన్ని హామీలను అమలుకు కృషి చేస్తున్నామని అంటున్నారు. మరి విద్యార్థుల హామీల అమలుపై ఎందుకు మాట్లాడటం లేదు? బడ్జెట్‌లో విద్యకు 15%నిధులు కేటాయిస్తామని ప్రకటించి మొదటి, రెండు బడ్జెట్‌లల్లో కేవలం 7% నిధులు మాత్రమే కేటాయించారు

ఫీజు రీయింబర్స్మెంట్ పథకం పేద విద్యార్థులకు ఎంతో ఆసరాగా ఉంటూ లక్షలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య చదువుకోవడానికి పైసలు లేక ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్య అభ్యసించాక విద్య పూర్తయి సర్టిఫికెట్లు తీసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు బకాయిలు రాలేదని పైసలిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యజమాన్యలు చెప్పడంతో పైసలు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోని వారు ఎందరో ఉన్నారు. 2020–21, 2021–22, 2022–23, 2023–24 విద్యా సంవత్సరానికి పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిల మొత్తం 8000 కోట్ల రూపాయల వరకు ఉన్నాయి.

ప్రస్తుత విద్యా సంవత్సరం 2025–26కూడా అడ్మిషన్లు పూర్తయి మళ్ళీ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకునే గడువు రావస్తుంది. ఈ ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి నిధులు ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ బాగాలేదు. కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు అంటూ వేలకోట్ల అప్పులు చేస్తు పరిపాలన చేస్తున్నామని మాట్లాడుతున్నారు. గత 18 నెలల్లో చేసిన అప్పుల్లో విద్యార్థుల చదువులకు నిధులు ఎందుకు ఇవ్వలేదు. సరే గత బిఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకుండా వేలకోట్ల రూపాయల భారం వేసింది. అవి ఒకేసారి విడుదల చేయడం సాధ్యంకాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటినుండి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను అయినా విడుదల చేస్తే బాగుండేది.

ప్రభుత్వం ఓట్లు ఉన్నవారికి పెండింగ్ నిధులు విడుదల చేస్తూ ఓట్లు లేని విద్యార్థులకు ఫీజు బకాయి లు విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఫీజు బకాయిలు విడుదల చేయండి తమ చదువులకు ఇబ్బంది లేకుండా చూడండి అంటూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమిస్తున్న, సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు, భవన కిరాయిలు కట్టే పరిస్థితి లేదు అని తాము కళాశాలలు నడపలేము అంటూ ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల వారు కొన్ని నెలలకింద నాలుగు రోజులు కళాశాలలు బంద్ చేసి సెమిస్టర్ పరీక్షలు బహిష్కరిస్తే నాలుగు రోజుల్లో విడుద ల చేస్తామన్నారు. ఇప్పటికీ విడుదల లేదు. ఫీజు బకాయిల విడుదల పట్ల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వీడాలి, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అనే విషయాన్ని నేటిప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రంలో విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్ద ఉన్న ఎందుకు విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావట్లేదు.

ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలపై సిఎం ఎందుకు మాట్లాడటం లేదు. సిఎం తన వద్ద విద్యాశాఖ ఎందుకు పెట్టుకున్నారు అనే సందేహం ఉంది. విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న సిఎం విద్యాశాఖపై సమీక్షలు చేయకుండా కనీసం చదువుల వాటికి నిధులు ఎందుకు విడుదల చేస్తలేరు అనే ప్రశ్న విద్యార్థులకు కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖపై వెంటనే సమీక్ష నిర్వహించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను మొత్తం ఒకేసారి విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చి, రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలి.

## రాజన్నను దర్శించుకున్న రాజమండ్రి ఇస్కాన్ గురువు



**ప్రజాపక్షం/ వేములవాడ:** దక్షిణ భారత ఇస్కాన్ ఆలయాల అధ్యక్షుడు, రాజమండ్రి ఇస్కాన్ ఆలయ గురువు సత్య గోపీనాథ్ దాస్ బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని.స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు జి.శ్రీనివాస్ శర్మ సత్య గోపీనాథ్ దాస్‌కు శేషవస్త్రం అందించి, లడ్డు ప్రసాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీకాంత్ చార్యులు, సీనియర్ అసిస్టెంట్ బోడుసు మహేష్ పాల్గొన్నారు.

## తీరని యూరియా తిప్పలు



**ప్రజాపక్షం / చందుర్తి :** నెల రోజులుగా ఎదురుచుస్తున్న చందుర్తి మండల రై తులకు యూరియా తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.రైతులకు సరిప డా యూరియా అందజేస్తామని చందుర్తి ఫ్యాక్స్ పరిదిలో గత నెల 12,13 తేదీలలో టోకెన్లు ఇచ్చిన ఇప్పటికి సరిపడా యూరియా అందజేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం చందుర్తి ఫ్యాక్స్ కి యూ రియా బస్తాలు వచ్చాయని తెలుసుకున్న రైతులు బుధవారం అక్కడకు చేరుకొని ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టారు. యూరియా కొరత లేదని చె ప్పున్న అధికారులు సరిపడా యూరియా బస్తాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సరిపడా ఎరువు బస్తాలు అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అధికారులు సమయపాలన పాటించకపోతే చర్యలు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి హెచ్చరిక



**ప్రజాపక్షం/సిద్దిపేట:** అధికారులు సమయపాలన పాటించి విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమవతి అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. బుధవారం తొగుటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అటెండన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్, విసిట్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ల్యాబ్ సిబ్బందితో శాంపిల్స్ టిహబ్‌కి పంపిస్తున్నారా అని అడిగి రాండమ్ టేస్ట్‌లు చేస్తున్నారని ఆరా తీశారు. ర్యాపిడ్ టేస్టులు తప్పనిసరిగా పీహెచ్‌సీలోనే చేయాలని ఆదేశించారు. మండల పరిధిలోని తుక్కాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.వనమహోత్సవం టార్గెట్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఎంపిడిఓకు సూచించారు. 600 స్కేర్ ఫీట్ మాత్రం మించకుండా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మండలంలో కూడా 100 శాతం గ్రౌండింగ్‌అయిన ఇండ్లు పూర్తి చేయించాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిఓ శ్యామల తదితరులు ఉన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి సిఐ రాం నర్సింహరెడ్డి



**ప్రజాపక్షం/ధర్మపురి :** సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ధర్మపురి సిఐ ఎలపాటి రాం నర్సింహరెడ్డి సూచించారు. ధర్మపురి పట్టణంలోని కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలో బుధవారం సైబర్ మోసాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ మోసాలకు లోనవుతున్న వారిలో యువత ఎక్కువ మంది ఉన్నారని, మొబైల్ ఫోన్లలో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి అత్యాశతో మోసగాళ్ల ఉచ్చులో పడకూడదని సూచించా రు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తంగా ఉండాలని వారితో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. లాటరీ బహుమతులు, మల్టిలెవల్ మార్కెంటింగ్, క్రిఫ్టో కరేన్సి, డిజిటల్ అరెస్టు వంటి మోసాలకు లోనవ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి పిర్యాదు చేయాలని విద్యార్థులకు సిఐ రాం నర్సింహ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ , వైస్ ప్రిన్సిపాల్ మిత్ర, పోలీస్ సిబ్బంది, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భార్యను వేధించిన భర్తకు జైలు శిక్ష

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ము స్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సడిమెల రామచంద్రం తన భార్య కనుకవ్వను తరచూ మానసికంగా శారీరకంగా వేధించేవాడని, మద్యం సేవించి గొడవలు పెట్టడంతో పాటు భార్యను దారుణంగా కొట్టాడని, టార్చ్ లైట్‌తో దాడి చేసి గాయాలు చేశాడని వేధింపులు భరించలేక భాధితురాలు ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా, పోలీసులు నిందితుడు రామచంద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. అనంతరం అప్పటి ఎస్ఐలు చిట్టిబాబు, ప్రవీణ్ చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా, ఎస్సై గణేష్, సిఎంఎస్ ఎస్ఐ శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్‌తో పాటు 12 మంది సాక్షులను కోర్టులోప్రవేశపెట్టారు. నిందితుడు రామచంద్రంపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పదివేల జరిమనా విధించినట్లుఎస్ఐగణేష్ తెలిపారు.

## మా తండాలను గ్రామపంచాయతీలుగా మార్చండి

మంత్రి సీతక్కకు ఎల్‌హెచ్‌పిఎస్ వినతి



**ప్రజాపక్షం/వీర్నపల్లి:-** తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు ధనసరి సీతక్క, ఎస్టీ,బీసీ,మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌లను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. మండల కేంద్రంలోని వన్‌పల్లి గ్రామంకు సంబంధించిన కేలోతు తండాను గ్రామపంచాయతీ చేయాలని కోరుతూ నాలుగు తండాలకు సంబంధించి శంకర్ నాయక్ తండా, రెడ్డి తాండ, అజ్మీర తండా,కేలోత్ తండా వాసులు ప్రభుత్వంలోని ప్రముఖులను కలిసి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సానుకులంగా స్పందించిన మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు తక్షణమే గ్రామ పంచాయతీలుగా ఎర్పాటు చేసే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, గుడి చైర్మన్ అజ్మీర జగన్ నాయక్, వైస్ చైర్మన్ నరహరి నాయక్, కాంగ్రెస్ గ్రామ శాఖ ఉపాధ్యాక్షులుపాల్గొన్నారు.

## 6న భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సి టీ:**భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వట్టి జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నగర కమిటీ ఆద్వర్యంలో టవర్ సర్కిల్ లేబర్ అడ్డా వద్ద మహాసభ పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6న శంకరపట్నం మండల కేంద్రంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా 6వ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. మహాసభల విజయవంతం కోసం నగర కమిటీ విస్తృతంగా కృషి చేస్తూ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గత మూడేళ్ల కాలంలో యూనియన్ పోరాటాలు, బలం, బలహీనతలు, నూతన కమిటీ ఏర్పాటు, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, భవన నిర్మాణ కార్మికుల కేంద్ర ప్రభుత్వ సంక్షేమ చట్టం, సెస్ యాక్ట్, అంతర్‌రాష్ట్ర వలస కార్మికుల చట్టం రక్షణ కోసం ఈ మహాసభలో తీర్మాణాలు చేయడం జరుగుతుందని తెలిపారు. మహాసభల విజయవంతం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తూ విరాళాలు సేకరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పాతూరి లింగారెడ్డి, అనుముల మల్లారెడ్డి, రవి, శంకర్, లత, భద్రాచారి తదితరులున్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట

ఉపాధ్యాయుల సేవలను వెలకట్టలేం

పాఠశాల విద్యలో జిల్లా ఆదర్శంగా నిలవాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**విద్యారంగంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లి లాంటి వారని, వారు పిల్లలను ఆదరించి చక్కటి విద్యాబుద్ధులు నేర్పాలని అన్నారు. చాలామంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వస్తారని, వారికి సేవ చేసే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వేలాదిమంది భవిష్యత్తును సన్మార్గంలో నడిపే అవకాశం ఉపాధ్యాయులకు ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి పాఠశాలల్లో తమ పిల్లల విద్యా విషయాలను వివరించాలని, తద్వారా హాజరుశాతాన్ని మరింతగా పెంచుకోవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు వంద శాతం పాఠశాలకు హాజరైతే విద్యార్థుల హాజరు అదే విధంగా నమోదవుతుందన్నారు. పాఠశాల విద్యలో జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. అ వార్డు స్వీకరించిన వారు మాత్రమే కాకుండా చాలా మం ది ఉపాధ్యాయులు తమ సేవలను గోప్యంగా అందిస్తున్నారని అన్నారు. వారందరికీ అభినందనలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులను గమనిస్తూ ఉండాలని, వారు ఎలాంటి ఒత్తిళ్లకు లోనవ్వకుం డా చూసుకోవాలన్నారు. చెడు అలవాట్ల బారిన పడకుండా సంరక్షించాలని సూచించారు. విద్యార్థులను తల్లి లా ఆదరిస్తూ సన్మార్గంలో నడిపించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 43 మంది ఉపాధ్యాయులకు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 17 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. గత విద్యాసంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించిన 95 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గోడ గడియారాలను బహుమతులుగా అందజేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సృజనాత్మకతతో ఈ గడియారంలో పాఠశాల విద్యలో అవలంబించాల్సిన 12 అంశాలను సూచికలుగా పొందుపరిచి రూపొందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ప్రవేశపెట్టిన లాంగ్వేజ్ లాంతర్న్ (ఇంగ్లీష్/హిందీ/తెలుగు క్లబ్) సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, కృపారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి తదితరులున్నారు.

## కాంగ్రెస్, బిజెపిల కుట్రతోనే కాళేశ్వరంపై సిబిఐ విచారణ

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కాంగ్రెస్. బిజెపి చేస్తున్న కుట్ర రాజకీయాల్లో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టు పై సిబిఐకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌శర్మ, నాయకులు దేవిప్రసాద్,పల్లె రవికుమార్. బాలరాజులు స్పష్టం చేశారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మెడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదని 20 రిజర్వాయర్ల సమూహం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. మెడిగడ్డలో రెండు,మూడు పిల్లర్లు కుంగిపోతే దాన్ని రాజకీయం చేస్తూ విషప్రచారం చేస్తూ కెసిఆర్, హరిష్‌రావుల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. బిఆర్ఎస్‌ను స్వయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్. బిజెపిలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. కెసిఆర్ సాధరణ రాజకీయ నాయకుడు కాదని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత అని, అది మరిచిపోతున్నారన్నారు. తెలంగాణ రైతుల గోస కళ్లార చూసి, అనుభవించిననేతగా, తెలంగాణ రైతులకు సాగునీరు అందించి ఈప్రాంత కరువు,కాటకాలను శాశ్వతంగా దూరం చేయాలని లక్ష్యంతో కెసిఆర్ గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు తీసుకొని, నీటిలభ్యతపై సిడబ్లుసి ఇచ్చిన నివేదిక ఆధారంగా మెడిగడ్డ ప్రాజెక్టును రూపకల్పన చేశారన్నారు. తమ్మిడిహట్టి నీటి లభ్యత లేకపోవటంతో మహారాష్ట్ర అక్కడ బ్యారేజీ కట్టడానికి అనుమతి ఇవ్వకపోవటంతో దాన్ని మార్చి మేడిగడ్డ వద్ద మొదటి బ్యారేజీ నిర్మించినట్లు తెలిపారు. అక్కడి నుండి 20 ప్రాంతాల్లో బ్యారేజీలో రిజర్వాయర్లు నిర్మించి ప్రపంచటంలో అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేవలం 94 వేల కోట్లతో పూర్తి చేశారన్నారు.గోదావరి నదికి 560 మీటర్ల ఎత్తులో ఉన్న సిద్దిపేట ప్రాంతానికి చిట్టచివరి ప్రాంతమైన కొండపోచమ్మ సాగర్‌ను నీళ్లు అందించిన చరిత్ర కాళేశ్వరం ప్రాజెక్టుకు ఉందన్నారు. కేవలం కాంగ్రెస్ నాయకులు రాజకీయ కక్షతోనే ఘోష్ కమిషన్ వేసి కమిషన్ రిపోర్టులో ఏమితేలకపోవటంతో చేసేది ఏమిలేక కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో నరేంద్రమోడీ కుమ్మక్కై కాళేశ్వరం విచారణను సిబిఐకి అప్పగించినట్లు రేవంతత్‌రెడ్డి ప్రకటించినట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి బిజెపితో కుమ్మక్కై చేస్తున్న చిల్లర రాజకీయాలపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిజెపిలు ఎన్ని కుట్రలు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలతో లక్షలాది ఎకరాలు పంటలు పండించిన ఘనత రైతులకు తెలుసునన్నారు. నిండుకుండల ఎప్పుడు జలకళను సంతరించుకొని గోదావరి జలాలతో కలకలలాడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టును అనుసందానంగా నిర్వహించిన రిజర్వాయర్ అందుకు సజీవ సాక్ష్యమని ఎమ్మెల్సీ దేశపతి అన్నారు. కాంగ్రెస్, బిజెపి కుట్రరాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

## రోడ్డున పడ్డ రైతుల పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు





**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ధూల్మిట్ట మండల కేంద్రంలో యూరియా కోసం రైతుల తిప్పలు తప్పడంలేదు. ఎరువుల కోసం అధికారులు అడిగిన రైతుల పట్టాపాస్‌బుక్ మురియూ ఆధార్ కార్డు జిరాక్స్‌లు బుధవారం రోడ్డుపై కనిపించడంపై రైతులపై అధికారుల అలసత్వం మరోసారి రుజువైయింది. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వాల నుండి కల్పించే కనీస సౌకర్యాలు కరువైనాయి. రైతుల కోసమే పనిచేయాల్సిన అధికారులు సైతం రైతుల పట్ల అలసత్వం చూపుతూ, ఎరువుల కోసం రైతులు అందించిన ఆధారాలను నేడు నేల పాలు చేయడం ఏమిటని, పలు ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధూల్మిట్ట మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ఎరువుల కోసం అధికారులు అడిగిన రైతుల పట్టాపాస్‌బుక్ మురియూ ఆధార్ కార్డు జిరాక్స్‌లు బుధవారం వేదిక ముందున్న మేట్లపై రైతులు తమ ఆధారాలు వెతుకుతూ అధికారులనిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ కూడ పైరవీలతో ఎరువులు కొందరు దండుకుంటుంటే, రోజుల తరబడి క్యూలో నిలబడిన తమకు యూరియా అందడం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ఇలా నిర్లక్ష్యం చేసిన అధికారులపై రైతు సొసైటీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## బాలికల భద్రతా కార్యక్రమాలు భేష్

ఉగాండా ప్రతినిధుల కితాబు

భద్రత కార్యక్రమాలపై ఉగాండా ప్రతినిధుల అధ్యయనం



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**బాలికల భద్రత, విద్య, అభివృద్ధి, జీవన నైపుణ్యం కోసం జిల్లాలో చేపడుతున్న వాయిస్ ఫర్ గర్ల్స్, స్నేహిత వంటి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ఉ గాండా దేశపు గర్ల్ ఆఫ్ ఉగాండా సంస్థ ప్రతినిధుల బృందం బుధవారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించింది. బాల బాలికలతో మమేకమై జిల్లా యంత్రాంగం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కితాబు ఇచ్చింది. హనుమాన్‌నగర్‌లోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, బొమ్మకల్‌లోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలల్లో బాలికల పరిరక్షణకు స్నేహిత క్లబ్, వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం ద్వారా చేపట్టిన అవగాహన కార్యక్రమాలను విశ్లేషించారు. అనంతరం కలెక్టర్‌లో జిల్లా కలెక్టర్ పమేలా స త్పతితో ఈ బృందం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టిన వాయిస్ ఫర్ గర్ల్స్, స్నేహిత కార్యక్రమాల గురించి వివరించారు. మహిళ, శిశు సంక్షేమం, పోలీస్, ఎక్సైజ్ వంటి వివిధ శాకల అధికారులతో ప్రతి పాఠశాలలో స్నేహిత కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సేఫ్ టచ్ అన్‌సేఫ్ టచ్, మాధకద్రవ్యాల దుష్పరిణామాలు, కెరియర్ గైడెన్స్, బాలల రక్షణ చట్టాలు వంటి వాటిని విధ్యార్థులకు వివరిస్తారని తెలిపారు. బాలికలకే కాకుండా బాలురకు అవగాహన కల్పిస్తున్నామని , తద్వారా లైంగిక వేధింపులు నిరోధించవచ్చని, డ్రగ్స్ బారిన పడకుండా యువతను కాపాడవచ్చని తెలిపారు. స్నేహిత కార్యక్రమం ద్వారా ఇప్పటికే మొదటి దఫాలో జిల్లాలోని 30 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. చిన్నపిల్లల లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నందున రెండవ దఫాలో ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈ అవగాహన ఉంటుందని అన్నారు. వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సం స్థ ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలు విస్తృ తం చేశామన్నారు. ఉగాండా ప్రతినిధులు మా ట్లాడుతూ ఈ విధానాన్ని తమ దేశంలో అనుసరించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపా రు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ తానాజీ వా కడే, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, గర్ల్ ఆఫ్ ఉగాండా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోనికా నైరాగుహాబ్వా, స హ వ్యవస్థాపకురాలు బాబ్, ప్రోగ్రామ్ అసోసియేట్ జోన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ థెపిస్థ, వాయిస్ ఆఫ్ గర్ల్ సంస్థ నిర్వాహకులు వనిత ప్రభు, వి ద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, నె హ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, జి సిడిఓ కృపారాణిలు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**గణేష్ నిమజ్జన ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్‌లో బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇంజనీరింగ్ అధికారులు, మానకొండూర్ రెవెన్యూ, పంచాయతీ అధికార సిబ్బందితో కలిసి శుక్రవారం జరగబోయే గణేష్ నిమజ్జనం ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా మానకొండూర్ పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనానికి చేయాల్సిన ఏర్పాట్లు, పాయింట్ వద్ద సమకూర్చాల్సిన సౌకర్యాలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులతో సుదీర్ఘంగా చర్చించి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం మానకొండూర్ చెరువు నిమజ్జనం పాయింట్‌ను సందర్శించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా పారిశుద్ధ్య పనులు చేపడుతూ భారీ విగ్రహాల కోసం క్రేన్లు సిద్ధం చేయాలన్నారు. అవసరమైన మరమ్మత్తులు తక్షణం చేసేందుకు నిపుణులను అందుబాటులో ఉంచాలన్నారు. చెరువులో బోట్లను, ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో హైమాస్ట్ లైటింగ్, మంచి నీటి సౌకర్యం కల్పించాలని విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్ అధికారులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మరోవైపు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా గణేష్ నిమజ్జనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ని కుట్రలు చేసినా భయపడేది లేదు

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/దుబ్బాక:** తెలంగాణ ప్రజల కరువు తీర్చె కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భయపడేది లేదని ప్రజా కోర్టులోనే తేల్చుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సృష్టం చేశారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను నిరసిస్తూ తొగుట మండలంలోని మల్లన్నసాగర్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గులాబీ శ్రేణులతో కలిసి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేసి, ఆనీటితోనే తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, ఎన్నో ప్రాజెక్టులు, బ్యారేజీలు, పంపు హౌస్‌లు, కాలువలు, సబ్ స్టేషన్‌లు, భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. రూ.94వేల కోట్లతో ప్రాజెక్టు పూర్తయితే మేడిగడ్డ ప్రాజెక్టుకేవలం రూ.4వేల కోట్లతో పూర్తి అయిందన్నారు. కాళేశ్వరంపై వేసిన గోష్ కమిషన్‌ను కాదని కాంగ్రెస్ పార్టీ సిబిఐకి అప్పగించడం సరికాదన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని సిబిఐ విచారణలు చేసిన కెసిఆర్‌ను ఏమి చేయలేరని, కడిగిన ముత్యంలా బయటకు వస్తాడన్నారు. 2028లో సిఎం కెసిఆర్ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## 5వ తేదీన జిపిఓలకు నియామకపత్రాలు జారీ

సిసిఎల్ఏ లోకేష్ కుమార్

మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలి

అభ్యర్థుల తరలింపునకు తగిన ఏర్పాట్లు చేయాలి

హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిపిఓ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు సీసీఎల్ఏ లోకేష్ కుమార్ వెల్లడించారు. జిపిఓఅభ్యర్థులకు నియామక పత్రాలు హైదరాబాద్ లో అందజేయనున్న సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగాసిసిఎల్ఏ లోకేష్ కుమార్ మాట్లాడారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీఓల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పరీక్ష నిర్వహించిందని తెలిపారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని జిల్లాల్లో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. వారిని హైదరాబాద్ తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.ఆయా జిల్లాల నుంచి ప్రత్యేక బస్ లలో వారిని నిర్ణీత సమయానికి తరలించాలని సూచించారు.వారికి కావలసిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని ఆయా జిల్లాల్లోని మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**తగిన అన్ని ఏర్పాట్లు చేయాలి..**

జిల్లా నుంచి జిపిఓ పరీక్ష రాసి 66 మంది ఉత్తీర్ణత సాధించారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. అభ్యర్థులను ఈ నెల 5 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి తరలించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ను నోడల్ ఆఫీసర్ గా నియమించామని తెలిపారు. హైదరాబాద్ తరలివెళ్లే అభ్యర్థులకు కావల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్‌డిఓవెంకటేశ్వర్లు, కలెక్టరేట్ఏఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతం నుంచి గర్భిణుల తరలింపు



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** భారీ వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన హుడికిలి గ్రామం నుంచి ముగ్గురు గర్భిణులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ రహీముద్దీన్ ఆధ్వర్యంలో వైద్య, పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు. వరద నీటిలో చిక్కుకున్న గ్రామం నుంచి ట్రాక్టర్ల సహాయంతో వారిని సిర్పూర్ టి వైపు తరలించారు. గ్రామస్తుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

## కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ సబబే

### కెసిఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

### సంగారెడ్డి ఎమ్మెల్యేచింత ప్రబాకర్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కల్వకుంట్ల కవితను బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెన్షన్ చేస్తూ కెసిఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల సంగారెడ్డి ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. బుధవారం నాడు సంగారెడ్డి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ కోసం కెసిఆర్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని, తరువాతి కాలంలో కూడా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని నిలబడతారని ఆయన పేర్కొన్నారు, కెసిఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది బిఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు మేలు చేకూరే విధంగా ఉంటుందన్నారు. పార్టీలో ఎవరు ఇబ్బందులకు గురిచేసినా వారిపై క్రమశిక్షణ చర్యల విషయంలో ఇహపర బేధాలుండవని కవిత విషయంలో కెసిఆర్ మరోసారి నిరూపించారన్నారన్నారు.



## నిమజ్జన ప్రాంతాల వద్ద పటిష్ఠ చర్యలు చేపట్టాలి

### జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలను శాంతి భద్రతల మధ్య ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాపోలీస్ శాఖ సిద్ధంగా ఉందని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలం పెద్దవాగు వద్ద గణేష్ నిమజ్జ స్థలాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్‌లతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులకు, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ గణేష్ శోభాయాత్ర జరిగే మార్గాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు జరగకుండా ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక ప్రతిమల నిమజ్జనాల కోసం క్రేన్లు, లైట్ల ఏర్పాటు, నిమజ్జ ఘాట్ల వద్ద ఈత గాళ్లతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా ప్రజలు నిబంధనలు పాటిస్తూ పోలీసుల సూచనలు పాటించి గణేష్ నిమజ్జనోత్సవాలను విజయవంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ కమీషనర్ రాజేందర్, రూరల్ సిఐ కుమారస్వామి, కాగజ్‌నగర్ టౌన్ సిఐ ప్రేమ్‌కుమార్, డివైఈఈ రమాదేవి,రూరల్ ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో 9.8 మి.మీ. సగటు వర్షపాతం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షపాతం సగటు 9.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. కొన్ని మండలాల్లో స్వల్పంగా, మరికొన్ని మండలాల్లో మాత్రం ఎక్కువ వర్షం కురిసింది. అత్యధికంగా కొటపల్లి మండలంలో 44.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. బెల్లంపల్లి 18.6, జైపూర్ 14.6, నెన్నెల 13.8, తాందూర్ 15.6, కాశిపేట 10.2, కన్నెపల్లి 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హాజీపూర్ 6.4, వేమనపల్లి 6.0, మందమర్రి 8.0, భీమిని, చెన్నూరు చెరో 7.4, భీమారం 5.8, మంచిర్యాల పట్టణంలో 3.2, నస్పూర్‌లో 3.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. వాతావరణ సూచన ప్రకారం వచ్చే 24 గంటల్లో 2.5 నుంచి 15.6 మిల్లీమీటర్ల వర్షం, 48 గంటల్లో 0.3 నుంచి 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం లంచం తీసుకుంటున్న మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి అక్కల వెంకటస్వామిని బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణమామిడి గ్రామానికి చెందిన ఓ బాధితుడు తన పని కోసం వెంకటస్వామిని సంప్రదించగా, అతను రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచనల మేరకు బుధవారం లంచం ఇస్తుండగా అధికారులు దాడి చేసి వెంకటస్వామిని పట్టుకున్నారు. పంచాయితీ కార్యదర్శిని ఎసిబి అధికారులు పట్టుకున్నారనే విషయం తెలియగానే గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ వెంకటస్వామి అనేకమంది నుంచి లంచాలు వసూలు చేశాడని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు తెలిపారు. లంచాల వ్యవహారంపై ఎసిబి అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కల్యాణలక్ష్మి పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం అని ఎంఎల్ఎ కోవా లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో తిర్యాణి మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు ఆమె కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఆడపిల్లల పెళ్లిళ్లకు లక్ష రూపాయలతో పాటు ఒక తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. లబ్ధిదారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఎల్‌ఒసి చెక్కు అందజేసిన డిసిసి అధ్యక్షుడు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని బేస్తవారిపేట్ కాలనీకి చెందిన ఐశ్వర్య అనే బాలిక అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.ఆమెకు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు బుధవారం అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు.బాధిత కుటుంబ సభ్యులు శ్రీహరి రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంలో నిర్మల్ మునిసిపల్ కౌన్సిలర్ సైండ్ల శ్రీధర్,గంగోని భూరాజ్,వొద్నాల రాజేశ్వర్,శ్రీనివాస్ గౌడ్,అంబేకార్ ప్రసాద్,గాజుల రవి కుమార్,తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనుల వేగవంతంపై దృష్టి

### కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వంద శాతం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని, ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద పివిటిజిలకు వంద శాతం ఇళ్లు మంజూరు అవుతాయని, దీనికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, పశువుల, పౌల్ట్రీ, గోట్ షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, దోమల వ్యాప్తిని అరికట్టడానికి ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రోత్సహించాలని, వనమహోత్సవం2025లో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, హౌసింగ్ పిడితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల ధర్నా

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయని, దీనివల్ల ఉన్నత విద్యకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలని, విద్యా సంస్థలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని, రెగ్యులర్ డిఇఒను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పిన తర్వాత, ఎస్ఎఫ్ఐ నాయకులు, కొంతమంది విద్యార్థులు కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయి, ఇతర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాళేశ్వరంపై ...కాంగ్రెస్ అసత్యప్రచారం

### రెండు రోజులగా బిఆర్ఎస్ నాయకుల నిరసనలు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు జరిగాయని దీనిపై విచారణను సిబిఐకి అప్పగిస్తున్నామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. రెండు రోజులుగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు , రాస్తారోకోల జరుగుతున్నాయి . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,కి వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీలు నినాదాలను చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులను ఖతం చేసేందుకు ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారని విమర్శించారు. సంగారెడ్డి, జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ,కార్యకర్తలు సంగారెడ్డి, కొత్త బస్టాండ్ వద్ద నల్లకండువాలు ధరించి ధర్నా రాస్తారోకోలు చేపట్టారు. తెలంగాణ సస్యశ్యామలమై కెసిఆర్ కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే మేడిగడ్డను బాగు చేయడం లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ,గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మేణ్‌నరహరిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకలు డాక్టర్ శ్రీహరి, మామిళ్ల రాజేందర్, మందుల వరలక్ష్మి , చింత సాయినాథ్ ,పట్టణ అద్యక్షులు ,ఆర్ వెంకటేశ్వర్లు ,కార్యదర్శి నర్సింహులు ఖాజాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల నిరీక్షణ



**ప్రజాపక్షం/తాండూరు :** మండలంలోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రేచిని గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద బుధవారం యూరియా పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేయగా, ఎరువుల కోసం రైతులు తెల్లవారు జాము నుంచే భారీగా తరలివచ్చారు. పంపిణీ కేంద్రం వద్ద కిక్కిరిసిన రైతులు గంటల తరబడి నిలబడలేక అలిసిపోయారు. తీవ్ర ఉక్కపోత, నిరీక్షణతో విసిగిపోయి చివరకు క్యూలైన్‌లో తమ చెప్పులను ఉంచి, పక్కన ఉన్న చెట్ల కింద ఆశ్రయం పొందడం కనిపించింది. సాధారణంగా పంట విస్తీర్ణాన్ని బట్టి యూరియా బస్తాలను పంపిణీ చేస్తారు. కానీ, రేచిని ప్రాథమిక సహకార సంఘం వద్ద మాత్రం రైతుల పాస్ బుక్‌లలో ఉన్న ఎకరాలతో సంబంధం లేకుండా, ప్రతి రైతుకు కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడం రైతుల్లో ఆగ్రహం కలిగించింది. ఈ రెండు బస్తాలు తమ పంటలకు ఏమాత్రం సరిపోవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంటలకు యూరియా అత్యవసరం కావడంతో, కొరత కారణంగా తమ పంట దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, యూరియా నిల్వలను పెంచి, రైతులందరికీ వారి అవసరాలకు తగినన్ని బస్తాలు అందించాలని రైతులు కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా సరైన ప్రణాళికతో యూరియా పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంపిణీ ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు ఎవరూ కనిపించకపోవడం గమనార్హం.



## తాండూరులో దెబ్బతిన్న పంటల సర్వే

**ప్రజాపక్షం/తాండూరు :** భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన పంటలను అధికారులు బుధవారం సర్వే చేశారు. మండలంలోని అచలాపూర్, ద్వారకాపూర్, రాంపూర్, చంద్రపల్లి, మాదారం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను తాండూరు వ్యవసాయ అధికారిణి కె. సుష్మా ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించారు. ఈ సర్వేలో ఎఇఒలు శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి , రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కుట్రలో పావుగా మారిన కల్వకుంట్ల కవిత

### కెసిఆర్ కుటుంబాన్ని బద్నాం చేయడమే లక్ష్యం

### ప్రధాని మోదీ ఉడుత ఊపులకు బిఆర్ఎస్ భయపడదు

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** బిఆర్ఎస్ పార్టీని విచ్ఛిన్నం చేసే క్రమంలో కల్వకుంట్ల కవిత కాంగ్రెస్, బిజెపిలకు పావుగా మారినట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వూడెం కృష్ణారెడ్డితో కలిసి బుధవారం గజ్వేల్‌లోని కెసిఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ దళపతి కెసిఆర్ కుటుంబం లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తెరచాటు ఒప్పందంతో కుట్రలకు తెరలేపుతుండగా, బిజెపి ఉడత ఊపులకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు భయపడరని ఎద్దేవా చేశారు. 60 లక్షల సభ్యత్వాలు కలిగిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పటిష్టంగా ఉందని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్లు దక్కవని అన్నారు. ముఖ్యంగా కుట్రలో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తుండగా, పిసి ఘోష్ కమిషన్ ను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి కుట్రలను బిఆర్ఎస్ పార్టీ ఎదుర్కొంటూ తగిన జవాబు చెప్తుందని స్పష్టం చేశారు. కాగా గజ్వేల్ నుండి తాను ఎమ్మెల్యేగా గెలవాలనే లక్ష్యంతో మూడుసార్లు ఎన్నికల బరిలో నిలువగా, రాజకీయ విమర్శల్లో భాగంగానే మాజీ మంత్రి హరీష్ రావును విమర్శించినట్లు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో అప్పటి వీడియోను వైరల్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులకు తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు బెండ మధు, కుమార్ యాదవ్, విరాసత్, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నవాజ్ మీరా, అశోక్ రావు, ఉమర్, స్వామి, గడియారం చారి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని వడ్యాట్ గ్రామంలో 24మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా మొదటి విడతలో 8మంది లబ్ధిదారులకు లక్ష రూపాయాలు ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆనంద్, ఎఎంసీ డైరెక్టర్లు బూత్‌పురం మహిపాల్, నవీద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగుల నవీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నందం గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీధర్, ఆర్మూర్ సంతోష్, దాప రవి, పెండెం శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్, మనోజ్ పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని భామ్ని కే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం సుపోషిత్ గ్రామ పంచాయతీగా ఎన్నిక కావడంతో కేంద్ర బృందం భామిని గ్రామంలోని అంగన్వాడి పాఠశాలను పరిశీలించారు. సుపోషి త్ జిపి గ్రామపంచాయతీ పోషణ అభియాన్ లో భాగంగా సెంట్రల్ టీం సభ్యులు అశోక్ శర్మ సిడిపిఓ స్టేట్ కన్సల్టెంట్ విజయ్ తాపక్ స్టేట్ కన్సల్టెంట్ అశోక్ జిల్లా పోషణ అభియాన్ డిస్టిక్ కోఆర్డినేటర్ నిరంజన్ రెడ్డిలు నిర్మల్ సిడిపిఓ సరిత ఖానాపూర్ సిడిపిఓ నాగలక్ష్మి ,లు సందర్శించారు.సంబంధిత అంగన్వాడీ సెంటర్ ను దర్శించి పిల్లల పోషణ స్థితిని అంగన్వాడీ ద్వారా అందిస్తున్న సేవలను సరఫరా అవుతున్న ఆహార పదార్థాల నాణ్యతలను పరిశీలించారు.ముధోల్ సిడిపిఓ సరోజిని సెక్టార్ సూపర్వైజర్ డి.మీనా ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్ పరానా తదితరులు పాల్గొన్నారు.

## భారీ వరదనీటి ప్రవాహం కారణంగా రిజర్వాయర్ గేట్ ఎత్తివేత



**ప్రజాపక్షం/ఎడపల్లి :** అలీసాగర్ రిజర్వాయర్ ఎగువ ప్రాంతమైన కళ్యాణి సింగీతం ప్రాజెక్టు నుంచి నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌లోకి వరద నీరు వచ్చి చేరడంతో ఆ నీటిని అలీసాగర్ జలాశయంలోకి వదులుతున్నారు. అలీసాగర్ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అలీసాగర్ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో జలాశయంలోకి నీటి ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమై అలీసాగర్ జలాశయం ఒక గేటును బుధవారం ఎత్తివేసి 200క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. వరద నీటి ఇన్‌ఫ్లో ఉన్నంత వరకు గేట్లను ఎత్తివేసి ఉంటాయని ఇన్‌ఫ్లో తగ్గిన తరువాత గేట్లని మూసివేస్తామన్నారు.

## ఎరువుల గోడౌన్, పల్లె దవాఖానను కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/జుక్రాన్‌పల్లి :** జుక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి మండలాల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. డిచ్‌పల్లి మండలం నడ్పల్లి గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ జుక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఈ సీజన్‌లో ఇంకా ఎంత మొత్తంలో యూరియా ఎరువుల అవసరం పడుతుందని ఆరా తీశారు. స్టాక్ కొంత మిగిలి ఉండగానే ఇండెంట్ పెట్టి కొత్త స్టాక్ తెప్పించుకోవాలని మండల వ్యవసాయాధికారిని దేవికకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే వచ్చే యాసంగి సీజన్‌కు సంబంధించి కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. కాగా పడకల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై కలెక్టర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులందరూ నిర్మాణాలు చేపట్టేలా క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ జరుపాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

## నర్సాపూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలేటి



**ప్రజాపక్షం/నర్సాపూర్ (జి) :** నర్సాపూర్ మండల కేంద్రంలో భారీ వర్షాలకు గ్రామంలో దేవుని చెరువుకు గండిపడి తెగిపోవడంతో నేడు ఆ ప్రాంతాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. చెరువు కట్ట మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు.చెరువు దిగువ పంటపొలాలు ముంపుకు గురవడంతో వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే చెరువు కట్ట తెగిపోవడంతో గంగపుత్రులు సైతం నష్టపోయారని వారికి కూడా నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి,నాయకులు శనిగరపు చిన్నయ్య, ముత్యం రెడ్డి,మండల అధ్యక్షుడు నరేందర్,నాయకులు దత్తురాం, సుధాకర్, గంగారం,శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ పటేల్, మహిపాల్, సాయన్న, భోజన్న,తో పాటు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ


# బుల్స్‌పై దబాంగ్ గెలుపు



**వైజాగ్ :** ప్రొ కబడ్డీ లీగ్ (పికెఎల్) సిజన్12లో దబాంగ్ ఢిల్లీ శుభారంభం చేసింది. మంగళ వారం విశాఖపట్నం పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 41–34 స్కోరుతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన దబాంగ్ ఢిల్లీ ఆట గాళ్లు పూర్తిస్థాయిలో ఆధిపత్యాన్ని ప్రదర్శిం చారు. ప్రథమార్ధంలో బెంగళూరు బుల్స్‌ను వరుసగా రెండుసార్లు ఆలౌట్ చేశారు. దబాంగ్ రైడర్లను నిలువరించడంలో బుల్స్ డిఫెండర్లు విఫలమయ్యారు. దీంతో తొలి భాగంలో ఢిల్లీ 21–11 స్కోరుతో ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్ధంలో బెంగళూరు అనూహ్యంగా పుంజుకుని పోటీనిచ్చింది. అయితే అప్పటికే పూర్తి ఆధిక్యంతో ఉన్న దబాంగ్ ఆటగాళ్లు మ్యాచ్ చివరి నిమిషాలలో వ్యూహాత్మకంగా ఆడి సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. దబాంగ్ రైడర్లు ఆషు మాలిక్ 17 పాయింట్లు, నీరజ్ నర్వాల్ రెండు బోనస లతో 7 పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39–36 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

## జకోవిచ్ శంఖారావం

రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవడమే లక్ష్యంగా కొనసాగుతున్న సెర్బియా దిగ్గజం నోవాక్ జకోవిచ్ మరో ముందడుగు వేసాడు. ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్ టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ 2025లో ఏడో సీడ్ నోవాక్ జకోవిచ్ అద్వితీయమైన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6–3, 7–5, 3–6, 6–4 తేడాతో అమెరికా స్టార్, నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ తీవ్ర పోటీ ఇచ్చినా.. మూడో సెట్ గెలిచి నాలుగో సెట్‌కు మ్యాచ్‌ను తీసుకెళ్లినా..జకోవిచ్ తన అనుభవంతో ఒత్తిడిని అధిగమించి విజయాన్ని కైవసం చేసుకున్నాడు. కీలకమైన బ్రేక్ పాయింట్‌లను సేవ్ చేసుకోవడం జకోవిచ్‌కు కలిసొచ్చింది. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 12 ఏస్‌లు, 35 విన్నర్లు కొట్టి 29 అనవసర తప్పిదాలు చేశాడు. 4 డబుల్ ఫాల్ట్‌లతో పాటు 6 బ్రేక్ పాయింట్స్ సాధించాడు. మరో వైపు ఫ్రిట్జ్ 10 ఏస్‌లు, 46 విన్నర్లు కొట్టి 51 అనవసర తప్పిదాలు చేశాడు. ఇదే అతని కొంప ముంచింది.5 డబుల్ ఫాల్ట్‌లతో పాటు 2 బ్రేక్ పాయింట్స్ మాత్రమే సాధించాడు. అతనికి 13 బ్రేక్ పాయింట్ అవకాశాలు దక్కినా.. రెండింటిని మాత్రమే సద్వినియోగం చేసుకున్నాడు. ఇది మ్యాచ్ ఫలితంపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ గెలుపుతో ఫ్రిట్జ్‌తో ఉన్న ముఖాముఖి రికార్డ్‌ను జకోవిచ్ 11–0తో మరింత మెరుగుపర్చుకున్నాడు. శనివారం జరిగే సెమీఫైనల్లో జకోవిచ్ రెండో సీడ్.. కార్లోస్ అల్కరాజ్‌తో తలపడనున్నాడు. ఈ విజయానంతరం జకోవిచ్ శంఖారావం చేశాడు. తన కూతురు బర్త్‌డే కానుకగా ఈ విజయాన్ని అందించాడు. విజయం సాధించిన వెంటనే శంఖారావం చేస్తూ ఫోజిచ్చిన జకోవిచ్.. ఆ తర్వాత ఒళ్ళు పులకరిస్తూ..బ్రేక్ డ్యాన్స్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.




## బెంగళూరు తొక్కిసలాట.. మౌనం వీడిన విరాట్ కోహ్లీ!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) విజయోత్సవ వేడుక విషాదంగా ముగిసిన విషయం తెలిసిందే. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత టైటిల్ గెలిచిన ఆర్‌సిబి.. బెంగళూరు వేదికగా విజయోత్సవ వేడుకలను ఏర్పా టు చేసింది. అయితే చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోగా.. 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం ఆర్‌సిబి ఫ్రాంచైజీతో పాటు ఆర్‌సిబి ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేసింది. ఆర్‌సిబి కేర్స్ ద్వారా అభిమానులకు అండ గా ఉంటామని ప్రకటించింది. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. 'జూన్ 4, 2025న మా గుండె పగిలింది. ఆ రోజు ఆర్‌సిబి కుటుంబంలోని 11 మంది సభ్యులను మేము కోల్పోయాం. వారంతా మాలో భాగమే. ఆర్‌సిబిని ప్రత్యేకంగా తీర్చిదిద్దడంలో వారిది కీలక పాత్ర. వారు లేని లోటు పూడ్చలేనిది. ప్రతీ ఒక్కరిలోనూ వారి జ్ఞాపకాలను చూసుకుంటాము. మా తొలి అడుగుగా వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు నష్టపరిహారంగా ఇచ్చాం. కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా భవిష్యత్తులో వారికి అన్ని విధాలుగా సపోర్ట్‌గా ఉంటాం. అందుకోసం ఆర్‌సిబి కేర్ పని చేస్తుంది.' అని ఆర్‌సిబి ఫ్రాంచైజీ ఓ ప్రకటనను విడుదల చేసింది.తొక్కిసలాట ఘటన అనంతరం ఇంగ్లాండ్ వెళ్లిపోయిన కోహ్లీ.. తాజాగా విచారం వ్యక్తం చేశాడు. 'జూన్ 4న హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. జీవితంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు. మా ఫ్రాంచైజీ చరిత్రలోనే అత్యంత సంతోషకరమైన క్షణం విషాదంగా మారింది. ప్రాణాలు కోల్పోయిన అభిమానుల కుటుంబాల కోసం, గాయపడిన వారికి కోసం తీవ్రంగా ఆలోచిస్తున్నాం. వారి కోసం ప్రార్థిస్తున్నాం. మీకు కలిగిన నష్టం మాలో భాగం. ఇక నుంచి జాగ్రత్తగా.. గౌరవంగా, మరింత బాధ్యతతో కలిసికట్టుగా ముందుకు సాగుదాం.'అని విరాట్ కోహ్లీ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలను ఆర్‌సిబి షేర్ చేసింది.

## ఫోకస్





## చరిత్రకు దర్పణం.. ఈ మ్యూజియం



గిజా పిరమిడ్స్ సమీపంలో, నిర్మాణం దాదాపుగా పూర్తికావస్తున్న 'గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం' చరిత్రకు దర్పణంగా నిలవనుంది. చరిత్రను తెలుసుకోడం, భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవడం ప్రతి తరానికీ అత్యవసరం. ఇదే లక్ష్యంతో, సుమారు ఒక బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,000 కోట్లు) పెట్టుబడితో నిర్మించిన ఈ మ్యూజియం, ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రజలకు సందర్శనార్థం అందుబాటులో ఉంటుంది. దీని నిర్మాణానికి రెండు దశాబ్దాల కాలం పట్టిందంటే, ఎంత జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారో అర్థమవుతుంది. 'గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం' ఉన్న గిజా పిరమిడ్స్ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. సాధారణంగా ఆయా ప్రాంతాలతో సంబంధం లేకుండా, మ్యూజియంలు సుదూర ప్రాంతాల్లో ఉంటాయి. కానీ, గిజా వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం నిర్మించడం ఓ అద్భుతం. ఇందులో 100,000కి పైగా పురావస్తు తవ్వకాల్లో లభించిన వస్తువులు, నిర్మాణాలు, ఆకృతులను ప్రదర్శించనున్నారు. ఇవి ఈజిప్ట్ జనరాల చరిత్ర, సంస్కృతి, జీవనవిధుల విశిష్టతను వివరిస్తాయి. ఈజిప్ట్ యువ రాజు టుటన్ఖామెన్ సమాధి నుండి లభించిన అన్ని అలంకరణలు, బంగా రు నగలు, పీఠాలు మొదలైనవి కూడా ప్రదర్శనలో ఉంటాయి. వీటిలో చాలా వాటిని ప్రజలు తొలిసారి చూస్తారు. ఆధునిక శిల్పకళతో, భారీ గ్లాస్ వాల్‌లు, ఇన్ఫినిటీ వ్యూ కలిగిన డిజైన్‌తో, ఇటుక, బాలువురు స్టోన్‌లను ఉపయోగించి నిర్మించారు. ఇందులో బొమ్మలు, ఫరావో మమ్మీలు, ఐడియోగ్రామ్స్, పురాతన ఎగిప్షియన్ విగ్రహాలు, చాపలు, మమ్మీలు, ఎగిప్షియన్ కళ సంకేతాలను చూడొచ్చు. వీటితో పాటు డిజిటల్ ప్రదర్శనలు, హాలోగ్రామ్ వ్యవస్థలతో, విజిటర్‌కు సృజనాత్మక అనుభూతి కలిగిస్తాయి. విద్యార్థులు, పరిశోధకులకు ప్రత్యేకంగా డ్రాంగ్ హాల్స్, లైబ్రరీలు కూడా ఉన్నాయి. ఇలాంటి పురావస్తు ప్రదర్శన శాన ప్రపంచంలో మరొకటి లేదనడం అతిశయోక్తి కానేకాదు. దీనికి పర్యాటకుల తాకిడి విపరీతంగా ఉంటుందని, ఈజిప్టుకు అధిక లాభాలు తెచ్చిపెడుతుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ఈజిప్టు నాగరికత గురించిన లోతైన అధ్యయనాలు జరుగుతాయి. విస్తృతమైన సమాచారం ప్రపంచానికి తెలుస్తుంది. ప్రపంచాన్ని ఆకట్టుకునే ఈజిప్ట్ సంస్కృతి, చరిత్ర, శిల్పకళను ఒకేచోట చూపే ఓ అరుదైన కేంద్రంగా ఇది తన ప్రత్యేకతను చాటుకుటుంది. 'గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం' ఆధునికత, చరిత్ర ప్రాముఖ్యతను ఒకే చోట కలిపిన అద్భుత ప్రపంచ వారసత్వ కేంద్రంగా చెప్పుకోవచ్చు.

## పోర్చుగల్‌లో పురాతన కట్టడాలు






రోమన్ సామ్రాజ్యం పరఢవిల్లిన కాలంలో, నేటి పోర్చుగల్ ప్రాంతంపై రోమన్లు క్రీస్తు పూర్వం 19వ శతాబ్దంలో దాడి చేసి, వశపరచుకున్నారు. ఆ తర్వాత అక్కడి ప్రాంతంలో నాగరికత విలసిల్లిందనే వాదన ప్రాచుర్యంలో ఉంది. అయితే, ఆ అభిప్రాయం తప్పని, పోర్చుగల్‌లో నాగరికత అంతకంటే ముందుకాలంలోనే విరాజిల్లిందని కొత్త అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వాయువ్య పోర్చుగల్‌లోని సిటానియా డీ బ్రిటెరోనా పర్వతంపైన ఉన్న కోట, దాని చుట్టుపక్కల గల ఇతర నిర్మాణాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ప్రాచీన కాస్ట్రో సంస్కృతికి కూడా ఈ ప్రాంతం ఒక కీలకమైన కేంద్రంగా నిలిచిందని పరిశోధకులు పేర్కొంటున్నారు. వారి తాజా అధ్యయనాన్ని అనుసరించి, ఇక్కడ నివసించిన వారు ఆ కాలంలోనే ఆధునిక నిర్మాణ కళ, ఇంజనీరింగ్‌లలో విశేష నైపుణ్యాలు ప్రదర్శించారు. ముఖ్యంగా, ఇక్కడ ప్రజల చేత నిర్మితమైన ప్రాచీన స్నానశాల ఉంది. ఈ స్నానశాల సమాజ గ్రామీణ జీవితం, సంస్కృతిలో ముఖ్య పాత్ర పోషించింది. దీనిని కట్టడం కోసం విశాలమైన రాతి పలకలను, నీటి నిర్వహణ వ్యవస్థను ఉపయోగించారు. రోమన్ ఆక్రమణ తరువాత కూడా, అక్కడి ప్రాంతీయ స్వాతంత్ర్యం చెక్కుచెదరలేదు. రోమన్ల ప్రభావం ఎక్కువగానే ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో ప్రజలు తమ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించారని అక్కడ గుర్తించిన పలు కట్టడాలు నిరూపిస్తున్నాయి. 'కాస్ట్రో సంసకృతి'కి సిటానియా డీ బ్రిటెరోజ్ పట్టణం నిలయంగా కనిపిస్తున్నది. అక్కడి నిర్మాణాలు, కళలలో కాస్ట్రో సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ప్రస్తుత పరిశోధన ద్వారా ఈ ప్రదేశం ఆ భావాలను, ఆ కాలపు జీవనశైలిని తెలుసుకోవడానికి అవకాశం కల్పించింది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ ప్రదేశం పోర్చుగల్‌లోని పూర్వకాలిక సాంస్కృతిక, పూర్వరోమన్ చరిత్రకు గొప్ప సాక్ష్యం. ఇది పురాతత్వవేత్తలు, సందర్శకులకు అందుబాటులో ఉండి ఆ కాలం జీవన విధానాన్ని నేరుగా అనుభవించడానికి అవకాశం కల్పిస్తున్నది. ప్రపంచ గొప్ప పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా ఎదుగుతున్నది.



## పత్తిపై దిగుమతి సుంకాన్ని ఎత్తేయాలి

### రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్



**ప్రజాపక్షం/కొడంగల్:** కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి రైతుల జీవనోపాధికి వినాశకరంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం పార్టీ కార్యకర్తలతో కలిసి రైతులకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలనే పలు డిమాండ్‌లతో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసే నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 50 శాతం వరకు దిగుమతి సుంకాన్ని తిరిగి విధించాలని కోరారు. రైతులకు అనుకూలంగా ఉండే చట్టపరమైన చట్టాలను తీసుకురావాలని సూచించారు. పత్తి రైతులకు న్యాయం చేయాలంటే పత్తి కార్పోరేషన్ ఆఫ్ ఇండియా యొక్క తక్షణ పునర్నిర్మాణం చేసి చెల్లింపుతో తగిన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రత్యేకమైన సహాయ ఫ్యాకేజిని ప్రారంబించడం వల్ల 25 లక్షల రూపాయల పరిహారం అందుతుందన్నారు. రైతుల పిల్లలకు పూర్తి విద్య సహాయం జీవనోపాధి కల్పించాలన్నారు. రైతులను అదుకునేందుకు పంట రుణాలు, వ్యవసాయ పరికరాలు, యంత్ర రుణాలు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాబ్యానాయక్, శంకర్‌నాయక్, లోక్యానాయక్, మోహన్‌నాయక్, జైపాల్, శివకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నా

## కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/జైనూర్ :** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. జైనూర్ సిహెచ్‌సి హాస్పటల్‌లో గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులు బుధవారం తాత్కాలికంగా సమ్మెను విరమించుకున్నారు. ఆస్పటల్ సూపరింటెండెంట్ అశోక్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ గణేష్, ఎఐటియుసి నాయకులతో చర్చలు జరిగాయి. చర్చల్లో సెప్టెంబర్ 20లోపు పెండింగ్‌లో ఉన్న ఇపిఎఫ్, ఇఎస్ఐ కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమణ చేసినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టివివిపి, డిఎంఇ పరిధిలో పనిచేస్తున్న మెడికల్ కాలేజీల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాలుగు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి, కార్మికులు మారుతి, దేవురావు, సందీపు, పరమేశ్వర్, రాహుల్ రంభ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు పోరాటాలు

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలు చేయాలని, ఈ నెల 8న జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి కాంతయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల 70వేల కోట్లు కేటాయించి, కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి, రోజువారి వేతనం 700 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతంలోని మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీ పనిని విస్తరించాలని, పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కేంద్రం వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి బలహీన వర్గాలపై, మహిళలపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రూ.12 వేలు ఇవ్వాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్ పెంచాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ రూ.6000 ఇవ్వాలని, మహిళలకు గృహలక్ష్మి పథకం అమలు జరిపి నెలకు రూ.2500 ఇవ్వాలన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని, స్థలాలు లేనివారికి స్థలాలిచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. వ్యవసాయ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ ఉషయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.వెంగళయ్య, నాయకులు వేముల బుచ్చయ్య, ఎండి జానీ మియా, ఉప్పునూతల రమేష్, శంకర్‌నాయక్, లాలయ్య, ఇంజమూరు నరసింహ, వల్లపు పెంటయ్య, జి.పెద్ద నరసింహ, దొటి బిక్షం పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉధృతం

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్

**ప్రజాపక్షం/చేర్యాల :** విద్యారంగం సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉదృతం చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్థన్ పేర్కొన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎంఆర్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ పతాకాన్ని సమాఖ్య మాజీ రాష్ట్ర నాయకులు మంద పవన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిండెట్ రామగాళ్ల నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్, గర్ల్స్ కన్వీనర్ శిరీష, చేర్యాల మండల కార్యదర్శి యాసీన్, మాజీ విద్యార్థి నాయకులు అందె అశోక్, ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆర్థిక సంక్షోభంలో పత్తి రైతులు



**ప్రజాపక్షం/నర్సంపేట :** కేంద్ర ప్రభుత్వ దివాలా కోరు విధానాలతో దేశీయ పత్తి రైతులు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడున్నారని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపుమేరకు రైతు సంఘాల ఆధ్వర్యంలో నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఎస్‌కెఎం డివిజన్ కన్వీనర్ కోరబోయిన కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో జిల్లా కన్వీనర్ కుసుంబ బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పంటలకు కనీసం మద్దతు ధర కల్పించాల్సింది పోయి కార్పోరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు, దళారులకు, మార్కెట్ వ్యవస్థను ధారధత్తం చేసి రైతులు వ్యవసాయం చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే పత్తి దిగుమతులపై ఎత్తివేసిన సుంకాలను రద్దుచేసి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పత్తికి కనీస మద్దతు ధరను నిర్ణయించి రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు కనీసం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌కెఎం డివిజన్ కన్వీనర్ కేశెట్టి సదానందం, యుపిఎన్ఎం జిల్లా కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రైతు సంఘం జిల్లా డివిజన్ నాయకులు నాగెల్లి కొమురయ్య, అయిత యాకయ్య, ఎస్‌కె.అన్వర్, కట్కూరి శ్రీనివాసరెడ్డి, కర్నే సాంబయ్య, అనుమాల రమేష్, పిట్టల సతీష్, పాత్కాల సుధాకర్, జిలకర సుదర్శన్, నీరటి బాల కొమురు, బానోతు సమ్మయ్య, గౌరబోయిన అశోక్, వెంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు

### దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు
### నవంబరులో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు
### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌వి.స్టాలిన్
### ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధనం విద్యని, ఆ విద్యనే నేటి పాలకులు భ్రష్టు పట్టిస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్‌వి స్టాలిన్ విమర్శించారు. బుధవారం స్థానిక హరిత ఇందూర్ ఇన్ సమావేశ మందిరంలో నగరంలోని విద్యావేత్తల, పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు, ఎఐఎస్‌ఎఫ్ పూర్వ నాయకులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులతో, మేధావులు తదితర అన్ని వర్గాల వారితో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభల సన్నాహక సమావేశాన్ని సభాధ్యక్షుడిగా ఎస్సెస్సార్ విద్యాసంస్థల అధినేత మారయ్యగౌడ్, కార్యవర్గ సభ్యులు రఘురాం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్టాలిన్ మాట్లాడుతూ సమస్యల సుడిగుండంలో, సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేని నిస్సహాయక స్థితిలో పాలకవర్గాలు ఉన్నాయన్నారు. దేశ సమగ్రతపై విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్‌ఎఫ్ అని, జిల్లాలో నవంబర్ 20–22 తేదీలలో మూడు రోజుల పాటు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం 2020 పేరుతో విద్యా కార్పోరేటీకరణ, విద్యా కేంద్రీకరణ, కాషాయీకరణ చేయాలని చూస్తుందన్నారు. విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం స్వాగతం పలుకుతోందని , పాలకులు ప్రపంచ బ్యాంకు సలహాలపై ఆధారపడి ప్రభుత్వాలు భాగస్వామ్యమనే పద్ధతిలో విద్యా వ్యాపారానికి పచ్చజెండా ఊపాయన్నారు. రాష్ట్రంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితిలో ఉందన్నారు. ఇప్పటికే వివిధ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల కాకపోవటంతో కళాశాల నుంచి సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని తద్వారా వారు చదువులు ముందుకు సాగడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు వేదిక కానున్నాయని, ఈ మహాసభలు మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించుకోవడం సంతోషకరమని, మహాసభల విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకురాలు పశ్య పద్మ మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశ స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అని 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్ లక్నోలో ఎఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించి 90 సంవత్సరాలుగా దేశ సమగ్రతపై ప్రభుత్వ విద్య పరిరక్షణకు విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్‌ఎఫ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సుధాకర్, భూమయ్య, ఓమయ్య, రామరావు, మారయ్యగౌడ్, రజనీకాంత్, ప్రవీన్, శ్రీకాంత్, అనిల్, రాజుగౌడ్, శ్యాంబాబు, రాజశేఖర్, భానుప్రసాద్, కిరణ్, రామకృష్ణ, నాగజ్యోతి, రమేష్, కైలాష్, సుబోధ్ కుషాల్, బాధ్యులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సన్నబియ్యం సరఫరా సాఫీగా జరగాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ :** సన్నబియ్యం సరఫరా సాఫీగా జరగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం పట్టణంలోని రేషన్ షాప్ నెంబర్ 18 డీలర్ దాసి స్వరూప, షాప్ నెంబర్ 7 డీలర్ ఆకుల బాలనీల రేషన్ షాపులను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బియ్యం సరఫరా విషయాలు, బియ్యం క్వాలిటీ గురించి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన రేషన్ కార్డు దారులు సన్న బియ్యం పొందాలన్నారు. డీలర్లు అందరు ప్రభుత్వ నియమ నిబందనలకు అనుగుణంగా సమయ పాలన పాటిస్తూ రేషన్ షాపులు సకాలంలో తెరిచి లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సన్నబియ్యం పంపిణి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎస్వో ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్, డీటీసీఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాకతీయుల కళా సంపద అద్భుతం

కలెక్టర్ తో కలిసి కోటగుళ్ల సందర్శన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాకతీయుల నాటి కళా సంపద నిర్మాణాలు ఎంతో అద్భుతమని భారత విదేశాంగ శాఖకు చెందిన సాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్ కె రెడ్డి, ఐఎఫ్ఎస్, బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగాని, ఐఎఫ్ఎస్ ఉన్నతాధికారులు కొనియాడారు. బుధవారం కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గణపతి, నందీశ్వర, గణపేశ్వర, పూజలను శాస్త్రక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం తాళ్లపల్లి యాదగిరి గౌడ్ అధికారుల బృందానికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివ ద్వారా పాలక విగ్రహాలను చూసి ఫోటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు అధికారుల బృందాన్ని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపురం తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

## పోచన్నపేటలో రూ.5లక్షల ఆసరా డబ్బులు గల్లంతు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పోచన్నపేటలో రూ.5లక్షల ఆసరా డబ్బులు గల్లంతయ్యాయి. దీంతో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అందాల్సిన ఆసరా డబ్బులు అందకపోవడంతో బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచన్నపేట గ్రామంలోని తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న నాగయ్య పోస్ట్‌మెన్‌గా గ్రామంలో కొన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీన పెన్షన్ దారులకు అందాల్సిన డబ్బులు సంబంధిత బచ్చన్నపేట పోస్టాఫీస్ నుండి రూ.5లక్షలను తీసుకొచ్చి టప్పాదారుడైన రాకేష్ పోచన్నపేట పోస్టాఫీస్‌కు వచ్చి పోస్ట్‌మెన్ నాగయ్యకు అప్పగించినట్లు తిరిగి ముట్టినట్లు రిసీవ్ రసీద్ తీసుకున్నట్లు చెప్తున్నారు. డబ్బులు ఇచ్చి రిసీవ్ తీసుకున్నట్లు రాకేష్ చెప్పడం, అసలు నాకు డబ్బులే ఇవ్వలేదని పోస్ట్‌మెన్ నాగయ్య చెప్పడం జరుగుతుంది. వీరిద్దరి మధ్య జరిగిన గల్లంతు విషయం పోలీస్ ఫిర్యాదు వరకు వెళ్లాయి. అసలు డబ్బులు ఎలా గల్లంతైనట్లు పెన్షన్ దారులకు ఆసరా డబ్బులు అందిస్తారా లేదా అని అయోమయంలో గ్రామంలోని వృద్దులు, వికలాంగులు, వితంతువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ చుట్టూ వృద్దులు చక్కర్లు కొడుతున్నారు. ఏది ఏమైనా రూ.5లక్షల డబ్బులు గల్లంతైన విషయమై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## హత్య కేసులో ఇదరు నిందితులు అరెస్ట్

హత్య వివరాలను వెల్లడించిన ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో దారుణ ఘటనకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలను ఎస్పీ వెల్లడించారు. జిల్లాలోని చిట్యాల మండలం ఒడి తల గ్రామానికి చెందిన కప్పల కవిత తన భర్త కప్పల కుమారస్వామి పక్షవాతంతో బాధపడుతుండగా, అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు జంజర్ల రాజ్ కుమార్ తో వివాహేతర సంబంధం పెట్టుకున్న నట్లు తెలిపారు. ఈ వివాహేతర సంబంధం గురించి తెలుస్తుందని భర్తను జూన్ 25న చంపి గుండెపోటుతో చనిపోయాడని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేసినట్లు తెలిపారు. వివాహేతర సంబంధం విషయం కూతురికి కూడా ఎలాగైనా తెలుస్తుందని, ప్రియుడితో కలిసి వర్షిణి(22)ను కూడా హత్య చేసి మృతదేహాన్ని భూపాలపల్లి కాటారం హైవే పక్కన కమలాపూర్ క్రాస్ రోడ్ అడవిలో పడేసి, చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లి ఆధార్ కార్డు పెట్టి క్షుద్ర పూజలు చేసినట్లుగా నమ్మిచ్చే ప్రయత్నం చేసినట్లు ఎస్పీ తెలిపారు. కాటారం డిఎస్పి సూర్యనారాయణ సీఐ నాగార్జున రావులు దర్యాప్తులో కవిత తీరుపై అనుమానం వచ్చి ఆరా తీయగా విస్తుపోయే నిజాలు వెలుగు చూసినట్లు తెలిపారు.2 నెలల క్రితం ప్రియుడితో కలిసి భర్తను, ఇప్పుడు కూతురిని హత్య చేసినట్లు ఒప్పుకున్న కవిత ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుమార్ లను మలహర్ మండలం గంగారం క్రాస్ రోడ్ వద్ద టీవీఎస్ ఎక్సెల్ పై వెళ్తుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రియుడి రాజ్ కుమార్, కవితలపై కాటారం చిట్యాల పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో భర్తను చంపిన విషయంపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్పి వెల్లడించారు. ఈ సమావేశంలో కాటారం డిఎస్పి సూర్యనారాయణ సీఐ నాగార్జున రావు ఎస్సైలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి అన్నారు.బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా తీసుకోవడానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులకు త్రాగు నీరు,చాయ్ అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని రైతులకు ఇబ్బందులు కాకుండా తగు చర్యలు చేపడుతుందని అన్నారు.రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిన మాట వాస్తవమేనని రాబోవు రోజుల్లో యూరియా కొరత ఏర్పడకుండా దానిని పరిశ్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.మండల రైతుల అభివృద్ధికి కోసం తనశాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ కుమ్మరి రాజబాబు,సిబ్బంది పాల్గొన్నారు.

# గండి రామారం కుడి కాలువ ప్రారంభం

రూ. 29 కోట్లతో కాలువ నిర్మాణం

పూర్తిచేయించిన ఎమ్మెల్యే కడియం





**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యంత కరవు ప్రాంతమైన జనగామ నేడు రాష్ట్రంలోనే ఎక్కువ వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్న జిల్లాగా మారిందని దానికి కారణం దేవాదుల ఎత్తిపోతల పథకమే అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గండి రామారం(మల్లన్న గండి) రిజర్వాయర్ నుంచి రూ. 29 కోట్లతో నిర్మించిన కుడి కాలువ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలువను ప్రారంభించి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎడారి లాంటి పరిస్థితుల్లో జీవిస్తున్న రైతుల సంక్షేమ కోసం ఇంత భారీ ఎత్తున నీటిని విడుదల చేయడం నిజంగా ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఇది కేవలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కాదు.. వందలాది కుటుంబాలకు కొత్త జీవం పోసే అభివృద్ధి అన్నారు. రైతు క్షేత్రంలో పచ్చదనం కాసేలా చేసిన ఈ సాహసం అనుభవజ్ఞుడైన నాయకుడు కడియం శ్రీహరికే సాధ్యమన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కడియం శ్రీహరి ఎప్పుడు సీఎంని కలిసినా అంతే అభిమానంతో నిధులు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 800 కోట్లతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు.

**రూ. 1015 కోట్లతో 6 పనులు ఆమోదం**

గత ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేవాదుల ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి కాలువల వెంట తిరుగుతూ వెంటపడి పనులు చేయిస్తున్నానన్నారు. దేవాదుల 3వ దశ 6వ ప్యాకేజీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 78 వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉందని ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీకెళ్లగానే సవరించిన అంచనాలతో రూ. 1015 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారన్నారు. ఏడాది లోపు ప్యాకేజీ 6 పనులు పూర్తి చేస్తామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం మాత్రమే కాదు ఉమ్మడి జిల్లా అభివృద్ధి చేయడం నా బాధ్యతగా భావిస్తున్నారు.

**నియోజకవర్గ అభివృద్ధికి రూ. 1000 కోట్లు**

ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్ల నిధులు తీసుకొచ్చానని, ఉమ్మడి జిల్లాలోనే ఏ నియోజకవర్గానికి ఇన్ని నిధులు రాలేదన్నారు. వెయ్యి ఎక్కడ వచ్చాయని అడిగే వారికి ప్రతీ పని వివరాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఘన్‌పూర్ నుంచి నవాబ్‌పేట వరకు ప్రధాన కాలువతో పాటు ఉప కాలువలకు సీసీ లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అశ్వరావుపల్లి కుడి కాలువ పనులు అసంపూర్తిగా ఉండటంతో కాలువ వెంట తిరిగి పనులు పూర్తిచేసి జీడికల్ వరకు నీళ్లు తీసుకెళ్లామన్నారు. గండి రామారం నుంచి చిల్పూర్, వేలేరు మండలాలకు సాగు నీరు అందించేందుకు 104 లిఫ్ట్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, లావణ్య శిరీష్‌రెడ్డి, = శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రావు, నరేందర్‌రెడ్డి, సుధీర్, ఈఈ వినయ్, డీఈ సంపత్, మధుసూదన్‌రెడ్డి, చల్ల సుధీర్ రెడ్డి, బేతి జైపాల్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## సైన్స్ ల్యాబ్‌తో సృజనాత్మకత: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** సైన్స్‌ల్యాబ్‌లు విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తాయని, అలాగే వారి సొంత ఆలోచనలను రూపొందించుకోవడంలో సైన్స్‌ల్యాబ్‌లు సహాయపడుతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పెంబర్తిలో ఎన్‌జీవోలు ముందుకు వచ్చి రూ.15లక్షల ఖర్చుతో ఏర్పాటుచేసిన సైన్స్‌ల్యాబ్‌లను ఎన్‌జీవో ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులకు సొంత ఆలోచనలను రూపొందించుకోవడానికి వాటిని వాస్తవ ప్రపంచంలో ఆచరణీయంగా మార్చడానికి సైన్స్‌ల్యాబ్‌లు అవకాశాలను అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి రమేష్, అట్లాస్ ప్రతినిధులు, పాఠశాల హెచ్‌ఎం నాగరాణి, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 5న జిపిఓలకు నియామకపత్రాలు జారీ

**ప్రజాపక్షం/వరంగల్ :** గ్రామ పరిపాలన అధికారులుగా ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలు అందుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిసిఎల్‌ఏ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ సూచించారు. బుధవారం హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఈ వీసీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ మాట్లాడుతూ. భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీఓల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పరీక్ష నిర్వహించిందని తెలిపారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అన్ని జిల్లాల్లో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాకు సంబందించి 165 మంది గ్రామ పరిపాలనాధికారులుగా నియామక పత్రాలు తీసుకోనున్నారని... ఇందుకు తగ్గ పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తు తగు చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విసిలో డిఆర్‌వో విజయలక్ష్మి , కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ తరగతి గదిని ఎమ్మెల్యే తిరుగుతూ విద్యార్థుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకున్నారు. గత పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని కొత్త ఆర్వో ప్లాంట్ కావాలని, వేడి నీటి కొరకు గ్లీజర్, మూడు నెలల నుండి కాస్మోటిక్ సామాగ్రి ఇవ్వడం లేదని, డిజిటల్ క్లాస్ రూమ్స్ కావాలని, క్రీడా సామాగ్రి, దోమలు రాకుండా కిటికీలకు మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు కూడా సరిగా తిరగడం లేదని తదితర సమస్యలను ఎమ్మెల్యేకు విద్యార్థులు తెలిపారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే ఏటూరునాగారం ఐటిడిఏ పీఓకు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. సమస్యలను వీలైనంత త్వరగా ఎస్టిమేట్స్ వేసి పనులను ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని కోరారు. విద్యార్థుల వసతి గృహాన్ని పక్కనున్న భవనంలోకి మార్చాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ సంపత్ రావు, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, సాంబమూర్తి, మహేందర్,తోట రంజిత్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణను దోచుకున్న బిఆర్ఎస్ నేతలకు బుద్ధి చెప్పాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉద్యమం పేరుతో తెలంగాణాను దోచుకున్న బీఆర్ఎస్ నేతలకు బుద్ధి చెప్పాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షులు,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. 1200 మంది తెలంగాణ విద్యార్థుల ఆత్మలు కవిత రూపంలో మాట్లాడించాయని, నిజం మాట్లాడని నేతలు బిఆర్ఎస్ పార్టీలో కోకొల్లలుగా ఉన్నారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న సొమ్ములను పంపకంలో వచ్చిన పంచాయతీ ఇది అని, పదేళ్ల క్రింద మీ ఆస్తులు ఎంత.. ఇప్పుడు వారి ఆస్తులు ఎంతనో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం బీఆర్ఎస్ హయాంలో కట్టింది వాస్తవమే,కూలింది కూడా వాస్తవమేనని, కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములయిన అధికారుల ఇళ్ళలో సోదాలు చేస్తే వందల కోట్ల రూపాయల దొరికింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ట్రిబుల్ షూటర్ హరీశ్ రావు నాయకత్వంలో ప్రజల ఆస్తులను ట్రబల్ లో పెట్టారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత తన ఆరోపణలలో వాస్తవం ఉంటే సిబిఐ విచారణకు సాక్ష్యంగా ఉండాలన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి వాదిస్తోందని, బినామీల పేర్లతో లక్షల కోట్ల అవినీతి బిఆర్ఎస్ నాయకులు చేశారని అన్నారు. మొదటి నుంచి తాను మాట్లాడినప్పటికీ రాజకీయ అభియోగం అన్నారని, తెలంగాణ స్వలాభం కోసం మాట్లాడితే రేవంత్ రెడ్డిని చంద్రబాబు శిష్యుడు అని అంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,పులి అనిల్ ,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో అభివృద్ధి పనులు త్వరితగతినగా పూర్తి

కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ములుకనూరులోని మోడల్ స్కూల్ సమీపంలో గ్రామంలోని మురుగు కాలువల ద్వారా వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిల్వ కారణంగా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని మోడల్ స్కూల్ సమీపంలో ఇటీవల మంజూరై ఉన్న ఇంకుడు గుంతలను నిర్మించనున్న స్థలాన్ని, మోడల్ స్కూల్లో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను, పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లను, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ సమీపంలో గ్రామంలో నుండి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించగా వారి ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి పనులను మంజూరు చేయగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామానికి చెం దిన లబ్ధిదారుతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి సామగ్రి వివరాలు, బిల్లులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ అడిగి తెలుసుకుని ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్షయపాత్ర నుండి వస్తున్న భోజనం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారాం, డీఈ శిరీష, స్థానిక తహసీల్దార్ రాజేష్, వీరేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గణనాధుల నిమజ్జనం ఘనంగా జరుపుకోవాలి: ఎస్‌పి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఈనెల 5వతేదీన నిర్వహించనున్న నిమజ్జనం కార్యక్రమాన్ని కూడా ఘనంగా, మరింత ప్రశాంతంగా భక్తిపూర్వక వాతావరణంలో నిర్వహించుకుందామని, గణపయ్యకు ఘనమైన వీడ్కోలు పలుకుదామని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ గారు జిల్లా ప్రజలకు, వినాయకమండప నిర్వాహకులకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవం జరిగే నిజాం చెరువును జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి ఉత్సవాలను ఎంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారో మండప నిర్వాహకులు నిమజ్జనం కూడా అంతే ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. నిమజ్జనోత్సవ శోభాయాత్రల పైన నిరంతర పోలీస్ నిఘా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు అతిక్రమించరాదని ఎస్పీ తెలిపారు. నిమజ్జన ప్రాంతాలలో అవసరానికి తగినట్లుగా క్రైన్ లు, గజఈతగాళ్ళు, సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు, టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్ఐ ప్రశాంత్ మరియు సిబ్బంది ఉన్నారు.

## ప్రధాన రహదారులకు శాఖా పరమైన అడ్డంకులు తొలగిస్తాం

ఎంపి బలరాం నాయక్



**ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ:** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికీ ఎల్లవేళలా కట్టుబడి ఉంటామని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ అన్నారు.బుధవారం కొత్తగూడ మండలంలోని శ్రీ గుంజేడు ముసలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.అనంతరం ఎంపి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని అన్నారు. శ్రీ గుంజేడు ముసలమ్మ ఆలయ అభివృద్ధికి తమ వంతుగా భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని భక్తుల సౌకర్యార్థం గుంజేడు దేవాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ప్రధాన రహదారులను త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా యూరియా పట్ల రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు సరిపగాయూరియా అందించేందుకు రాత్రి సమయంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన యూరియా మనకు సరిపడా రాకపోవడం వల్ల కొరత అనేది ఏర్పాడుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈసందర్భంగా అన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు మాజీ ఎంపిపి నూనవత్ రమేష్ నాయక మాధవ పెద్ది అమరేందర్ రెడ్డి సారయ్య నారాయణరెడ్డి సల్మాన్ పాష జిల్లా నాయకలు లావణ్య వెంకన్న నరేందర్ కళ్యాణ్ ఈర్య హలవత్ సురేష్ మహేందర్ పాల్గోన్నారు.

## మండలానికి 555 కొత్త రేషన్ కార్డులు మంజూరు

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత గల వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న క్రమంలో పది సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డక ఎదురుచూస్తున్న ప్రజలకు మొట్టమొదటిసారిగా కొత్త రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ ప్రారంభించింది. అందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలనికి మొదటి విడుతలో 555 నూతన రేషన్ కార్డులు మంజూరైనట్టు సమాచారం ఈ ప్రక్రియ నిరంత ప్రక్రియ అంటూన్న అధికారులు, అర్హత గల వారందరూ దరఖాస్తులు చేసుకుంటూనే ఉండాలని తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మైనర్ బాలికపై అత్యాచారయత్నం.. వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వైరా :** వైరాలో ఓ ఇంట్లో ఉన్న బాలికపై దుగ్గిరాల రత్తయ్య అనే 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేస్తూ బయటకు పరుగులు తీయడంతో పారిపోతున్న నిందితుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఖమ్మం జిల్లా వైరాలో ఓ ఇంట్లో వంట చేస్తున్న మైనర్ బాలికను గమనించి దుగ్గిరాల రత్తయ్య అనే వ్యక్తి(40) బండి తాళం ఇవ్వమంటూ ఇంట్లోకి చొరబడి బాలికను వెనుక నుంచి అసభ్యంగా శరీరాన్ని తాకుతూ ముద్దు పెట్టుకొని బలాత్కారానికి ప్రయత్నించడంతో బాలిక కేకలు వేస్తూ బయటకు పరుగు తీసిం ది. కేకలు విని చుట్టుప్రక్కల ఉన్న స్థానికులు వచ్చి చూడగా ఇంట్ల నుండి బయటికి పరుగు తీస్తున్న దుగ్గిరాల రత్తయ్యను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడు రత్తయ్య గతంలో కూడా కొంత మంది పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాలిక ఫిర్యా దు మేరకు వైరా ఎస్సై పి.రామారావు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గణేష్ మంటపం వద్ద అన్నదానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలో 26, 37వ డివిజన్ నందు శ్రీ శివశక్తి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ ఫాతిమా జోహరా పాల్గొని ప్రారంభించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను మేయర్ పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. బుధవారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగర అభివృద్ధితో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావూరి కరుణ సైదాబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి గరిక పూజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయకునికి గరిక పూజ నిర్వహించారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ వద్ద గల బాల గణపతి దేవాలయంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయకునికి గరిక పూజ నిర్వహించారు. పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని గరికతో వినాయకున్ని పూజించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బాజిన్ని వీరయ్య, ఈవో నర్సింహారావు, అర్చకులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు మండలం తిర్లాపురం గ్రామపంచాయతీ రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతన అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణానికి బుధవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, గుండగాని నాగేశ్వరరావు, సంకపెల్లి రవీందర్ రెడ్డి, ఎండి రహీం పాషా, సీతయ్య, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం అభినందనీయం



సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని అన్నదానం చేయడం అభినందనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం ఎస్‌సీ కాలనీలో ఫ్రెండ్స్ గణేష్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత దండి సురేష్ రాజేశ్వరి దంపతులు వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. వీరిని కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. నవరాత్రిలో చూపిన నిగ్రహాన్ని శోభాయాత్రలో సైతం చూపించాలన్నారు. అలాగే కామంచికల్‌లోని నాలుగోవార్డులో స్నేహ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సిమతి సభ్యులు దండి రంగారావు, ఘనపారపు వీరన్న, మామిడి సుదర్శన్‌రెడ్డి, వెన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం–వరంగల్ హైవేపై దారి దోపిడీ ముఠా హల్‌చల్

డ్రైవర్‌పై దాడి చేసి రూ.18వేలు వసూలు చేసిన దుండగులు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** దారిదోపిడి దొంగలు అంటే ట్రైన్లలో అడవుల్లో పోయే వాహనాలను ఆపి బెదిరించి డబ్బులు వసూలు చేసే ముఠాలను పేపర్లలో, టీవిలలో సినిమాల్లో చూశాం. ఇలాంటి సంఘటనలు తిరుమలాయపాలెం మండలంలో ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది డ్రైవర్లు వాహనాల్లో డీజిల్ పోతున్నా ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారు. లారీ డ్రైవర్ దిలీప్ ముచ్చుర్ తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుండి గుజరాత్ వైపు లారీ నెంబర్ జిజె36 వి 8373 ఖమ్మం–వరంగల్ హైవే నుండి బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో వెళ్తుండగా ఖమ్మం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీసిటీ దగ్గర నుంచి లారీని వెంబడించిన దుండగులు టిఎస్04 యుఇ 3405 నెంబర్ గల ఆటోలో నలుగురు, దిచక్ర వాహనంపై ఒకరు శ్రీ సిటీ వద్ద నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వెంబడించగా చింతపల్లి సమీపంలో లారీని నిలిపివేయగా డ్రైవర్‌ను లారీ ఆపకుండా వస్తున్నావ్ ఏందిరా అని కొట్టి నీ దగ్గర ఎన్ని డబ్బులు ఉన్నాయి మొత్తం ఇచ్చేయమని అడగగా డబ్బులు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారని, బెదిరిపోయిన డ్రైవర్ రూ.8వేలు నగదు ఇచ్చాడు. ఈ క్రమంలో లారీని నడుపుకుంటూ ముందుకు వెళ్లిన లారీ డ్రైవర్ తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజి వద్ద జిన్నింగ్ మిల్లు దగ్గరలో ఉన్న గుజరాతీ హోటల్‌లో లారీ ఆపివేసి ఉండగా మళ్లీ అదే దుండగులు అక్కడికి వచ్చి డ్రైవర్‌ను కొడుతూ ఇంకా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా నాదగ్గర క్యాష్ లేవని అని చెప్పగా ఫోన్ పే నుంచి కొట్టరా అంటూ బెదిరించగా నా ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉందని చెప్పడంతో క్యాంటీన్ ఓనర్ ఫోన్ నుంచి లారీ ఓనర్‌కు ఫోన్ చేసి రూ.10వేలు 9515605367 కత్తుల మోహన్‌చంద్ర అనే పేరుకు కొట్టడం జరిగింది. ఇదంతా మొదటి నుండి గమనిస్తున్న లారీ క్లీనర్ శ్రీ సిటీ నుంచి లారీని వెంబడించే వీడియోను జరిగిన సంఘటనలు మొత్తం తన ఫోన్లో రికార్డు చేశాడు. అనంతరం దుండగులు అక్కడి నుండి ఆటోలో మళ్లీ ఖమ్మం వైపు వెళ్తుండగా ఖమ్మం రూరల్ పోలీసులు ఏదులాపురం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వక్తులను గుర్తించి ఆటోలో రాడ్లు ఉండగా ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరుమలాయపాలెం పరిధిలో జరిగిన సంఘటనకు వాళ్లే కారణమని అని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాధితులు మాత్రం స్థానిక తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# యూరియా కట్ట కోసం 'వేకువ' నుంచే పడిగాపులు!

15 కేంద్రాలకు... 110 చొప్పున...
1650 కట్టలు సరఫరా
వందల సంఖ్యలో క్యూ కట్టిన రైతులు.. అందని వైనం.



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వం యూరియా సరఫరా పట్ల రైతులు మండిపడుతున్నారు. ఒక్క కట్ట కోసం తెల్లవారుజాము నుంచే కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు ఒక్క యూరియా కట్ట దొరకక రైతులు భగ్గుమన్నారు. మండలంలోని 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘాలతో పాటు యూరియా పంపిణీ కోసం మరో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ప్రతీ కేంద్రంకు 110 యూరియా కట్టలను సరఫరా చేసింది. కాగా ప్రతీ కేంద్రం కు వందలాది మంది రైతులు క్యూ కట్టారు. నేలకొండపల్లి, నాచేపల్లి, రాజారాంపేట తదితర కేంద్రాల వద్ద ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుకాచారు. అయితే రైతుకు ఒక్క కట్ట మాత్రమే పంపిణీ చేశారు. వందలాది మంది రైతులకు అధికారులు కూపన్లు జారీ చేశారు. వచ్చిన 110 కట్టలకు గాను.... దాదాపు 200 మందికి పైగా కూపన్లు జారీచేశారు. ఉన్న స్టాక్ అయిన తరువాత రైతులు నిలదీశారు. కట్టలు లేనప్పుడు ఎందుకు కూపన్లు జారీ చేశారు అంటూ అధికారులను నిలదీశారు. దీంతో పలు చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీస్ పహారా నడుమ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం ఆర్డీవో నరసింహారావు మండలం లోని మోటాపురం, రాజేశ్వరపురం కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడారు.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా రైతుకు కనీసం మూడు కట్టలు అందించాలని మోటాపురం సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు, బెల్లం శ్రీనివాసరావులు ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆర్డీవో అధికారులకు పలు సూచనలు చేశారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అప్రమతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల వ్యవసాయాధికారి యం.రాధ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు భవాని, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రాస్తారోకో



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో బుధవారం యూరియా కోసం రైతులు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని రైతులకు ప్రభుత్వం సరిపడ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రోజుల తరబడి వ్యవసాయ పనులు మానుకొని సోసైటీ కేంద్రాల వద్ద పడి గాపులు కాస్తున్నా యూరియా దొరకని పరిస్థితి నెలకొందని ఇప్పటికే మొక్కజొన్న చివరి దశలో ఉందని, అదునుకు యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సొసైటీ అధికారులు రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరారు.

# మణుగూరు గురుకులలో 'సం'క్షేమం ఏదీ?

తలుపులు లేని గదులు, కిటికీలు
తల్లిదండ్రులకు నో ఎంట్రీ !






**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ బొల్లోరుగూడెంలో గల మణుగూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ గురుకుల కళాశాల/పాఠశాలలో పలువురు విద్యార్థులు జ్వరాల భారిన పడుతున్నారు. గదులకు, కిటికీలకు తలుపులు లేకపోవటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫ్యాన్‌లు ఎప్పుడు తిరుగుతాయే, ఎప్పుడు ఆగిపోతాయే తెలియని పరిస్థితి నెలకొంది. పడుకున్నా దోమలు, కూర్చున్నా దోమలు అనే రీతిలో విద్యార్థులపై పడుతున్నాయి. దీనితో పలువురు విద్యార్థులు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల భారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గదులకు, కిటికీలకు తలుపులు బిగించకుండా పాఠశాల ప్రిన్సిపాల్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. సరైన మౌళిక సౌకర్యాలు లేకపోవటంతో పలువురు విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించటం లేదని తెలుస్తోంది. గదులకు తలుపులు లేకపోవటంతో చద్దర్లు కట్టుకొని పడుకుంటున్నారు. కనీసం మరుగుదొడ్లకు కూడా తలుపులు లేవంటున్నారు. తమ పిల్లలను చూడటానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థుల పేరెంట్స్‌ను కూడా లోపలికి అనుమతి లేదంటూ ప్రిన్సిపాల్ హుకుం జారీ చేస్తుండటంతో తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగి పోతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గత సోమవారం మణుగూరు సింగారం నుండి ఓ విద్యార్థి తండ్రి తన కుమారుణ్ణి చూసి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలనుకొని వచ్చాడు. సుమారు గంటకు పైగా వేచి చూడాల్సివచ్చిందని వాపోయాడు. విద్యార్థి పేరు వెల్లడిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని భయానికి లోనయ్యాడు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ సైతం సరైన రీతిలో అందించడం లేదని దీనిపై ప్రశ్నించిన విద్యార్థుల పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బందితో వేధింపులకు గురిచేస్తారనే వదంతులు విపిస్తున్నాయి. అంతా ఆయన తన ఇష్టారీతిన వ్యవహరిస్తారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వసతి గృహాన్ని పరిశీలించి మౌళిక వసతులు కల్పించాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న పాఠశాల ప్రిన్సిపాల్ పై తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

**అనుమతి లేదు :** ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్ కీసర నాగేశ్వరరావును వివరణ కోరగా ఎంతటి వారినైనా లోపలికి అనుమతించేది లేదు. ఇది ఉన్నతాధికారుల ఆదేశమన్నారు. ఏమైనా చేసుకోండని దురుసుగా సమాధానం ఇవ్వడం ఆయన నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఇక్కడ అన్ని వసతులు సరిగానే ఉన్నాయన్నారు.

## లంబాడీలపై కుట్ర




స్థానిక ఎన్నికల్లో సత్తా చూపిస్తాం
బంజారా అడ్వకేట్ జెఏసి నాయకుడు హరి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో లంబాడీలపై కుట్ర జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని బంజారా అడ్వకేట్ జేఏసి నాయకులు హరి నాయక్ డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరి నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన సందర్భంగా లంబాడీ నాయకులను, యువతను అరెస్టు చేశారని బేషరతుగా వారిని విడుదల చేయాలని కోరారు. లంబాడీలు ఎస్టిలు కాదంటూ తెల్లం వెంకట్రావు, సోయం బాబురావు కోర్టులో పిటిషన్ వేశారని ఇది చెల్లదని దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా చూస్తామని ఇల్లందు ఎంఎల్‌ఏ తనతో పేర్కొన్నారన్నారు. లంబాడీలను అశ్రద్ధ చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర చేస్తామన్నారు. ఈ బస్సు యాత్ర పాలేరు నుంచి ప్రారంభమవు తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబాడీల సత్తా చూపుతామన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఉద్యోగాలు కల్పించిన జివో 3ని కొట్టి వేసినప్పుడు ఆదివాసీ ఎంఎల్‌ఏలు ఎవరు మాట్లాడలేదని ఇప్పుడు మాత్రం గిరిజనుల మధ్య విద్వేషాలను పెంచుతున్నారన్నారు. కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో దరావత్ వీరన్న, దేవేందర్, శ్రీకాంత్, బానోత్ తులసీబాయి, నరేంద్ర నాయక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## చీపురు పట్టిన చదువుల తల్లులు!

బ్రాహ్మణపల్లి పాఠశాలలో విద్యార్థులే.. పనిమనుషులు



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బ్రాహ్మణపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే అందుకు వచ్చిన చిన్నారులైన బాలికలను పాఠశాల ఆవరణలో ఊడ్పించడం జరుగుతుంది. ఎవరైనా అడిగితే అంతా నా ఇష్టం నేను చెప్పిందే వేదం అని అంటాడు ఆ ఉపాధ్యాయుడు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులను ఎంత కష్టపెడుతున్నారో చూడండి. ప్రభుత్వం ఒక పక్క విద్యారంగానికి పెద్ద పీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాలనే దిశగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కనిపిస్తూ వారికి ఎలాంటి ఇబ్బంది కలగవద్దు అని చూస్తుం టే దానికి విరుద్ధంగా వైరా బ్రాహ్మణపల్లి 8వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పంతులుకు పట్టింపు లేదంట. ఆ విద్యార్థి నీళ్లతో ఉదయం పాఠశాలకు రాగానే పాఠశాల ఊడ్చిన తర్వాత తరగతులు వినాలంట. ఇదెక్కడ చోద్యం అని ఎవరైనా అడిగితే నా ఇష్టం నేను మీకు చెప్పాల్సిన అవసరం లేదు. మీడియా కాని, అధికార యంత్రాంగం కాని నన్నేమి చేయలేదు అనే వాదన ఆ ఉపాధ్యాయుడు వద్ద వినిపిస్తుంది. జిల్లా అధికారులు విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ యువకుడు తన ముందున్న టిప్పర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన జర్పుల చరణ్ (22) తన మోటార్ బైక్‌పై భద్రాచలం రోడ్ నుండి కొత్తగూడెం వైపునకు వెళుతున్నాడు. ఈ క్రమంలో పాల్వంచ నుండి దమ్మపేట సెంటర్ మీదుగా ములకలపల్లి వైపునకు వెళుతున్న టిప్పర్ లారీ మూలమలుపు తిరుతున్న సమయంలో వెనుకనుండి బలంగా ఢీకొనటంతో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద తండలో గల ప్రియదర్శిని ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డిఎస్పి ఫణిందర్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, సైబర్‌క్రైమ్ ఎస్‌ఐలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకబృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రూ.5 కోట్లు 'బొగ్గు'లో పోసిన పన్నీరేనా..?



కార్యాలయ నిర్మాణం సరే...
జిఎం నియామకమెప్పుడు..?
సింహభాగం బొగ్గునందించే సత్తుపల్లికి
జిఎం నియామకం ఇంకెప్పుడో..!

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కొంగు బంగారమైన సింగరేణికి సత్తుపల్లిలోని సింగరేణి గనులు ఓ బంగారు బాతులాంటివి. బొగ్గు ప్రాజెక్ట్‌లో సత్తుపల్లి సింహభాగం బొగ్గును సత్తుపల్లి గనులు అందిస్తున్నాయి. ఇక్కడ అధికారులు, కార్మికులు, సిబ్బందికి మెరుగైన సేవలందించాలన్నా, సత్తుపల్లి మరింత అభివృద్ధి చెంద్దాలన్నా, సత్తుపల్లి గనులు మరింత ముందుకు వెళ్ళాలన్న జిఎం నియామకం తప్పనిసరి. అంత ప్రాధాన్యత ఉన్న జిఎం నియామకం సత్తుపల్లి గనులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. సుమారు రూ.5 కోట్లతో హంగూ, ఆర్భాటాలతో 3 సంవత్సరాల క్రితం జిఎం కార్యాలయ భవనం నిర్మాణం జరిగింది. కానీ జిఎం నియామకం లేకపోవటంతో వాడుకలో లేకుండా పోతుంది. ఆధునిక సౌకర్యాలతో, విస్తీర్ణంలో విశాలంగా, సిబ్బందికి అనువుగా ఉండేలా తీర్చిదిద్దిన ఈ ఆఫీస్ ప్రస్థుతం వర్షపు నీటితో చిన్నపాటి చెరువును తలపిస్తుంది. లోతట్టు ప్రాంతంలో నిర్మాణం ముందుచూపు లేని అధికారులు జిఎం కార్యాలయ నిర్మాణంలో ముందుచూపు లేకుండా అడ్డగోలుగా నిర్మించారని కార్మికులు పెదవి విరుస్తున్నారు. ప్రధాన రహదారి కంటే సుమారు మూడు నుండి నాలుగు అడుగుల లోతులో నిర్మాణం జరగటంతో వర్షం వస్తే కార్యాలయం చుట్టూ చిత్తడిగా మారుతుందని కార్మికులంటున్నారు.

### భవనం సరే జిఎం ఎక్కడ..?

ఒక ప్రాజెక్ట్‌కు వెన్నెముకగా ఉండే పదవి జనరల్ మేనేజర్ (జిఎం). కానీ సింహబాగం బొగ్గునందించే ఈ కీలక ప్రాజెక్ట్‌కు ఇప్పటికీ జిఎం నియామకం జరగకపోవడం ఆశ్చర్యకరం. సిబ్బంది, కార్మికుల సమస్యలన వినే వారు లేరు. ఎటు వెళ్లినా జిఎం లేరన్న ఒకే సమాధానం ప్రతి పనికి సుమారు 70 నుండి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం వెళ్లాల్సిందే, అలా వెళ్ళిన ప్రతిసారి కార్మికులు, సిబ్బంది సెలవు పెట్టాల్సిందేనంటూ కార్మికులు వాపోతున్నారు. కార్మికుల ఆవేదన రోజువారీ సమస్యలు, సాంకేతిక అవాంతరాలు, బొగ్గు సరఫరాలో లోపాలు... ప్రతి పరిష్కారం కోసం ఇక్కడి కార్మికులు తిప్పలు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించే వారు ఎవరూ పట్టించుకోకపోవడంతో మాకు కార్యాలయం ఉంది కానీ అధికారి లేకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నామని సింగరేణి కార్మికులు వాపోతున్నారు.

### ప్రజాధనం వృథా..?

భవనం నిర్మాణానికి వెచ్చించిన కోట్లాది రూపాయలు వాడుకలో లేకపోవడం వల్ల వృథా అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి వర్షాకాలంలో భవనం పరిసరాలు నీట మునిగిపోవడంతో ప్రజాధనం 'గంగలో పోసిన పన్నీరు' అన్న సామెతను తలపిస్తోందంటున్నారు మేదావులు. అన్ని పరిశ్రమలకు ఇక్కడి నుండే పలు పరిశ్రమల నిర్వహణకు మూలమైన బొగ్గును సింగరేణి సిగలో సింహబాగమైన సత్తుపల్లి ప్రాజెక్ట్ అందిస్తుందని, లాభాల్లో కూడా సత్తుపల్లికి అగ్రభాగమేనని, ఇంత ప్రాధాన్యం ఉన్న ప్రాంతాని సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంపై కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. "కార్యాలయం కోసం రూ.5 కోట్లు వెచ్చించారు. కానీ ప్రజలకు ఉపయోగం ఏమిటని..? జిఎం లేకుండా ప్రాజెక్ట్‌ను ఎన్ని ఏళ్ళు నడిపిస్తారని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు? సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ సింగరేణిపై దృష్టి పెట్టి జిఎం నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని, జిఎం నియామకం జరిగితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, స్థానికులకు చోటా, మోటా కాంట్రాక్టులు దక్కుతాయని, కార్మికులు, సిబ్బంది మోములో చిరునవ్వులు చిందుతాయని కార్మిక సంఘాల నాయకులంటున్నారు.

# లీల



# చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్న పూరి

ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ , హీరోయిన్ ఛార్మి ఇద్దరు కలిసి సినిమాలు తీస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్య వీరిద్దరూ కలిసి తీసిన సినిమాలు ఏవి కలసి రాలేదు. బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. ఈ నేపథ్యంలో చిన జీయర్ స్వామిని కలిసి పూరి జగన్నాథ్, ఛార్మి ఆశీర్వాదం తీసుకున్నారు. రమణీజ చర్య విగ్రహాన్ని కూడా సందర్శించారు.చిన జీయర్ తో కొద్ది సేపు మాట్లాడారు. ఈసారి మీకు మంచే జరుగుతుంది అని జీయర్ స్వామి ఆశీర్వదించినట్టు తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ సేతుపతితో పూరి జగన్నాథ్ సినిమా చేస్తున్నారు.



# సెప్టెంబర్ 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో 'కన్నప్ప' స్ట్రీమింగ్

డైనమిక్ హీరో విష్ణు మంచు 'కన్నప్ప'తో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో దూసుకుపోయిన ఈ 'కన్నప్ప' చిత్రం ప్రస్తుతం ఓటీటీలోకి రాబోతోంది. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ చారిత్రక చిత్రం సెప్టెంబర్ 4 నుండి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. 'కన్నప్ప' చిత్రం విష్ణు మంచు కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. తిన్నడు పాత్రలో ఓ గిరిజన యోధుడిగా ఆయన పోషించిన పాత్ర అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలను సైతం అందుకుంది. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై పద్మశ్రీ డా. మోహన్ బాబు నిర్మించగా.. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ అద్భుతంగా తెరకెక్కించారు. న్యూజిలాండ్‌లోని అందమైన ప్రకృతి దృశ్యాలలో చిత్రీకరించబడిన ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలిచింది. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, మోహన్ లాల్, అర్పిత్ రాంకా, ప్రీతి ముకుందన్ వంటి తారాగణం కీలక పాత్రల్లో నటించారు. ప్రభాస్, అక్షయ్ కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించడం వల్ల ఈ చిత్రం మరింత ఆకర్షణీయంగా మారింది. వీరి స్పెషల్ అప్పియరెన్స్ సినిమాను అందరి దగ్గరకు తీసుకు వెళ్లింది. కాజల్ అగర్వాల్, మధుబాలా ఇతర ముఖ్యమైన పాత్రలను పోషించారు.విష్ణు మంచు కుమారుడు అవ్రామ్ మంచు నటుడిగా అరంగేట్రం చేయడం, అతని కుమార్తెలు అరియానా, వివియానా ఓ పాటలో నటించడంతో మరింత స్పెషల్‌గా మారింది. స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందరి హృదయాల్ని తాకింది. 'శివా శివా శంకరా' అనే పాట అగ్రస్థానంలో నిలిచింది.

# మూవీ చూస్తుంటే కాలేజ్ డేస్ గుర్తొస్తాయి



శివాని నాగరం

'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం. తాజాగా శివాని నటించిన సినిమా లిటిల్ హార్ట్స్ ఈ నెల 5వ తేదీన విడుదల అవుతున్న సందర్భంగా శివాని మీడియాతో చిట్ చాట్ చేసింది. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి నా చిన్నప్పటి స్నేహితుడు. ఆయన ద్వారా 'లిటిల్ హార్ట్స్' ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చింది. మంచి స్టోరీ ఉంది. విను అని సింజిత్ చెప్పాడు. డైరెక్టర్ సాయి మార్తాండ కథ చెప్పినప్పుడు చాలా బాగా అనిపించింది. ప్రతి క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు మూవీ తర్వాత కొన్ని ఆఫర్స్ వచ్చాయి. కానీ సెలెక్టివ్‌గా వెళ్లాలని వెయిట్ చేశాను. సినిమాను థియేటర్ దాకా వెళ్లి చూడాలంటే అందులో మంచి కంటెంట్ ఉండటం లేదు. అలా కంటెంట్ ఉన్న మూవీ చేయాలనే టైమ్ తీసుకున్నా. అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమాలో లవ్ స్టోరీతో పాటు ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది. 'లిటిల్ హార్ట్స్' లో అలా కాదు. ఇది కంప్లీట్ లైట్ హార్టెడ్ మూవీ. కాలేజ్ డేస్‌లో ఉండే ఫన్‌తో సాగుతుంది.'లిటిల్ హార్ట్స్' లో కాత్యాయని అనే క్యారెక్టర్‌లో నటించాను. ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా సిద్ధమవ్వలేదు. కాత్యాయని క్యారెక్టర్ ప్రేక్షకులు తమతో తాము పోల్చుకునేలా ఉంటుంది. అఖిల్, కాత్యాయని స్నేహం, ప్రేమ చూస్తుంటే మీకు మీ కాలేజ్ డేస్ గుర్తొస్తాయి. మేమూ ఇలాగే ఉండేవాళ్లం అనిపిస్తుంది. కాత్యాయని క్యారెక్టర్ నా లైఫ్ లో కూడా రిలేటబుల్‌గా ఉంది. నేను కాలేజ్‌లో యావరేజ్ స్టూడెంట్ నే. స్టూడెంట్ లైఫ్‌లో మనం చేసిన పనులన్నీ 'లిటిల్ హార్ట్స్' చూస్తుంటే గుర్తొస్తాయి. వంశీ నందిపాటి, బన్నీవాస్ ఎంటర్ అయ్యాక, బిగ్గర్ స్కేల్ రిలీజ్ కు తీసుకెళ్తున్నారు. ఓవర్సీస్ లో కూడా మా మూవీ బాగా రిలీజ్ అవుతోంది. నేను డైరెక్ట్‌గా మూవీస్‌లోకి వచ్చాను, నేను వాళ్లలా సోషల్ మీడియాలో దూకుడుగా ఉండలేను. 'లిటిల్ హార్ట్స్' సినిమా ఎంత ఫన్‌గా ఉందో, షూటింగ్ చేసేప్పుడు కూడా అంతే హ్యాపీగా చేశాం. ఎక్కువమంది సేమ్ ఏజ్ గ్రూప్ కాబట్టి అంతా ఫ్రెండ్స్ లా కలిసిపోయాం.'లిటిల్ హార్ట్స్' సినిమాతో నాకు స్కూల్, కాలేజ్ డేస్ గుర్తొచ్చాయి. సమ్మర్ క్యాంప్‌కు వెళ్లిన ఫీల్ కలిగింది. 'లిటిల్ హార్ట్స్' లో మ్యూజిక్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. రాజాగాడికి పాట నా ఫేవరేట్ సాంగ్. ఈ పాటలో నేను, మౌళి కలిసి ఒక హుక్ స్టెప్ చేశాం.ఈ మధ్యలో కొత్త హీరోయిన్స్ చాలా మంది వచ్చి ఉండొచ్చు. అయితే నేను అవన్నీ ప్లాన్ చేసుకోని చూడను. నా దగ్గరకు మంచి అవకాశం వస్తే చేస్తా. థియేటర్, ఓటీటీ అనే తేడాలు చూడాలనుకోవడం లేదు. ఎంత పెద్ద సినిమా అయినా ఓటీటీలోకి రావాల్సిందే. ఓటీటీలో వెబ్ సిరీస్ అవకాశాలు వచ్చినా చేసేందుకు రెడీగా ఉన్నాను. నా మొదటి చిత్రంలో బాగా ఏడ్చేశాను. రెండో సినిమా 'లిటిల్ హార్ట్స్' లో మంచి ఫన్ ఉన్న నవ్వించే క్యారెక్టర్ దొరికింది. ఒక రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ మూవీ చేయాలని అనుకుంటున్నా. నెక్స్ట్ సుహాస్‌తో హే భగవాన్ అనే మూవీలో నటిస్తున్నా. ఇదొక కంప్లీట్ హిలేరియస్ ఎంటర్ టైనర్. ఇప్పటికే గ్లింప్స్ రిలీజ్ చేశాం. షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఇవి కాకుండా మరో రెండు చిత్రాలు లైనప్‌లో ఉన్నాయి.

# 'మిరాయ్'లో శ్రియ పోస్టర్ రిలీజ్



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం మిరాయ్. ఈ సినిమాలో నటి శ్రీయ శరన్ ఓ కీలక పాత్ర పోషిస్తోంది. ఈమెకు సంబధించిన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమాలో శ్రీయ అంబికాగా తల్లి పాత్రలో నటించారు. సినిమాలో ఇది అత్యంత కీలమైన పాత్రగా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్తున్నారు. విడుదలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సినిమా పబ్లిసిటీలో భాగంగా శ్రీయ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా నటిస్తోంది. జగపతిబాబు మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు.

# మార్క్‘ టైటిల్ గ్లింప్స్ రిలీజ్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి 'మార్క్‘ టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మార్క్‘ చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మార్క్‘ సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. 'మార్క్‘ సినిమా టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ ఆటిట్యూడ రూత్ లెస్, కింగ్...అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్ లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్ ను పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే టైటిల్ 'మార్క్‘ ఉంది. ఈ గ్లింప్స్ కు అజనీష్ లోకనాథ్ అందించిన బీజీఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతోంది. కిచ్చా సుదీప్, విక్రాంత్, నవీన్ చంద్ర, దీప్షిక, రోహిణీ ప్రకాష్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ శేఖర్ చంద్ర, ఎడిటర్ ఎస్ఆర్ గణేష్ బాబు, కొరియోగ్రాఫీ శోభి పాల్ రాజ్, యాక్షన్ సుప్రీమ్ సుందర్, కెవిన్ కుమార్, సంగీతం అజనీష్ లోకనాథ్.




# కిష్కింధపురి ట్రైలర్ ఆవిష్కరణ

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మిస్టీరియస్ చిత్రం థ్రిల్లర్ 'కిష్కింధపురి.' అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ చేశారు. 'ఊరికి ఉత్తరాన, దారికి దక్షిణాన పశ్చిమ దిక్కున ప్రేతాత్మలన్నీ పేరు వినగానే తూర్పుకు తిరిగే ప్రదేశం' అనే డైలాగులతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. హీరో, హీరోయిన్ సహా కొంతమంది స్నేహితుల ఆత్మలని అన్వేషిస్తూ సువర్ణ మాయ ఇంటిలోకి వెళ్తారు. అక్కడ వారు ఊహించని భయంకరమైన పరిస్థితులు ఎదురుకావడం మైండ బ్లోయింగ్ థ్రిల్ ని అందించాయి. దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి ఒక యూనిక్ హారర్ థ్రిల్లర్ ని ప్రజెంట్ చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అదరగొట్టారు. ట్రైలర్ క్లైమాక్స్‌లో అనుపమ పరమేశ్వరన్ కనిపించిన తీరు హైలెట్ గా నిలిచింది.చిన్మయ్ సలాస్కర్ సినిమాటోగ్రఫీ, చైతన్య భరద్వాజ్ సంగీతం థ్రిల్ ని మరింతగా పెంచాయి. సెట్స్ గ్రాండ గా వున్నాయి. విజువల్స్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వున్నాయి. నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ షార్ప్ గా వుంది. ఈ చిత్రానికి జి. కనిష్క క్రియేటివ్ హెడ దరహాస్ పాలకొల్లు కోరైటర్. మొత్తంమీద ట్రైలర్ కిష్కింధపురిపై అంచనాలని మరింతగా పెంచింది.



# విపత్తుగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నాయి. ఇది ఆకస్మిక విపత్తు కాదని వెల్లడించాయి. వర్షాలువరదలతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వచ్చే సీజన్లలో సాగుపై ఈ పరిస్థితి ప్రభావముంటుందని సిపిఐ తెలిపింది. పంజాబ్ కోసం క్ర మంగా జరిగే కేటాయింపులకు మించి సహాయ నిధిని అదనంగా విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నష్టపోయిన రైతులకు, కుటుంబాలకు సముచిత ప్యాకేజి ప్రకటించాలని కోరింది. జరిగిన నష్టానికి న్యాయం జరిగేలా పరిహారం ఇవ్వాలని సూచించింది. రాబోయే సాగు సీజన్లపై దుష్ప్రభావం తగ్గించేలా తగు చర్యలను తక్షణమే తీసుకోవాలని, విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, ఇన్‌పుట్ సబ్సిడీ రేట్లు ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఆరోగ్య సేవలను మెరుగు పర్చాలని, వైద్య సామర్థ్యం పెంచాలని, విద్యా సంస్థలు పునరుద్ధరించాలని, సర్వం కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేసింది. ఆపద సమయంతో పంజాబ్ రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తామని సిపిఐ హామీనిచ్చింది. ముంపుకు గురైన రాష్ట్రాల ప్రజలకు ధైర్యం ఇచ్చేందుకుగాను యుద్ధప్రతిపదికన చర్యలను తీసుకోవాలని, దయతో వ్యవహరించాలని కేంద్రాన్ని సిపిఐ కోరింది. సిపిఐ (ఎంఎల్) కూడా పంజాబ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేసింది. సముచిత పరిహారం, పునరావాసానికి హామీనివ్వాలని, సమగ్ర వరద సహాయ ప్యాకేజి ప్రకటించాలని కోరింది. హిమాచల్ ప్రదేశ్ సహా హిమాలయ రాష్ట్రాల్లో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని, జమ్మూలో తావి నది ఉధృతంగా ప్రవహిస్తోందని సిపిఐ(ఎంఎల్) పేర్కొంది. పర్యావరణంలో మార్పులు, మంచు పర్వతాలు కరిగి వరదలు రావడం, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, ముందస్తు ప్రణాళికలు లేని మౌలిక వసతుల ప్రాజెక్టులు వంటి వాటి ప్రభావాన్ని అధ్యయనం చేయడం కోసం ఉన్నత స్థాయి శాస్త్రీయ కమిషన్ ఏర్పాటు చేయాలని, సుస్థిర ప్రణాళికలు తక్షణమే రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. పంజాబ్‌లో 23 జిల్లాలు ముంపునకు గురయ్యాయని, 14 లక్షల మంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఆహార కొరత, సరఫరా గొలుసులకు ఆటంకాలు, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి లేకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) డిమాండ్ చేసింది.

### విపత్తుల (సవరణ) చట్టం వెనక్కి : ఎఐకెఎస్

రాజ్యాంగబద్ధ విధులను బీజేపీ ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేస్తుండటం సిగ్గుచేటని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రాజన్ క్షీర సాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. ఉత్తర రాష్ట్రాలను వరదలు ముంచెత్తడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లో సముచిత సహాయక చర్యలు లేకపోవడాన్ని దుయ్యబట్టారు. చట్టబద్ధంగా బాధితులకు సముచిత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విపత్తు నివారణ (సవరణ) చట్టం 2025ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, బాధిత రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపులు సముచితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరిహారానికి సంబంధించిన నిబంధనలను సవరించాలని, మరణాలకు రూ.25 లక్షలు, ప్రతి హెక్టారు పంట నష్టానికి రూ.50వేలు చొప్పున, వ్యవసాయ సామగ్రికి సముచితంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఈర్షావాది, వయనాడ్, జోషిమఠ్, ధరాలీ సహా గతంలో విపత్తులప్పుడు బాధితులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చాలని, విపత్తుల సమయంలో సమర్ధ సేవలు అందించేలా స్థానిక ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం జాతీయ విపత్తులను వాడుకోవడాన్ని మోదీ ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. రాజకీయ పార్టీలతో అనుబంధానికి అతీతంగా పౌరులందరినీ కాపాడే రాజ్యాంబద్ధ ధర్మానికి కట్టుబడ లేకపోతే మానవాళి కష్టాలు పట్టవని, ప్రజల సంక్షేమం కంటే కార్పొరేట్ ప్రయోజనాకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తేలిపోతుందని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య పేర్కొన్నారు.

# విధుల్లో చేరిన లెఫ్టినెంట్ జనరల్ హార్పల్ సింగ్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడిగా నియమితులైన లెఫ్టినెంట్ జెనరల్ కల్నల్ హార్పల్ సింగ్ బుధవారం విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసేందుకు రూపొందించిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ నిమిత్తం బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి అదిత్యాదాస్ నాథ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్ లతో పాటు ఇ. ఎన్.సి లు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు లను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సివిల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రుడైన లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ టన్నెల్ నిర్మాణ రంగంలో అపార అనుభవం గడించిన దృష్ట్యా ఆయనను ఈ శాఖలో నియమించిన విషయం విదితమే.

# కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన ఆర్థికమంత్రులు ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇప్పటివరకు ఉన్న నాలుగు శ్లాబులను రెండు శ్లాబులకు కుదించాలని కేంద్రం చేసిన ప్రతిపాదనను జిఎస్‌టి కౌన్సిల్ మంత్రులబృందం కూడా సమ్మతించింది. ఈ ప్రతిపాదనలు రెండు రోజుల కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు రాకముందుగానే ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు జాగ్రత్తపడ్డాయి. సమాజానికి హానికరమైన, చాలా విలాసవంతమైన వస్తువులపై కేంద్రం విధించాలని ప్రతిపాదించిన 40 శాతం జిఎస్‌టిలో కూడా తమ వంతు వాటా ఇవ్వాలని తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ,పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు గతవారంలో సమావేశమయ్యారు. జిఎస్‌టిలో 12, 18 శాతం శ్లాబులను తొలగించిన తర్వాత ఇప్పటివరకూ వాటివల్ల వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు కోత పడుతుంది. దీనిని ఎలా భర్తీచేసుకోవాలన్నవిషయంపై వారు చర్చించారు. దీనివల్ల కలిగే నష్టాన్ని పరిహారంగా రాష్ట్రాలకు చెల్లించాలని వారు కోరుతున్నారు. రెండు రోజుల సమావేశంలో ఈ విషయం ప్రధానంగా చర్చలకు తీసుకురావాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ఆర్థికమంత్రులు నిర్ణయించుకున్నారు. జార్ఖండ్ రాష్ట్ర ఆర్థికమంత్రి రాధాకృష్ణ కిషోర్ మాట్లాడుతూ, జిఎస్‌టిలో శ్లాబుల మార్పులు, సంస్కరణలవల్ల తమ రాష్ట్రానికి రూ.2,000 కోట్ల మేరకు ఆదాయనష్టం వస్తుందని చెప్పారు. ''ఒకవేళ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఎంత నష్టం జరిగినాగానీ ఆ పరిహారం చెల్లించేందుకు సిద్ధపడితే ఎజెండా ఆమోదించేందుకు తమకు ఎలాంటి సమస్యలూ ఉండబోవన్నారు. ఈ సమస్య ఓటింగ్ వరకూ వస్తుందని తాను భావించడంలేదని రాధాకృష్ణ కిషోర్ అన్నారు. సమాఖ్యరాజ్యాంగ వ్యవస్థలో రాష్ట్రాలకు కేంద్రం ఈ విధమైన ఆర్థిక నష్టపరిహారం చెల్లించడం రాజ్యాంగబద్ధమైన విషయమని, ఇది కేంద్రం బాధ్యత అని అన్నారు. ఈ సమావేశాలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షత వహిస్తారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థికమంత్రులూ ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. పన్నుల నిష్పత్తిని నాలుగు శ్లాబులకు బదులుగా రెండు శ్లాబులకు కుదించే విషయంపై ఈ సమావేశాల్లో కీలక నిర్ణయం తీసుకుంటారు. ఇప్పటివరకు నాలులు అంచెల వ్యవస్థగా 5,12,18,28శాతాలుగా వస్తుసేవలపై జిఎస్‌టిలు వసూలు చేస్తున్నారు. వీటికి బదులుగా కేవలం 5,18 శాతాల పన్నులు మాత్రమే వస్తుసేవలపై విధించాలన్నది ప్రధాన ఉద్దేశం. 2017 జులై 1వ తేదీన ఈ నాలుగు అంచెల జిఎస్‌టి విధానం అమలులోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు,ప్రజల్లో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. జిఎస్‌టి వసూళ్ళలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు మొదటినుండీ విమర్శిస్తున్నాయి. మొదట నష్టపరిహార యంత్రాంగాన్ని ఐదేళ్ళపాటు అమలు చేశారు. ఈ పరిహారం 2022 జూన్ 30వ తేదీతో ముగిసింది. ఆ తర్వాత దీనిని నాలుగేళ్ళు పొడిగించారు. ఈ ఆదాయ వసూళ్ళను కోవిడ్ సమయంలో వచ్చిన నష్టానికిగాను కేంద్రం జమచేసుకుంది. ఈ అక్టోబరు,నవంబరునాటికి ఈ రీపేమెంట్ పూర్తవుతుంది.

# మమ్మల్ని చంపుతోంది

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ట్రంప్ 'ద స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో'కు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు మూడూ అనేక సంవత్సరాలుగా అధిక సుంకాలభారం మోపి అమెరికా నుండి ధనాన్ని పిండుకుంటున్నాయని, అమెరికాను చంపుకు తింటున్నాయని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇతర దేశాలకంటే తాను టారిఫ్‌లే ఉత్తమమని, వాటిని వి ధించడంవల్లనే దేశాలు లొంగివచ్చారన్నారు. ''ప్రపంచంలో ఏ మానవుడికంటే కూడా టారిఫ్‌లే ఉత్తమమైనవి, ఇప్పుడు మేం సుంకాలు విధించడంవల్ల, వారు సుంకాలు తగ్గించుకుంటున్నారు, ప్రపంచంలో అత్యధికంగా సుంకాలు విధించేది భారతదేశమే, ఇంకా మీకు తెలుసా? వారు ఇప్పుడు సుంకాలు లేవంటున్నారు, ఇంకెంతమాత్రం సుంకాలు ఉండబోవని నాకు ఆఫర్ ఇస్తున్నారు, అందువల్ల మేం ఇకమీదట ఆర్థికంగా చాలా బలోపేతం అవుతాం'' అని చెప్పారు. వివిధ దేశాలపై ఇష్టానుసారంగా సుంకాలు విధించే చట్టబద్ధ అధికారం ట్రంప్‌కు లేదని, అది న్యాయవిరుద్ధమని ఫెడరల్ అప్పీల్ కోర్టు ఇటీవల జారీ చేసిన ఉత్తర్వు గురించి ప్రశ్నించినప్పుడు, ట్రంప్ తనను సమర్థించుకుంటూ, ఈ కోర్టు కేసును ఇతర దేశాలు ప్రేరేపించినవే ఎందుకంటే వారు న్యాయస్థానాన్ని ఒక అవకాశంగా తీసుకుని మా నుండి ప్రయోజనం పొందాలనుకుంటున్నారు, ఇంకెంతమాత్రం వారు మా నుండి ప్రయోజనాలు పొందలేరు'' అని ట్రంప్ హెచ్చరించారు. ఆ తర్వాత ఆయన వైట్‌హౌస్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, ''భారతదేశంలో అమెరికా చాలా బాగా కలిసిపోతోంది, ఆ దేశంతో సంబంధాలు బాగున్నాయి, కానీ, మా రెండు దేశాల మధ్య సంబంధాలు అనేక సంవత్సరాలుగా ఏకపక్షంగానే ఉన్నాయి, నేను అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మార్పులు వచ్చాయి, భారీగా సుంకాలు విధించాను, ఇప్పుడు మేం భారతదేశంలో బాగా కలిసిపోయాం'' అని టారిఫ్‌లపై ఒక ప్రశ్నకు సమాధానంగా ట్రంప్ చెప్పారు. అనేక సంవత్సరాలుగా భారత్—అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఏకపక్షంగా కొనసాగుతున్నాయి, వారు మా నుండి భారీగా సుంకాలు వసూలు చేసుకుంటున్నారు, వారే మా దేశానికి భారీ ఎత్తున ఎగుమతులు చేసి లాభం పొందుతున్నారు తప్ప, మేం భారతదేశంలో చేస్తున్న వ్యాపారం చాలా తక్కువ, ఆ దేశానికి అమెరికా చేస్తున్న ఎగుమతులు చాలా చాలా తక్కువ, వారు మా వస్తువులను దిగుమతి చేసుకున్నందుకుగాను భారీగా సుంకాలు వసూలు చేస్తున్నారు, ప్రపంచంలో అన్నిదేశాలకంటే ఈ సుంకాలు చాలా ఎక్కువ, మేం వారితో తక్కువ వ్యాపారం చేసినాగానీ వారు మాతో వ్యాపారం కొనసాగిస్తున్నారు ఎందుకంటే మేం ఇప్పటివరకూ తెలివితక్కువవాళ్ళలాగా ఉండిపోయి వాళ్ళ దగ్గర నుండి ఎక్కువ టారిఫ్‌లు వసూలు చేయలేదు కాబట్టే'' అని ట్రంప్ విమర్శించారు. అమెరికాలోకి భారతదేశం తన ఉత్పత్తులను వరద ప్రవాహంలా పంపిస్తోందని అన్నారు. ''వారు తమ ఉత్పత్తులను అమెరికాలోకి గుమ్మరిస్తున్నారు, ఎందుకంటే వాటిని ఇక్కడ తయారు చేసుకోవడంలేదు, కానీ మేం మాత్రం వాళ్ళ దేశానికి ఎగుమతులు పంపడంలేదు, ఎందుకంటే భారతదేశం మా నుం డి నూటికి నూరుశాతం టారిఫ్‌లు వసూలు చేస్తోంది'' అన్నారు. భారత్ భారీ టారిఫ్‌లకు హార్లీ డేవిడ్‌సన్ మోటారు సైకి ళ్ళ వ్యాపారాన్ని ఉదాహరణగా చెప్పారు.

హార్లీడేవిడ్‌సన్ కంపెనీ తన బైకులను భా రత్‌లో భారీగా అమ్మకాలు చేయలేకపోయిందని, ఎందుకంటే భారతదేశం ఈ కంపెనీ నుండి 200 శాతం దిగుమతి సుంకాలు వసూ లు చేయడమే కారణమని అన్నా రు. ''మరి అందువల్ల ఏం జరుగుతోంది? హార్లీ డేవిడ్‌సన్ భారత్‌కు వెళ్ళి అక్క డే ఒక మోటారు సైకిలు ప్లాం టు నిర్మించారు, ఇప్పు డు వారు భారీగా టారిఫ్‌లు చె ల్లించాల్సిన అవసరం లేదు, మేం కూడా అంతే మరి'' అన్నారు. భారతదేశం ఇప్పుడు సుంకాల్లో కోతలు విధించి అమెరికాకు ఆఫర్ ఇచ్చిందని సోమవారంనాడు ట్రంప్ చెప్పారు. కానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రం అమెరికాతో తాము రాజీపడే ప్రశ్నేలేదని అంటున్నారు. రైతులు, చిన్న,సూక్ష్మ,మధ్యతరహా పరిశ్రమల విషయంలో రాజీపడేదిలేదని మోదీ అంటున్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com